www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
సోమవారం
23-12-2024
సంపుటి : 01 | సంచిక : 231 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS


డా॥ కాచం సత్యనారాయణ
CMD

# జైశంకర్‌కు నేషనల్ ఎమినెన్స్ అవార్డు

- పబ్లిక్ లీడర్‌షిప్ విభాగంలో పురస్కారం ప్రదానం
- ప్రజా నాయకత్వంలో ఆయన చేసిక కృషికి ఈ అవార్డు ఇస్తున్నాం
- వెల్లడించిన సౌత్ ఇండియన్ ఎడ్యుకేషన్ సొసైటీ



**దిల్లీ:** కేంద్ర విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి నేషనల్ ఎమినెన్స్ అవార్డు అందుకున్నారు. పబ్లిక్ లీడర్‌షిప్ విభాగంలో సౌత్ ఇండియన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేసింది. ప్రజా నాయకత్వంలో జైశంకర్ చేసిక కృషికి ఈ అవార్డు ఇస్తున్నట్లు నిర్వహకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జైశంకర్ మాట్లాడుతూ దేశంలోని పురాతన విద్యా సంఘాలలో ఒకటైన ఎస్ఐఈఎస్ తనకు ఈ అవార్డు బహూకరించినందుకు... మిగతా2లో...

# కువైట్ ప్రధానిని భారత్‌కు ఆహ్వానించిన మోదీ

- షేక్ అహ్మద్ అల్ అబ్దుల్లాతో సమావేశం
- వివిధ రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలి
- రెండు దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేయాలి
- కువైట్ బృందం ఒకసారి భారత్‌లో పర్యటించాలన్న మోదీ

2



## రాహుల్ గాంధీకి సమన్లు జారీ

- ఎన్నికల ప్రచారంలో కులగణన చేసిన వ్యాఖ్యలపై
- బరేలీ జిల్లా కోర్టు సమన్లు జారీ

2





సినీ ప్రముఖుల ఇళ్లపై
# దాడులు సరికాదు

- ఈతరహా ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నాం
- శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలి
- ఈ విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదు
- సంధ్య థియేటర్ ఘటనతో సంబంధంలేని పోలీసు సిబ్బంది స్పందించకుండా ఉన్నతాధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- డీజీపీ, కమిషనర్‌లను ఆదేశించిన సీఎం రేవంత్

2



అల్లు అర్జున్ ఇంటిపై
## రాళ్లదాడి

- ఇంటి వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన
- ఇంట్లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నం
- రేవతి మరణానికి కారకుడంటూ నినాదాలు
- రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్
- పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు

విద్యార్థి సంఘాల ఆందోళనతో జూబ్లీహిల్స్‌లోని నటుడు అల్లు అర్జున్ ఇంటి వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. రేవతి మరణానికి అల్లు అర్జున్ కారణమంటూ నినాదాలు చేశారు. రేవతి కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కొందరు అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు విసిరారు. ఆయన ఇంట్లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. రాళ్లు తగిలి అల్లు అర్జున్ ఇంటి ఆవరణలోని పూల కుండీలు ధ్వంసమయ్యాయి. విద్యార్థి సంఘాల ఆందోళన నేపథ్యంలో అదనపు పోలీసులు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. భారీగా మోహరించారు. ఘటన జరిగిన సమయంలో అల్లు అర్జున్ ఇంట్లో లేరు. సమాచారం తెలుసుకున్న ఆయన మామ చంద్రశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

పౌరుల భద్రత, రక్షణ అన్నింటికంటే
## ముఖ్యం

- తెలంగాణ ప్రభుత్వం చొరవ వల్లే భరోసా కేంద్రాలను ఏర్పాటు
- ప్రతి జిల్లాలో కేంద్రాలు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం
- మహిళలకు ఎలాంటి సమస్యలున్నా భరోసా కేంద్రానికి రావొచ్చు
- అల్లు అర్జున్ కు మేం వ్యతిరేకం కాదు
- చట్ట ప్రకారం ఆయనపై చర్యలు తీసుకున్నాం
- ఆయన సినీ హీరో కావొచ్చు.. పరిస్థితులను అర్థం చేసుకోవాలి
- జర్నలిస్టుపై దాడి కేసులో సినీనటుడు మోహన్‌బాబుపై కేసు నమోదు చేశాం
- తెలంగాణ డీజీపీ జితేందర్

2



చంద్రబాబు భద్రతకు
# అటానమస్ డ్రోన్లు

సాంకేతిక సాయాన్ని వినియోగించుకుని భద్రతను గణనీయంగా తగ్గించుకున్న సీఎం

తక్కువ మంది సిబ్బంది, టెక్నాలజీ సాయంతో ప్రణాళికతో వ్యవహరించాలని ఆదేశాలు



**విశ్వంభర, అమరావతి:** ఏపీ సీఎం చంద్రబాబు సాంకేతిక సాయాన్ని వినియోగించుకుంటూ తనకున్న భద్రతను గణనీయంగా తగ్గించుకున్నారు. భారీ భద్రత, బందోబస్తుకు దూరంగా ఉంటున్నారు. సీఎం నివాసంలో అటానమస్ డ్రోన్ల సాయంతో పరిసర ప్రాంతాల భద్రత పర్యవేక్షణను పోలీసులు చేపట్టారు. తక్కువ మంది సిబ్బంది, టెక్నాలజీ సాయంతో ప్రణాళికతో వ్యవహరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు ఉండవల్లిలోని సీఎం నివాసంలో అత్యాధునిక డ్రోన్‌ను ఏర్పాటు చేశారు. ఆ డ్రోన్ తనకు ప్రోగ్రాం ఇచ్చిన విధంగా ప్రతి రెండు గంటలకు ఒకసారి పరిసర ప్రాంతాల్లో ఎగిరి వీడియోను షూట్ చేస్తుంది. సాధారణ పరిస్థితుల కంటే.. మిగతా2లో...

మెరుగైన విద్య, వైద్యం, సామాజిక భద్రత కల్పించడమే
# ప్రభుత్వ ధ్యేయం

- ఆయా ప్రాంతాల అవసరాలను బట్టి ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు
- జాతీయ రహదారులపై ప్రతి 35 కి.మీ.కు ఒక ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు
- రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంపు
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- రెంజల్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రారంభోత్సవం చేసిన మంత్రి



2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 91 | ₹ 113 |
| స్కిన్‌తో | స్కిన్‌లెస్ |
| ₹ 166 | ₹ 190 |

కాంగ్రెస్ నాయకులను
# గల్లా పట్టి నిలదీయండి..

ఇప్పుడు మేల్కొకపోతే భరోసా ఉండదు..

రైతు భరోసా ఎగవేతల మోసాన్ని ఎదురించాలి

అన్నదాతలకు కేటీఆర్ బహిరంగ లేఖ

2



## అసెంబ్లీ వేదికగా సినీ ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర

- పగబట్టినట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు
- సంధ్య థియేటర్ ఘటనలో మృతురాలి కుటుంబానికి అందరూ బాసటగా నిలిచారు
- ఇకనైనా రేవంత్ కక్ష సాధింపు చర్యలు వీడాలి : కేంద్రమంత్రి బండి సంజయ్



2

తెలంగాణ అస్థిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం
# దెబ్బతీస్తోంది

- ఈ చర్యను యావత్ తెలంగాణ సమాజం కలిసికట్టుగా అడ్డుకోవాలి
- తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేశారు
- మహిళలను, పండుగలను అవమానించారు
- ఎమ్మెల్సీ కవిత

2



## సినీ ప్రముఖుల ఇళ్లపై
# దాడులు సరికాదు

**విశ్వంభర, హైదరాబాద్:** సినీ ప్రముఖుల ఇళ్లపై దాడులు చేయడం సరికాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ తరహా ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిందిగా రాష్ట్ర డీజీపీ, నగర పోలీస్ కమిషనర్‌ను ఆదేశించానన్నారు. ఈ విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ ఘటనతో సంబంధంలేని పోలీసు సిబ్బంది స్పందించకుండా ఉన్నతాధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు.ఆదివారం మధ్యాహ్నం విద్యార్థి సంఘాల ఆందోళనతో జూబ్లీహిల్స్‌లోని నటుడు అల్లు అర్జున్ ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. సంధ్య థియేటర్ ఘటనలో రేవతి మరణానికి అల్లు అర్జున్ కారణమంటూ నినాదాలు చేశారు. రేవతి కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కొందరు అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు విసిరారు. ఆయన ఇంట్లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఇంటి ఆవరణలోని పూల కుండీలను ధ్వంసం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో సినీ ప్రముఖుల ఇళ్లపై దాడులను ఖండిస్తూ రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు.

## కువైట్ ప్రధానిని భారత్‌కు ఆహ్వానించిన మోదీ

**దిల్లీ:** ప్రధాని నరేంద్రమోదీ కువైట్ ప్రధాని షేక్ అహ్మద్ అల్ అబ్దుల్లా అల్ అహ్మద్ అల్ సబా ను భారత దేశానికి ఆహ్వానించారు. కువైట్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ షేక్ అహ్మద్ అల్ అబ్దుల్లాతో సమావేశమయ్యారు. ఇరుదేశాల సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశంపై ఆ సమావేశంలో చర్చించారు. రాజకీయ, వాణిజ్య, ఇంధన, రక్షణ, భద్రత, ఆరోగ్యం, ఎడ్యుకేషన్, టెక్నాలజీ, సాంస్కృతిక భాగస్వామ్యాలపై వీరిమధ్య చర్చ జరిగింది.రెండు దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఈ సమావేశంలో ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు. వివిధ రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు కువైట్ బృందం ఒకసారి భారత్‌లో పర్యటించాలని ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆహ్వానించారు. భారత విదేశాంగ శాఖ ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించింది.

## రాహుల్ గాంధీకి సమన్లు జారీ




**బరేలీ:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి యూపీ కోర్టు సమన్లు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కులగణనపై ఆయన చేసిన వ్యాఖ్యలపై బరేలీ జిల్లా కోర్టు ఈ సమన్లు జారీ చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.
'ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ కులగణనపై చేసిన వ్యాఖ్యలు దేశంలో అంతర్యుద్ధానికి దారి తీసేలా ఉన్నాయి. అందుకే ఆ వ్యాఖ్యలపై తొలుత ఎంపీ ఎమ్మెల్యే కోర్టులో కేసు దాఖలు చేశాం. అక్కడ కేసును కొట్టివేశారు. దీంతో బరేలీ జిల్లా కోర్టును ఆశ్రయించాం. ఈ క్రమంలోనే కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 7న హాజరుకావాలని కోర్టు అందులో పేర్కొంది' అని పిటిషనర్ తెలిపారు.

## జైశంకర్‌కు నేషనల్ ఎమినెన్స్ అవార్డు

(మొదటి పేజీ తరువాయి)
కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ వేదికలకు మహా పెరియవర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పెరియవర్ ప్రపంచ వేదికపై మన దేశం గొప్పదనాన్ని నిలబెట్టారని అన్నారు.
1966లో ఐక్యరాజ్య సమితిలో డా.ఎం.ఎస్ సుబ్బులక్ష్మి ఆలపించిన సార్వత్రిక సామరస్య గీతం మైత్రీమ్ భజతను ఆయనే రచించారని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం భారత్ ప్రపంచ దేశాలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ స్వతంత్ర శక్తిగా స్థిరపడుతోందని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో శాంతి స్థాపనకు కృషి చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా శ్రీ అన్న (మిల్లెట్స్)ని పునరుజ్జీవింపజేయడం, యోగాను ప్రపంచదేశాల్లో ప్రాచుర్యంలోకి తీసుకురావడం వంటి చర్యలు చేపడుతున్నామన్నారు. మన ఆలోచనలు, సామర్థ్యాలపై విశ్వాసంతో ముందుకు వెళ్లినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు.
పబ్లిక్ లీడర్‌షిప్, హ్యూమన్ ఎండీవర్, సోషల్ లీడర్‌షిప్, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి సౌత్ ఇండియన్ ఎడ్యుకేషన్ సొసైటీ కంచి కామకోటి పీఠాధిపతి పూర్వపు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి పేరు మీద ప్రదానం చేస్తుంటుంది.


## చంద్రబాబు భద్రతకు అటానమస్ డ్రోన్లు

(మొదటి పేజీ తరువాయి)
భిన్నంగా ఏవిధమైన మూమెంట్ కనిపించినా.. కొత్త, అనుమానాస్పద వస్తువులు కనిపించినా మానిటరింగ్ టీమ్‌కు మెసేజ్ పంపుతుంది. సీఎం నివాసంలో పెట్టిన ఈ డ్రోన్ అటానమస్ విధానంలో ఆటోపైలట్‌గా ఆయా ప్రాంతాల్లో ఎగురుతుంది. మళ్లీ వచ్చి నిర్దేశిత డక్‌పై ల్యాండ్ అయి తానే ఛార్జింగ్ పెట్టుకుంటుంది. ఈ డ్రోన్ పంపే డేటాను విశ్లేషించడం ద్వారా ఇంటి పరిసర ప్రాంతాల్లో సెక్యూరిటీని అధికారులు పర్యవేక్షిస్తున్నారు.
ప్రజలు, పార్టీ కార్యకర్తలను తనకు దూరం చేసేలా బందోబస్తు ఉండరాదని సీఎం చంద్రబాబు ఎన్ని సార్లు ఆదేశించినా.. ప్రొటోకాల్ నిబంధనల పేరుతో అధికారులకు అది కష్టతరంగా మారింది. సమస్యను అధిగమించేందుకు డ్రోన్ సాంకేతికత ద్వారా తనకున్న సిబ్బందిని ముఖ్యమంత్రి చంద్రబాబు గణనీయంగా తగ్గించేశారు. అన్ని జిల్లాల అధికారులు ఈ ఆదేశాలు పాటించాలని ప్రభుత్వం తేల్చి చెప్పింది. సీఎం ఆదేశాలతో భద్రతలో సమూల మార్పులు చేశారు. వైకాపా హయాంలో ముఖ్యమంత్రికి 980 మందితో భద్రత కల్పించేవారు. ప్రస్తుతం చంద్రబాబుకు కేవలం 121 మందితో భద్రత కల్పిస్తున్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు కాన్వాయ్‌లో 17 వాహనాలు ఉండగా.. జడ్ ప్లస్ భద్రత ఉన్న ప్రస్తుత సీఎం చంద్రబాబు వాహన శ్రేణి 11 వాహనాలకే పరిమితమైంది.



### తెలంగాణ అస్థిత్వాన్ని
# కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోంది

**విశ్వంభర, హైదరాబాద్:**
తెలంగాణ అస్థిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని.. ఈ చర్యను యావత్ తెలంగాణ సమాజం కలిసికట్టుగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ మహిళలను, పండుగలను అవమానించారని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి అందరి అమ్మ వంటిదని.. ఆ తల్లిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్, తెలంగాణ జాగృతి ఎన్నారై విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆన్‌లైన్ సమావేశంలో వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ వాసులతో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ ఎన్నారై విభాగం మహేశ్ బిగాల సమన్వయకర్తగా వ్యవహరించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎన్నారైలు పోషించిన పాత్రను మరవలేమన్నారు. ఉద్యమ సమయంలో ఎన్నో అవహేళనలకు గురైనా కూడా తెలంగాణ తల్లి మనతో స్ఫూర్తిని నింపిందని పేర్కొన్నారు. తెలంగాణ తల్లికి ఉద్యమ కారులు, కవులు, కళాకారులు కలిసి రూపం ఇచ్చారని, అలాంటి తల్లి రూపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం దారుణమని ఆవేదన వ్యక్తం



చేశారు. జొన్నలు, మక్కలు విదేశాల్లో కూడా పండుతాయని, అలాంటప్పుడు అవి తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమంటూ ప్రభుత్వం చెప్పడం సరికాదని సూచించారు. విగ్రహం మార్చడం విషయంలోనూ ప్రభుత్వం గోప్యత పాటించిందని, ప్రజల ఆమోదం ఉన్నట్లయితే గోప్యత ఎందుకు పాటించినట్లని ప్రశ్నించారు.
ఉద్యమ తెలంగాణ తల్లి కోసం మరొక పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఉద్యమ తెలంగాణ తల్లిపై ప్రేమతో విగ్రహ ప్రతిష్ఠాపన కోసం అనేక గ్రామాల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని వెల్లడించారు. కొత్త తెలంగాణ తల్లికి గెజిట్ జారీ చేసి ప్రజల మనోభావాలను దెబ్బతీశారని చెప్పారు. భారత మాత, అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు కూడా గెజిట్ ఉందా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు ఎన్నారైలు మాట్లాడుతూ బతుకమ్మకు పండుగకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావడానికి ఎమ్మెల్సీ కవిత ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ అస్థిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాడిని తిప్పికొట్టడంలో తాము కూడా భాగస్వాములవుతామని ప్రకటించారు.
ప్రపంచవ్యాప్తంగా వివిధ వేదికపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ఎండగుతామని, మన సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడుకోవడం కోసం కృషి చేస్తామన్నారు. ఉద్యమ తెలంగాణ తల్లిని రక్షించుకునే క్రమంలో తమ వంతు సాయం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం, జాగృతి రాష్ట్ర నాయకులు నవీన్ ఆచారి, వివిధ దేశాల బీఆర్ఎస్, జాగృతి నాయకులు జ్యోతి ముద్దం, నవీన్ రెడ్డి, నాగెందర్ రెడ్డి, సుమన్ బల్మూరి, నాగరాజు గుర్రాల, కల్యాణ్ కాసుగంటి, నందిని, అనిల్ శ్రీకర్, శేఖర్, కిశోర్, ప్రభాకర్, సంపత్, రవి దన్నపునేని, హరి ప్రసాద్, శ్వేత, ఆదర్శ, సుకృతి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## పౌరుల భద్రత, రక్షణ అన్నింటికంటే ముఖ్యం

**- తెలంగాణ డీజీపీ జితేందర్**

**విశ్వంభర, కరీంనగర్:** పౌరులుగా అందరూ బాధ్యతాయుతంగా ఉండాలని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు. సంధ్య థియేటర్ ఘటనపై ఆయన స్పందించారు. వ్యక్తిగతంగా తాము ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా డీజీపీ మాట్లాడారు.
"సంధ్య థియేటర్ ఘటన దురదృష్టకరం. అల్లు అర్జున్ కు మేం వ్యతిరేకం కాదు. చట్ట ప్రకారం ఆయనపై చర్యలు తీసుకున్నాం. పౌరుల భద్రత, రక్షణ అన్నింటికంటే ముఖ్యం. ఆయన సినీ హీరో కావొచ్చు.. క్షేత్రస్థాయి పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ఇలాంటి ఘటనలు పౌరుల భద్రతకు మంచిది కాదు. ప్రజల భద్రత కంటే సినిమా ప్రమోషన్ ముఖ్యమైన అంశం కాదు. జర్నలిస్టుపై దాడి కేసులో సినీనటుడు మోహన్‌బాబుపై కేసు నమోదు చేశాం. చట్ట ప్రకారం ఆయనపై చర్యలు ఉంటాయి.

**ప్రతి జిల్లాలో భరోసా కేంద్రాలు**

మహిళలు, చిన్నారుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజల భద్రత కోసం 24 గంటలు పని చేస్తున్నాం. తెలంగాణ ప్రభుత్వం చొరవ వల్లే భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. వీటి ఏర్పాటును సుప్రీంకోర్టు కూడా ప్రశంసించింది. ఇతర రాష్ట్రాల అధికారులు వచ్చి భరోసా కేంద్రాలను సందర్శిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కేంద్రాలు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం. దీని వల్ల మహిళలు, చిన్నారులకు మరింత భద్రత పెరుగుతుంది. మహిళలకు ఎలాంటి సమస్యలున్నా భరోసా కేంద్రానికి రావొచ్చు. ఇక్కడ న్యాయ నిపుణుడు, డాక్టర్ ఉంటారు. ఎలాంటి సమస్యలనైనా పరిష్కరిస్తారు" అని డీజీపీ జితేందర్ చెప్పారు.

### మెరుగైన విద్య, వైద్యం, సామాజిక భద్రత కల్పించడమే
# ప్రభుత్వ ధ్యేయం




**విశ్వంభర, నిజామాబాద్**
నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు హెలికాప్టర్ ద్వారా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లను ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ప్రజలకు మెరుగైన విద్య వైద్యం అందుబాటులోకి తెస్తూ సామాజిక భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రంలో రూ. కోటి 56 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ...., ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య, వైద్యం, సామాజిక భద్రతను ప్రజలకు కల్పించాలనే ప్రధాన లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గ నిర్దేశంలో ముందుకెళ్తున్నామని అన్నారు. ఇందులో భాగంగానే ఆయా ప్రాంతాల అవసరాలను బట్టి ఆరోగ్య ఉప కేంద్రాలు, పీహెచ్సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులను ఏర్పాటు చేస్తూ, పీ.హెచ్.సీలను సీ హెచ్ సీలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఇంకనూ 300 పైచిలుకు హెల్త్ సబ్ సెంటర్లు, 170 వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించామన్నారు. గ్రామీణ మారుమూల ప్రాంతాలతో పాటు ఆదివాసి ప్రాంతాలలో వీటి ఏర్పాటుకు తొలి ప్రాధాన్యత ఇస్తామని మంత్రి తెలిపారు. అత్యవసర సమయాలలో అన్ని ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక చికిత్స అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం ఇటీవలే 213 నూతన అంబులెన్స్ లను ప్రజలకు అంకితం చేసిందని గుర్తు చేశారు. ఇంకనూ మరో 85 వరకు అంబులెన్స్ లను అందుబాటులోకి తెస్తామని వివరించారు. 102 అమ్మఒడి వాహనాలు కూడా ఆయా ప్రాంతాలకు సమకూరుస్తామని అన్నారు.
రోడ్డు ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రుల ప్రాణాలను కాపాడేందుకు వీలుగా జాతీయ రహదారులపై ప్రతి 35 కిలోమీటర్లకు ఒక ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామని, వాటికి అంబులెన్స్ లను అనుసంధానం చేస్తామని తెలిపారు. నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలకు క్యాన్సర్ చికిత్స కేంద్రాలతో పాటు వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్ లు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని గుర్తించామన్నారు. వైద్య సేవల కోసం పేద ప్రజలు అప్పుల పాలు కాకుండా, అభద్రతాభావానికి గురికాకుండా వారికి అన్ని విధాలుగా ఆరోగ్య భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందని అన్నారు.
గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అన్ని ప్రాంతాల్లో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందేలా ప్రతి చోట సరిపడా వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా 90% వరకు ఖాళీలను భర్తీ చేస్తున్నామని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుండి 10 లక్షల రూపాయల వరకు పెంచుతూ, అనేక రకాల చికిత్సలను కొత్తగా ఆరోగ్యశ్రీ జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. అదనపు లేబరేటరీలను ఏర్పాటు చేస్తూ, డ్రగ్ ఇన్స్పెక్టర్లు, ఫుడ్ ఇన్స్పెక్టర్లను నూతనంగా నియమిస్తున్నామని వివరించారు. అవసరం అయిన చోట ఐవీఎఫ్ సెంటర్లను కూడా నెలకొల్పుతున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజా సంక్షేమం, వారి ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ముందుకెళ్తున్న తమ ప్రభుత్వానికి ప్రజలు అండదండగా నిలవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ వేదికగా సినీ ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర

**విశ్వంభర, హైదరాబాద్:** సినీ పరిశ్రమపై పగబట్టినట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. సంధ్య థియేటర్ ఘటనలో మహిళ మృతిని అందరూ ఖండించారన్నారు. శ్రీతేజ్ కోలుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని చెప్పారు. మృతురాలి కుటుంబానికి అందరూ బాసటగా నిలిచారన్నారు. ఈ సమస్య ముగిశాక అసెంబ్లీలో ఎంఐఎం సభ్యుడితో ప్రశ్న అడిగించారని.. సినిమా తరహా కథ అల్లి మళ్లీ సమస్యను సృష్టించారని బండి సంజయ్ ఆరోపించారు.
"ప్రణాళిక ప్రకారం అసెంబ్లీ వేదికగా సినీ ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర చేశారు. అల్లు అర్జున్ వ్యక్తిత్వ హననం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. గతంలో బీఆర్ఎస్‌ను ఎంఐఎం నిండా ముంచింది. ఎంఐఎంను నమ్మితే కాంగ్రెస్‌కూ బీఆర్ఎస్ గతే పడుతుంది. కలుషిత ఆహారం తిని గురుకుల విద్యార్థులు చనిపోతున్నారు. వారి కుటుంబాలను సీఎం ఏనాడైనా పరామర్శించారా?ఆ మరణాలకు మీరు బాధ్యత వహించారా?మీకో న్యాయం.. ఇతరులకు మరో న్యాయమా?ఇకనైనా రేవంత్ కక్ష సాధింపు చర్యలు వీడాలి"అని బండి సంజయ్ అన్నారు.

## కాంగ్రెస్ నాయకులను గల్లా పట్టి నిలదీయండి..



**విశ్వంభర, హైదరాబాద్:** అన్నదాతలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. వంచనను గ్రహించి ఆంక్షలు వద్దని ఆందోళన చేయాల్సిన వేళ ఇది అని తెలిపారు. ఇప్పుడు మేల్కోకపోతే భరోసా ఉండదు.. గోస మాత్రమే మిగులుతుందని చెప్పారు. జాగ్రత్తగా ఉండాలని.. రైతు భరోసా ఎగవేతల మోసాన్ని ఎదురించాలని సూచించారు. ఆంక్షలు.. కోతలతో సగం మందికి ఎగనామం పెట్టే ఎత్తులను చిత్తుచేయాలని సూచించారు. ప్రతి ఎకరాకు.. ప్రతి రైతుకు పెట్టుబడి ఇవ్వాల్సిందేనని పట్టుబట్టాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఎత్తులను, నక్క జిత్తులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను గల్లా పట్టి నిలదీయాలన్నారు.

## అమెరికాలో హనుమకొండ జిల్లా విద్యార్థి అనుమానాస్పద మృతి

**ఎమ్మెస్ చేయడానికి వెళ్లిన వంశీ**
**మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేలా చొరవచూపాలి**
**కేంద్రమంత్రి బండి సంజయ్ తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు**

**విశ్వంభర, కమలాపూర్:** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేట గ్రామానికి చెందిన బండి వంశీ అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఓ యూనివర్సిటీలో ఎమ్మెస్ చేయడానికి ఏడాదిన్నర క్రితం అమెరికా వెళ్లిన వంశీ అక్కడే చదువుకుంటూ పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి అతను ఉంటున్న అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో కారు సీట్లో మృతిచెంది కనిపించాడు. అక్కడే ఉన్న తోటి విద్యార్థులు ఆదివారం సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ విషయాన్ని కమలాపూర్ మండల బీజేపీ నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తీసుకువచ్చేలా చొరవ తీసుకోవాలని, ఘటనపై దర్యాప్తు చేయించాలని కోరారు.



# రాష్ట్ర స్థాయి గణిత ప్రతిభా పరీక్ష విజయవంతం

**- టీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కందికొండ శ్రీనివాస్**




**విశ్వంభర, హయత్‌నగర్:** హయత్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈపరీక్షకు 330మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈసందర్భంగా వివిధ విభాగాల లో ఉత్తీర్ణత సాధించిన 12మంది విద్యార్థులకు మెమొంటో, నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను ఎమ్మెల్సీ రఘుత్తమ్ రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి అందజేశారు. అదేవిధంగా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గణిత ఉపాధ్యాయులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి మాట్లాడుతూ గణితంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మిగిలిన అన్ని సబ్జెక్టులలోనూ ప్రతిభ చూపే అవకాశం ఉంటుంది కాబట్టి విద్యార్థులందరూ గణితం పట్ల శ్రద్ధ చూపాలని కోరారు.మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, ఈ కార్యక్రమం విద్యార్థుల గణితాభిరుచిని పెంపొందించడంతో పాటు ఉపాధ్యాయుల కృషిని గౌరవించడానికి, గణిత ప్రాముఖ్యతను సమాజంలో విస్తృతంగా ప్రచారం చేయడానికి ఒక ఉత్తమ వేదికగా నిలుస్తుందన్నారు.ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మరింత అనుభవజ్ఞులు నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, అందువల్ల ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ఎస్ సీఈఆర్ టీ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం గణితంలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్టుల మాదిరిగా మిగిలిన అన్ని సబ్జెక్టు లలోనూ ప్రతిభా పోటీ పరీక్షలు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో టీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కందికొండ శ్రీనివాస్ టీఎంఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కూకుడాల యాదగిరి రెడ్డి రాష్ట్ర స్థాయి మరియు జిల్లా స్థాయి అధికారులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు, వివిధ జిల్లాల టీఎంఎఫ్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, గణితాభిమానులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు; మరియు కాంగ్రెస్ నాయకులు కొత్తకుర్మ శివ కుమార్, కొత్తపల్లి జైపాల్ రెడ్డి, బద్దుల వెంకటేష్ యాదవ్, పన్యాల జైపాల్ రెడ్డి, జేబీ గౌడ్, భాను, అస్లాం తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్ర నగర్ లోని ఆనంద కన్వెన్షన్ హాల్ లో జరిగిన టీపీపీసీ అధికార ప్రతినిధి మొగుళ్ళ రాజిరెడ్డి కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమంలో వీ3 న్యూస్ & విశ్వంభర తెలుగు దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ పాల్గొని వారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు .ఈ కార్యక్రమం లో దుమ్మాజీ నవీన్,ఎర్రమాద కృష్ణరెడ్డి ఇరుగు శ్రీధర్,కూర రమేష్ పాల్గొన్నారు.
- విశ్వంభర, హైదరాబాద్

# నేటి నుంచే సర్టిఫికెట్ వెరిఫికేషన్

విశ్వంభర, హైదరాబాద్: గురుకులాల్లో మ్యూజిక్ టీచర్ల పోస్టులకు సంబంధించిన అభ్యర్థులకు సోమవారం నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. ఈ మేరకు ట్రిబ్ చైర్మన్ బడుగు సైదులు ఒక ప్రకటనలో తెలిపారు.మాసాబ్ ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో సర్టిఫికేషన్ వెరిఫికేషన్ కొనసాగుతుందని, ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు అభ్యర్థులు <https://treirb.cgg.gov.in> వెబ్‌సైట్‌లో షెడ్యూల్ చూసుకోవాలని తెలిపారు.



వినూత్న రీతిలో ఆహార ప్రియులకు రుచికరమైన బిర్యాని, భోజనాలతో పాటు ముఖ్యమైన కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి ఎల్.బి.నగర్, కొత్తపేట డివిజన్ సమతాపురి కాలనీ రోడ్ నం 2 లో స్వరం రెస్టారెంట్, గార్డెన్ ఫంక్షన్ హాల్ నలుగురు మిత్రులు ప్రీతం, ప్రత్యూష్ , సాయిప్రసాద్, సంజయ్ కలయికలో రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి సామరంగారెడ్డి, డివిజన్ కార్పొరేటర్ పవన్ కుమార్ , వీ3 న్యూస్, విశ్వంభర ఛానల్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ ప్రారంభించారు.
- విశ్వంభర, హైదరాబాద్

### సీపీఐ శత వసంతాల వేడుకలు

# విజయవంతం చేయాలి

### 30న నల్లగొండలో బహిరంగసభ




**విశ్వంభర, హైదరాబాద్:** సీపీఐ శత వసంతాల వేడుకలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కోరారు. తెలంగాణ ప్రజానాట్య మండలి, అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ 30న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.దేశ వ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణకు సీపీఐ ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు తెలిపిందని, అదే నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్, బాల నరసింహ, ఈటీ నరసింహ, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు కే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, ప్రముఖ గాయకులు ఏపూరి సోమన్న, గిద్దె రామనర్సయ్య, మచ్చ దేవేందర్, శివ, భరత్, అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి, జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కమలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ట్రాఫిక్ విధుల్లో ట్రాన్స్‌జెండర్లు

**విశ్వంభర, హైదరాబాద్:** ట్రాఫిక్ విభాగంలో సోమవారం నుంచి ట్రాన్స్‌జెండర్లు విధులు నిర్వహించనున్నారని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో శిక్షణ పొందిన 39 మంది ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ విధుల నిర్వహణకు సంబంధించిన ట్రాఫిక్ గుర్తులు, డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ కుటుంబం, సమాజంలో ట్రాన్స్ జండర్లు ఎంతో వివక్షకు లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాళ్లకు ఒక అవకాశం ఇవ్వాలని, వారిని సమాజంతో అనుసంధానం చేయాలనే ఉద్దేశంతో మొదటి సారిగా వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ట్రాఫిక్ విభాగంలో హోంగార్డు క్యాడర్ కింద ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఇచ్చినట్లు చెప్పారు.

# రేపు సీఎం చేతుల మీదుగా "నట్స్ ,బోల్ట్స్ , ఆఫ్ వార్ అండ్ పీస్" పుస్తకావిష్కరణ




**విశ్వంభర, హైదరాబాద్:** ఈనెల 24 తేదీన హైదరాబాదులోని రవీంద్రభారతిలో ఐప్సో జాతీయ నేత ఎక్స్ ఎమ్మెల్సీ కే. యాదవ రెడ్డి రచించిన "నట్స్ ,బోల్ట్స్ , ఆఫ్ వార్ & పీస్" అనే పుస్తకమును తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ .రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు.ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఒబేదుల్లా కొత్వాల్ అధ్యక్షతన జరుగుతున్నఈ కార్యక్రమంలో ప్రపంచ శాంతి కౌన్సిల్ అధ్యక్షులు ,పల్లవు సేన్ గుప్త, రవాణా శాఖ మంత్రి పున్నం ప్రభాకర్, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ గౌడ్, ఎంపీ మల్లు రవి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేనీ సాంబశివరావు , సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం , బి. వినోద్ కుమార్ ఎక్స్ ఎంపీ , సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి , కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, మైనార్టీ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ కొత్వాల్ ఊబేదుల్లా , ఐప్సో జాతీయ అధ్యక్ష వర్గ సభ్యులు డిడి సుధాకర్ తదితరులు హాజరు కానున్నారు. కావున రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా కమిటీ సభ్యులు, అందుబాటులో ఉన్నవారు శాంతి ఉద్యమకారులు, అభ్యుదయవాదులు,విద్యార్థులు కార్మికులు ,అని రంగాలకు సంబంధించిన వారంతా కూడా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలనీ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కే విఎల్ ప్రధాన కార్యదర్శి లు కాచం సత్యనారాయణ, జి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# 'నాగన్న పదాలు' పుస్తకావిష్కరణ

**విశ్వంభర, విద్యానగర్:** హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నమిలికొండ నాగేశ్వర్ రావు రాసిన 'నాగన్న పదాలు - కవితా సంపుటి' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ రాష్ట్ర కవుల సంఘం అధ్యక్షుడు సుతారపు వెంకటనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య విచ్చేశారు. పుస్తకావిష్కరణ చేసిన అనంరతం ఆయన మాట్లాడుతూ.. నాగేశ్వరరావు రచించిన 'నాగన్న పదాలు' పుస్తకంలో సామాజికంగా ఎన్నో విషయాలను ఆవిష్కరించారని, ఇవి సమాజ హితం కోసం ఎన్నో విధాలుగా ఉపయోగపడతాయని అన్నారు. భారతీయ, తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన అనేక విషయాలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని చెప్పారు.కార్యక్రమంలో తెలంగాణ కవుల సంఘ కోశాధికారి దొంతర బోయిన దైవదీనం, సంఘం కార్యవర్గ సభ్యులు మిద్దె సురేష్, సంపంగి నర్సింహ్మ, బీసీ సంఘం నాయకులు నిరంజన్, బాలయ్య, బెక్కంటి గణేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.




# సీఎంను కలిసిన ఎంపీ అర్వింద్



**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఆదివారం ప్రత్యేకంగా కలిశారు.సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ను ఎంపీ అర్వింద్ వెంట తీసుకెళ్లడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ నేతలు బయటకు విమర్శించుకుంటున్నా ఒకరికొకరు సహకరించుకుంటున్నారని, అందుకు ఇదే ఘటన నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

PMC By
TATA
TATA PROJECTS
Marketed By
South Icon Group
Your Trust Our Legacy
RICHMOND
LIVING SPACES
at ISNAPUR, (Patancheruvu)
COMING SOON....
A life worthy to be called
Your Life



Project Highlights
Grand Club House | Half Basketball Court | Tennis Court | Badminton Court
Infinity Swimming Pool | Party Lawn | Kids Play Area | Business Lounge
Spa And Saloon | Super Market | ATM Centre | Gym | Conference Rooms
Banquet Hall | Jogging Track | Cricket Net | Open Amphitheater | Traffic Free Podium
Reading Lounge | Box Cricket | Creche Area For Kids | Squah Court
Skating Rink | Guest Rooms | Pool View Sundeck
For Offers and more details Contact
9652167668

రిపోర్టర్స్ కావలెను V3 NEWS తెలుగు దినపత్రిక విశ్వంభర
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

# అపర మేధావి.. ఆర్థిక సంస్కరణల ధీశాలి

- తెలుగువారి కోహినూరు.. పీవీ నరసింహారావు
- భావిగతి మార్చిన సంస్కర్తకి భారతరత్న..
- అప్పుల భారతాన్ని అభివృద్ధి వైపు నడిపిన రాజనీతిజ్ఞుడు

**"భారతదేశాన్ని పునర్నిర్మించిన నిజమైన నాయకుడు. ఆర్థిక రంగం నుంచి అణుశక్తి కార్యక్రమం వరకు, అంతర్గత భద్రత నుంచి విదేశాంగ విధానం వరకు అన్నింటిపైనా తనదైన ముద్రవేసిన తెలుగుబిడ్డ పీవీ- ఆధునిక భారత చరిత్రను మేలు మలుపు తిప్పిన రాజనీతిజ్ఞుడు.సంస్కరణల పథంలో దేశాన్ని కదం తొక్కించిన కారణజన్ముడు! 'పదవులు కోరుకోలేదు- వస్తే వద్దనలే'దన్న పీవీ, దశాబ్దాల ప్రజాజీవన యానంలోని ప్రతి కీలక మలుపుపైనా తనదైన ముద్ర వేసిన దార్శనికుడు! పదహారు భాషలు పుక్కిట పట్టిన పీవీ, పదహారణాల అచ్చ తెనుగు లీవి. సంజీవరెడ్డి మంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రిగా అనంతపురంలో ఆరుబయలు జైలు నెలకొల్పడం, అనంతర కాలంలో ఆరోగ్యమంత్రిగా ప్రభుత్వ డాక్టర్ల ప్రైవేటు ప్రాక్టీసుపై వేటు, దేవాదాయ శాఖమంత్రిగా కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టడం, విద్యామంత్రిగా ఆదర్శ పబ్లిక్ పాఠశాలలకు శ్రీకారం చుట్టడం వంటివన్నీ పాములపర్తివారి సంస్కరణల్లో కొన్ని! ముఖ్యమంత్రిగా భూ పరిమితి చట్టం ప్రవేశపెట్టి తన వందల ఎకరాల భూముల్నీ ధారాదత్తం చేసిన ఆదర్శం నిరుపమానమైనది. 1991లో రాజకీయ వానప్రస్థానానికి సిద్ధమవుతున్న వేళ- రాజీవ్ దుర్మరణంతో శోకాకులమైన కాంగ్రెస్‌కు పెద్దదిక్కుగా, సంక్షుభిత దేశాన్ని జాగ్రత్తగా ఒడ్డుకు చేర్చాల్సిన మైనారిటీ సర్కారు సారథిగా పీవీ ప్రజ్ఞాపాటవాలు త్రివిక్రమావతారం దాల్చాయి. 1947లో రాజకీయ స్వాతంత్ర్యం పొందిన భారతావని లైసెన్స్ పర్మిట్ రాజ్ శృంఖలాల్లో చిక్కి దాదాపు నాలుగున్నర దశాబ్దాలు ఛిద్రమైన దేశ ఆర్థిక వ్యవస్థకు- ఆ సంకెళ్లు తెంచి సంస్కరణల నవశకానికి నాందీ వాచకం పలికింది పీవీ!. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా విశ్వంభర ప్రత్యేక కథనం..**

### అనుకోకుండా రాజకీయ పునరాగమనం..

నెహ్రూ కుటుంబానికి పీవీ అత్యంత సన్నిహితుడు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర హోం, విదేశీ వ్యవహారాలు, రక్షణశాఖల మంత్రిగా పనిచేశారు. అప్పటికే ఎనిమిది ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధించారు. 1991 నాటికి ఆయన రాజకీయాల నుంచి విశ్రాంతి తీసుకోవాలనుకొని ఎన్నికల్లో నిలబడలేదు. రాజీవ్ గాంధీ హత్య తర్వాత అనూహ్యంగా ఆయన పేరు తెరపైకి వచ్చింది. వివాదరహితుడు, అందరికీ ఆమోదయోగ్యుడు కావడంతో ప్రధాని పదవి ఆయన్ను వరించింది. 1991 జూన్ 21న బాధ్యతలు స్వీకరించారు. కానీ, పదవి ఆయనకు ముళ్లకిరీటమే.

### మూస పద్ధతులకు చరమగీతం..


పీవీ ప్రధాని అయ్యే సమయానికి దేశం ఆర్థికంగా దివాలా తీసే స్థితిలో ఉంది. దశాబ్దాల తరబడి మనం అనుసరించిన విధానాలకు తోడు అనుకోకుండా వచ్చిపడిన గల్ఫ్ యుద్ధంతో పరిస్థితులు చెయ్యి దాటి పోయాయి. 198284 మధ్యలో ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ ప్రవేశపెట్టిన బడ్జెట్లు, 1987లో ప్రధాని రాజీవ్ గాంధీ ప్రకటించిన కొత్త ఆర్థిక విధానంతో ద్రవ్యలోటు పెరిగిపోయింది. నాలుగు వందల మందికి పైగా ఎంపీల బలమున్న రాజీవ్ గాంధీ ప్రభుత్వానికి భారత ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు గురించి, అప్పటికే పడుతున్న ఒత్తిడి గురించి ముందస్తు సమాచారం ఉన్నా మార్పులకు మొగ్గు చూపలేదు. ఆ తరవాత వచ్చిన వీపీ సింగ్ సైతం ఈ విషయంలో ఏమీ చేయలేకపోయారు. ఫలితంగా 72 బిలియన్ డాలర్ల మేరకు పేరుకుపోయిన విదేశీ రుణాలతో అతి ఎక్కువ అప్పులున్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలోకి చేరింది. అప్పటికి కొత్త రుణాలను మంజూరు చేయడానికి విదేశీ సంస్థలేవీ ముందుకు రావడం లేదు. చంద్రశేఖర్ జమానా నాటికి విదేశ మారకద్రవ్యం నిల్వలు నిండుకునే పరిస్థితి వచ్చింది. ఈ గండం నుంచి గట్టెక్కడానికి 67 మెట్రిక్ టన్నుల బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్‌లలో తాకట్టు పెట్టి 607 మిలియన్ డాలర్ల అప్పు తెచ్చుకోవాల్సిన దుస్థితిలో పడ్డాం! అలాంటి సమయంలో ప్రధాని అయిన పీవీ మన్మోహన్‌ను తోడు చేసుకుని సంస్కరణల రథాన్ని పరుగులు తీయించారు. లైసెన్స్ రాజ్‌ను బద్దలుకొట్టి, విశ్వవిపణికి భారత్‌ను అనుసంధానం చేశారు.

### ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం..

సాధారణంగా రూపాయి విలువ పతనమైతే ఆర్థిక వ్యవస్థ కుంగిపోతోందని ఆందోళన చెందుతాం.. కానీ, మన ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడానికి గతంలో ఓసారి ప్రభుత్వమే కరెన్సీ విలువను భారీగా తగ్గించింది. నాడు ఇచ్చిన ఆ షాక్ ట్రీట్‌మెంట్‌తో ఆర్థిక వ్యవస్థ కోలుకుంది. అంపశయ్యపై నుంచి దిగి.. ఇప్పుడు రేసుగుర్రంలా పరుగులు పెడుతోంది. భారత్‌కు షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చిన ఆ ఆర్థిక వైద్యుడి పేరు పాములపర్తి వెంకట నరసింహారావు. 9వ ప్రధానిగా దేశానికి ఆర్థిక జవసత్వాలు నింపిన తెలుగు బిడ్డ.

### నాడు ఘోరంగా దేశ ఆర్థిక పరిస్థితి

దేశ ఆర్థిక పరిస్థితి నాడు ఘోరంగా ఉండేది. మన విదేశీ మారకద్రవ్యం నిల్వలు కేవలం బిలియన్ డాలర్ల కంటే తక్కువ (ఫోర్బ్స్ కథనం ప్రకారం) ఉన్నాయి. కొన్ని వారాల దిగుమతుల చెల్లింపులకు ఇవి సరిపోతాయి. విదేశీ అప్పు కొండలా పేరుకుపోయింది. దీనికి తోడు ద్రవ్యోల్బణం రెండంకెలకు చేరింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే దేశం దివాలా ముప్పు అంచున వేలాడుతోంది. దీంతో బాధ్యతలు చేపట్టిన వెంటనే పీవీ ఆర్థిక పరిస్థితిపై దృష్టిపెట్టారు. ఆయన తొలుత ఆర్‌బీఐ మాజీ గవర్నర్ ఐజీ పటేల్‌కు ఆర్థిక పగ్గాలు ఇవ్వాలని భావించారు. కానీ, ఆయన సుముఖంగా లేకపోవడంతో మన్మోహన్ సింగ్‌కు బాధ్యతలు అప్పగించారు. సింగ్ కూడా ఆర్‌బీఐ గవర్నర్‌గా చేసిన వ్యక్తే.



### విదేశీ మారక ద్రవ్యం పెంపుకు చర్యలు..

1991 నాటికి భారత్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా మూసేసి ఉండేది. ఎగుమతులు అతి తక్కువ. విదేశీ మారక ద్రవ్య నిల్వలు చాలా స్వల్పం. వీటిని పెంచేందుకు తక్షణమే రెండు చర్యలు చేపట్టాలని పీవీ సర్కారు నిర్ణయించింది. వీటిల్లో ఒకటి రూపాయి విలువ తగ్గింపు. ఒకేసారి భారీగా విలువలో కోత విధిస్తే ఆర్థిక వ్యవస్థ ఇబ్బంది పడుతుందని రెండు దఫాలుగా ఈ నిర్ణయాన్ని అమలు చేశారు.

1991 జులై 1వ తేదీన దేశ చరిత్రలో తొలిసారి రూపాయి విలువను 9శాతం తగ్గించారు. ఆ షాక్ నుంచి కోలుకుంటుండగా.. రెండు రోజుల తర్వాత మరో 11 శాతం విలువను కుదించారు. ఎగుమతులు చౌకగా మారి అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీని తట్టుకొని నిలదొక్కుకునే పరిస్థితిని ఇది కల్పించింది. అదే ఏడాది జులై 418 తేదీల మధ్య రిజర్వ్ బ్యాంక్‌లో ఉన్న బంగారం నిల్వలను బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వద్ద తాకట్టు పెట్టి 400 మిలియన్ డాలర్ల రుణం తీసుకొచ్చారు. వాస్తవానికి అప్పటికే ఎస్‌బీఐ మే నెలలో 20 టన్నుల బంగారాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్‌కు విక్రయించి 200 మిలియన్ డాలర్లు సమకూర్చుకొంది.



### దిగుమతి లైసెన్సుల విధానం సరళీకరణ..

దేశీయంగా పరిశ్రమలు వేగంగా పుట్టుకువచ్చేలా కీలకమైన యంత్రాలు, పరికరాలు, ముడి సరకుల దిగుమతులకు లైసెన్స్ విధానాల్లో మార్పులు తెచ్చింది. ఫలితంగా ఉత్పత్తి రంగానికి ఊతం లభించింది. అదే సమయంలో అనవసరమైన వస్తువుల దిగుమతులను నిరుత్సాహపర్చేలా నిర్ణయాలు తీసుకొన్నారు. ట్రేడబుల్ ఎగ్జిమ్ స్క్రిప్‌లను కేటాయించడం మొదలు పెట్టింది. ప్రైవేటు కంపెనీలు తమకు అవసరమైనవి దిగుమతి చేసుకొనేలా స్వేచ్ఛను ఇచ్చింది. 1991 బడ్జెట్‌కు సరిగ్గా ముందు.. కొత్త పారిశ్రామిక విధానాన్ని పీవీ ప్రభుత్వం ప్రకటించింది. అప్పటివరకు పరిశ్రమలకు, పెట్టుబడులకు ఇబ్బందిగా మారిన లైసెన్స్ విధానం నుంచి ఆర్థిక వ్యవస్థను దూరంగా తీసుకెళ్లింది. దీనికింద మోనోపోలీస్ అండ్ రిస్ట్రిక్టివ్ ట్రేడ్ ప్రాక్టీస్ యాక్ట్‌లో మార్పులు తెచ్చింది. వ్యాపారాల పునర్ వ్యవస్థీకరణ, విలీనం, కలయికలను సులభతరం చేసింది. జాతీయ భద్రతకు సంబంధించిన వాటిల్లో మినహా చాలా రంగాల్లో ప్రభుత్వ సంస్థల ఏకఛత్రాధిపత్యాన్ని తొలగించింది. వీటిల్లో 51 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆటోమేటిక్ అనుమతుల విధానంలోకి తెచ్చింది. 18 పరిశ్రమలు మినహా మిగిలిన వాటికి పెట్టుబడితో సంబంధం లేకుండా లైసెన్స్‌ల అవసరాన్ని తొలగించింది.

### భారత్‌కు మేలి మలుపు..

1991 జులై 24న ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్ లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అప్పటికే గత కొన్ని వారాలుగా ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు ఇది కొనసాగింపు. దీనిలో కొన్ని చేదు గుళికలను మన ఆర్థిక వ్యవస్థ చేత తినిపించారు. కార్పొరేట్ పన్నును మరో 5 పాయింట్లు పెంచి 45 శాతానికి చేర్చారు. బ్యాంక్ డిపాజిట్లు వంటి ఆర్థిక లావాదేవీల్లో మూలం వద్దే పన్ను విధించేలా టీడీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టారు. గ్యాస్ సిలిండర్లు, ఎరువులు, పెట్రోల్, కిరోసిన్ ధరల పెంపుతో పాటు.. పంచదారపైనా రాయితీని తొలగించారు. సబ్సిడీలను తగ్గించి.. ద్రవ్యలోటును కుదించాలన్నది ఇక్కడ ప్రభుత్వ వ్యూహం. అప్పటివరకు లెక్కల్లో చూపించని సొమ్మును ప్రకటించేందుకు ప్రజలకు అవకాశం కల్పించారు. కేసులు, వడ్డీలు, అపరాధ రుసుముల నుంచి మినహాయించారు. దేశీయ పరిశ్రమలను రక్షించేందుకు విధించే దిగుమతి పన్నులను గణనీయంగా తగ్గించారు. 'ఐడియాకు సమయం ఆసన్నమైతే.. దానిని భూమిపై ఏ శక్తి ఆపలేదు' అన్న విక్టర్ హ్యూగో మాటలతో మన్మోహన్ తన చారిత్రక బడ్జెట్ ప్రసంగాన్ని ముగించారు. ఎరువుల ధరల పెంపుపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఐఎంఎఫ్‌కు దేశాన్ని అమ్మేస్తున్నారన్న నిందలను పీవీ సర్కారు మోసింది. ఆ తర్వాత చిన్న చిన్న మినహాయింపులను ప్రభుత్వం ప్రకటించి ఊరుకొంది. బడ్జెట్‌తో ప్రభుత్వం చేతులు దులుపుకోలేదు. ఆ తర్వాత కూడా మరో ఎనిమిది నెలల పాటు సంస్కరణల జోరును కొనసాగించింది. ఎగుమతులను ప్రోత్సహించడానికి సెకండ్ ట్రేడ్ పాలసీ, చిన్న సంస్థలకు ప్రోత్సాహకాలను అందించింది. ఆర్థికరంగంలో సంస్కరణలను సూచించేందుకు ఆర్‌బీఐ గవర్నర్ ఎం.నరసింహన్ నేతృత్వంలో కమిటీని వేసింది. ఆ తర్వాత పన్ను సంస్కరణల బాధ్యతలను ఆర్థికవేత్త రాజ చల్లయ్య నేతృత్వంలోని మరో బృందానికి అప్పగించింది.

### ఫలితం చూపిన వైద్యం..

ఆ తర్వాత రెండున్నరేళ్లలో ద్రవ్యోల్బణం 17శాతం నుంచి 8.5 శాతానికి దిగొచ్చింది. 1991 జూన్‌లో 1.2 బిలియన్ డాలర్లు ఉన్న విదేశీ మారకద్రవ్య నిల్వలు 1994 నాటికి 15 బిలియన్ డాలర్లకు చేరాయి. నాలుగేళ్లలో ఎగుమతులు రెండు రెట్లు పెరిగాయి. ద్రవ్యలోటు 1991లో 8.4శాతం ఉండగా.. అది 1993 నాటికి 5.7 శాతానికి చేరింది. వృద్ధి రేటు 1.1శాతం నుంచి 4శాతానికి పెరిగింది. పేదరికం తగ్గుముఖం పట్టింది.. పేదలు, సంపన్నుల మధ్య వ్యత్యాసం కొంత కుదించగలిగారు. దేశంలో వాణిజ్యం సులభతరమైంది. సంక్షిప్తంగా చెప్పాలంటే ఆధునిక భారత్ ఆర్థికవ్యవస్థకు పీవీ సర్కారు నాడు శక్తిమంతమైన పునాది వేసింది. 1992 కల్లా ఆర్థిక సంక్షోభాన్ని అదుపు చేసి, తాను దిగిపోయే నాటికి జీడీపీ వృద్ధిని 7.6 శాతానికి చేర్చారు. 'ఆర్థిక సంస్కరణల అమలుకు రాజకీయంగా తోడ్పాటునివ్వడానికి తగిన దార్శనికతా ధైర్యమూ పీవీ నరసింహారావు కనబరచారు. ఆ ధీమా ఉన్న ప్రధానమంత్రిగా పీవీ చరిత్రలో అందరికన్నా మిన్నగా నిలిచిపోతారు' అన్న ఆర్‌బీఐ మాజీ గవర్నర్ వై.వేణుగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు అక్షరసత్యాలు! ఇన్ఫోసిస్ తదితర మేటి సంస్థల నుంచి భారతీయులందరి చేతుల్లోని మొబైల్ ఫోన్లు, ఇళ్లలోని శాటిలైట్ టీవీ ఛానళ్ల వరకు అన్నీ పీవీ పాలనా కాలంలో పట్టాలెక్కిన సంస్కరణల మధురఫలాలే! పీవీయే స్వయంగా చెప్పినట్టు 'ప్రజలకేమీ తెలియదు; తెలివితేటలన్నీ... ప్రభుత్వం దగ్గరే ఉన్నాయనుకునే మూస పాలనా పద్ధతులన్నీ' ఆ అయిదేళ్లలో శాశ్వతంగా కనుమరుగైపోయాయి. ఆర్థిక వ్యవస్థను సంస్కరించే క్రమంలో ఏ ఒక్క ఉద్యోగిని, కార్మికుణ్ని తొలగించకూడదన్న భావనతోనే పీవీ వ్యవహరించారు. దీనితో పాటు పేదలకు ప్రభుత్వమే వంద రోజుల పాటు పని కల్పించే ఉపాధి హామీ పథక రచన సైతం చేశారు. పదేళ్ల తరవాత యూపీఏ పాలనలో అమలులోకి వచ్చిన జాతీయ ఉపాధి హామీ పథకానికి మూలాలు పీవీ మేధోమథనంలో ఉన్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ సంస్కరణ నుంచి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు పర్యవేక్షణకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు వరకు అన్నింటా పీవీ వినూత్న ధోరణులనే అనుసరించారు. దేశీయ విధానాల్లో మార్పులు చేస్తూనే విదేశాంగ విధానాన్నీ నూతన పథంలో నడిపించారు. నేటి 'యాక్ట్ ఈస్ట్' విధానానికి మాతృక అయిన 'తూర్పువైపు చూపు'(లుక్‌ఈస్ట్)నకు పీవీయే ప్రాణం పోశారు. తద్వారా ఆసియాలో చైనా ప్రాబల్యానికి పగ్గాలు వేయడంతో పాటు ఇండియాకు కొత్త మిత్రులను సంపాదించిపెట్టారు. అలాగే, టెల్‌అవీవ్‌లో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించడం ద్వారా ఇజ్రాయెల్‌తో అనుబంధానికి అంకురారోపణ చేశారు.




### ఇరాన్‌ను భారత్‌కు మిత్రదేశంగా మార్చారు..

ఒకప్పుడు పాకిస్థాన్‌కు అన్ని విధాలా సాయం చేసిన ఇరాన్‌ను భారత్‌కు మిత్రదేశంగా మార్చారు. అణ్వస్త్ర నిరోధ ఒప్పందంపై సంతకం చేయాలన్న అమెరికా ఒత్తిడిని తట్టుకుంటూనే దేశీయంగా అణు కార్యక్రమాన్ని సజావుగా ముందుకు తీసుకెళ్ళారు. చైనా, పాకిస్థాన్‌ల రూపంలో ఇరుపక్కలా శత్రువులు పొంచి ఉన్న భారత్‌కు అణ్వస్త్ర బలాన్ని అందించి అజేయ శక్తిగా మార్చారు. తన ఏలుబడిలోనే అణు పరీక్షలు నిర్వహించినా ఆ ఘనత మొత్తం పీవీదేనని అటల్ బిహారీ వాజ్‌పేయీ అందుకే వినమ్రంగా అంగీకరించారు. పంజాబ్‌లో శాంతిని సుస్థిరం చేయడం, ఈశాన్య రాష్ట్రాల్లో సామరస్య వాతావరణాన్ని నెల్పకొనడానికి శ్రమించడం, జమ్మూ కశ్మీర్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు చిత్తశుద్ధితో కృషి చేయడం... ఇలా అంతర్గత భద్రతకు పెనుసవాలుగా మారిన సమస్యల పరిష్కారంలో పీవీ కృషి ఎనలేనిది.

### దేశభక్తుడైన రాజకీయవేత్త

అంతకు ముందు పరిస్థితులతో పోలిస్తే దేశాన్ని అన్ని విధాలా అభివృద్ధి బాటలో నడిపించినా పీవీ ప్రభుత్వం 1996 ఎన్నికల్లో అపజయం పాలు కావడం పట్ల ప్రపంచ దేశాల్లో విస్మయం వ్యక్తమైంది. 'పీవీ వల్ల తమకు జరిగిన మేలును భారతీయ ఓటర్లు మరిచిపోయారు' అని సింగపూర్ ఉన్నతస్థాయి నాయకులు బహిరంగంగానే నిరుత్సాహం వ్యక్తం చేశారు. అయిదు దశాబ్దాల రాజకీయ జీవితంలో వ్యక్తిగతంగా ఎక్కడా ఎలాంటి అవినీతి మకిలీ అంటకపోయినా, ప్రధానిగా దిగిపోయిన తరవాత పీవీని కోర్టు కేసులు చుట్టుముట్టాయి. వాటన్నింటి నుంచి పులకడిగిన ముత్యంలా ఆయన బయటపడ్డారు. ఆయా కేసుల్లో తన తరఫున వాదించిన న్యాయవాదులకు డబ్బు చెల్లించడానికి హైదరాబాద్‌లోని తన ఇంటిని అమ్మకానికి పెట్టారు. మాజీ రాష్ట్రపతి, 'భారతరత్న' అబ్దుల్ కలాం అభివర్ణించినట్టు పీవీ 'రాజకీయవ్యవస్థ కన్నా దేశం గొప్పదని విశ్వసించే దేశభక్తుడైన రాజకీయవేత్త'!

### సంక్షేమానికీ అంతే ప్రాధాన్యం

ఎన్ని సంస్కరణలు చేసినా విద్య, వైద్య రంగాలను మాత్రం ప్రభుత్వమే నిర్వహించాలని పీవీ ఎప్పుడూ చెప్పేవారు. నోబెల్ బహుమతి పొందిన ఆర్థికవేత్త అమర్త్యసేన్ తదితరులదీ ఇదే అభిప్రాయం. 1990లో విద్యపై కేంద్రం కేవలం 951 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తే, 1995 నాటికి పీవీ ప్రభుత్వం ఆ మొత్తాన్ని రెట్టింపునకు పైగా (రూ.2042 కోట్లు) పెంచింది. అలాగే, ఆరోగ్య రంగానికి కేటాయింపులు, ఖర్చు సైతం ఈ అయిదేళ్లలో రెండింతలు అయ్యింది. ప్రైవేటు రంగాన్ని ఇతోధికంగా ప్రోత్సహించి, తద్వారా సమకూరిన ఆదాయాన్ని ప్రజా సంక్షేమానికి వెచ్చించడమనే కొత్త మార్గాన్ని భారతదేశానికి పీవీ పరిచయం చేశారు. 1991లో ఆయన ప్రధాని పదవి చేపట్టిన సమయానికి భారత స్థూల దేశీయోత్పత్తి విలువ సుమారు 26వేల కోట్ల డాలర్లు. 2021నాటికి అది సుమారు మూడు లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. దేశం వేగవంతమైన వృద్ధిని సాధించడం వెనక పీవీ హయాములో చేపట్టిన ఆర్థిక సంస్కరణల పాత్ర కీలకం.

కశ్మీర్, పంజాబ్‌ల్లో ఎన్నికల నిర్వహణ ద్వారా ఉగ్రవాదానికి 'చెక్' పెట్టగలిగిన చాణక్యం, ఇండియాను అణుశక్తి సంపన్న రాజ్యంగా తీర్చిదిద్దడానికి సకలం సిద్ధం చేసిన పౌరుషం, ఇజ్రాయెల్‌తో ఇండియా రక్షణ బాంధవ్యం కుదుర్చుకున్నా తమకు అభ్యంతరం లేదని అరాఫత్‌తోనే ప్రకటన చేయించగల దౌత్య ధురీణత, 'లుక్ ఈస్ట్' విధానం ద్వారా తూరుపు వాకిలి తెరచిన చతురత పీవీ అసమాన రాజనీతిజ్ఞతకు తిరుగులేని ఆనవాళ్లు. స్వాతంత్ర్యానంతర కాంగ్రెస్‌వాది అయినా స్వాతంత్ర్యానికి ముందునాటి విలువలున్న వ్యక్తిగా పీవీని నాటి కమలదళాధిపతి ఎల్‌కే అద్వాణీయే కొనియాడారు. అలాంటి తెలుగు బిడ్డ భారతరత్న పీవీ నరసింహారావుకు ఆయన వర్ధంతి రోజు స్మరించుకోవడంతో ఆయన దేశానికి చేసిన సేవలు భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.







పోతుగంటి వెంకటరమణ
బ్యూరో చీఫ్, విశ్వంభర దినపత్రిక

# ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

- ఎలెక్టోరల్ అబ్జర్వర్ బాలమాయాదేవి
- సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాల పరిశీలన
- మెనూ ప్రకారం రుచికరమై భోజనం అందించాలి



**విశ్వంభర, మహబూబాబాద్:** కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అండ్ డిస్టిక్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ తో కలిసి ఎలెక్టోరల్ అబ్జర్వర్ బాలమాయాదేవి, స్పెషల్ సమ్మరీ రివిజన్ 20 -25, పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో షెడ్యూల్ ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. పెండింగ్లో ఉన్న ఫామ్ 6, 7, 8, లను వెంటనే పరిష్కరించాలని, దివ్యాంగ ఓటర్లను, గుర్తించాలని, షెడ్యూల్ ప్రకారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని, వారి యొక్క సలహాలు, సూచనలు ఎన్నికల కమిషన్‌కు పంపాలన్నారు. నాణ్యమైన ఓటరు ఏపిక్ కార్డులను ప్రింట్ చేసి పంపిణీ చేయాలన్నారు.
ఓటర్ అవగాహన పై స్వీప్ ఆక్టివిటీస్, స్టార్ క్యాంపైనర్స్ ద్వారా డిగ్రీ కాలేజెస్, ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్ కాలేజ్ అన్ని విద్యాసంస్థలలో కార్యక్రమాలు నిర్వహించి ఓటరు నమోదు ఓటు హక్కుపై అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో , దివ్యాంగుల కోసం ర్యాంప్స్ ఏర్పాటు చేయాలని, తాగునీరు, మరుగుదొడ్ల, విద్యుత్ సరఫరా సౌకర్యం, అన్ని మౌలిక వసతులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కు సంబంధించి షెడ్యూలు ప్రకారం పక్కాగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఎలెక్టోరల్ రోల్ అబ్జర్వర్ కు వివరించారు. అనంతరం పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డైట్ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని పిల్లలకు అందించాలని సూచించారు. వసతి గృహంలోని డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, స్టడీ రూమ్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య బోధనలు అందించాలని 100% ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. వసతి గృహంలో సానిటేషన్ పక్కగా నిర్వహించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా సరిచూసుకోవాలని, పిల్లల యొక్క మానసిక, విద్య, వైద్య స్థితిగతులను ప్రతినిత్యం గమనిస్తూ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.వీర బ్రహ్మాచారి, తొర్రూరు, మహబూబాబాద్ ఆర్డిఓలు గణేష్, కృష్ణవేణి, స్వీప్ నోడల్ అధికారి మధుసూదన రాజు, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహస్వామి, సంబంధిత అధికారులు తహసీల్దారులు ఎలక్షన్ సూపర్డెంట్ పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సిమెంట్ బ్రిక్స్ ప్రారంభం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం, అర్రూరు గ్రామంలోని సిఎన్ఆర్ గోల్డెన్ సిటీ వెంచర్లో అయ్యప్ప సిమెంట్ బ్రిక్స్ ప్రారంభోత్సవానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిట్టిరెడ్డి నరసింహా రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంబోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సిమెంట్ బ్రిక్స్ యజమాని ఆలకుంట్ల దయాకర్, మాజీ సర్పంచ్ జనుకల దానయ్య, బుర్ర మల్లేశం, మశ్చగిరి, జోలం సిద్దయ్య, దోతి మశ్చగిరి, బోగారం దాసు, బొలుగుల భాగ్య, పన్నాల చంద్రారెడ్డి, రాము, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు ఆవుల భిక్షపతి, సోషల్ మీడియా కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఇరుముడి పూజలో సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండలం ఇరుముడి పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మండలం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాల్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యానికి గురైన మహిళకు ఆర్థిక సహాయం



**విశ్వంభర, దోమ:** దోమ మండల పరిధిలోని దోర్నాల్ పల్లి గ్రామానికి చెందిన కే ఎస్ ఆర్ ట్రస్టు సభ్యుడు నితీష్ సాగర్ తల్లి అనారోగ్యానికి గురింది. ఆ విషయాన్ని తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ శరత్ కుమార్ రెడ్డి ఆదివారం దోర్నాల్ పల్లి గ్రామానికి వెళ్లి ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమెకు చికిత్స నిమిత్తం 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, మణికంం పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్ఎఫ్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**విశ్వంభర, సంగారెడ్డి:** ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని పటాన్ చేరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చేరు పట్టణానికి చెందిన ఠాకూర్ నరేందర్ సింగ్ ప్రమాదంలో ఎడమ కాలు కోల్పోయాడు. ఈ నేపథ్యంలో కృత్రిమ కాలు కోసం స్థానిక ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. కృత్రిమ కాలు కోసం మంజూరైన ఒక లక్ష 25 వేల రూపాయల విలువైన ఎల్ఓసీ అనుమతి పత్రాన్ని ఆదివారం ఎంఎల్ఏ జిఎంఆర్ నరేందర్ సింగ్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సమ్మెకు టీపీటీఎఫ్ సంఘీభావం




**విశ్వంభర, నెల్లికుదురు:** కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని టీపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.యాకయ్య , సంగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానుకోటలో గత 16 రోజులుగా ఎస్సెస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు టీపీటీఎఫ్ నెల్లికుదురు మండల శాఖ ఆదివారం సంఘీభావం ప్రకటించి, మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీజె.రాజు, కె.బిక్షపతి, జయప్రకాష్, సత్యనారాయణ ఎస్ఎస్ఏ ఉద్యోగులు మస్కపురి సుధాకర్, జె.కవిత, భాస్కర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ వెంకటస్వామి ఘన నివాళులు



**విశ్వంభర, మహబూబాబాద్:** కలెక్టరేట్ కార్యాలయ ప్రధాన సమావేశం మందిరంలో ఆదివారం మాజీ ఎంపీ జి. వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె.వీరబ్రహ్మాచారిలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఎస్పీగా పదోన్నతి పొందిన జోగుల చెన్నయ్య

చెన్నయ్య దంపతులకు సన్మానం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన జోగుల రామలింగయ్య, బుచ్చమ్మల కుమారుడు జోగుల చెన్నయ్య సాధారణ కుటుంబంలో జన్మించి, ఎస్సై గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం కమాండ్ కంట్రోల్, హైదరాబాద్ లో ఎస్పీగా పదోన్నతి పొందదారు. అనంతరం తన స్వగ్రామం లక్ష్మాపురం వచ్చిన సందర్భంగా ఆ గ్రామ ప్రజలు చెన్నయ్య దంపతులకు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## యువజన కాంగ్రెస్ అధ్యక్షుడికి ఘన సన్మానం



**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల:** తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు చుక్కా రాజశేఖర్ రెండవసారి సిరిసిల్ల నియోజకవర్గం యువజన అధ్యక్షుడిగా నియమితులైన రాజశేఖర్ ను ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగాసన్మానించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ అధిష్టానం కాంగ్రెస్ నాయకులు నామీద నమ్మకంతో రెండోసారి సిరిసిల్ల నియోజకవర్గం ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ప్రజల బాగోబాగులు చూసుకుంటూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని రాష్ట్ర ప్రజల అభివృద్ధిలో ప్రత్యేకంగా పాల్గొంటున్నారనినాకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇట్టి సన్మాన కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు లక్ష్మణ్ ఫిషరీస్ చైర్మన్ చొప్పరి రామచంద్రం పిట్టల భూమేష్ వెంకటస్వామి పర్ష అనుమాండ్లు జంగంపల్లి శేఖర్ నరసయ్య భద్రాచలం శ్రీనివాస్ నరేష్ నాగరాజు వివిధ మండలాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ముదిరాజ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

**టీయూసీఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం**



**విశ్వంభర, హైదరాబాద్:** టీయూసీఐ అనుబంధ తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభలు ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమరయ్య హాల్ లో నిర్వహించారు. మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన టీయూసీఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మోటార్ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలై సంక్షేమ బోర్డు ఆటో మెయింటెనెన్స్ కోసం 12 వేల రూపాయలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, హైదరాబాద్ నగరంలో ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, కొత్త ఆటో పర్మిట్లు జారీ చేయాలని, ఓలా, ఉబర్, రాపిడో సంస్థలను నిషేధించి ప్రభుత్వమే ఉచిత యాప్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎమ్ . హన్మేష్ మాట్లాడుతూ పాలకవర్గాలు ప్రభుత్వం అనేక సంవత్సరాల నుంచి కార్మిక వర్గ హక్కులను అరించి వేస్తున్నదని, ఆటో మోటార్ కార్మికులందరూ టీయూసీఐ జెండా కింద సమీకృతం కావాలని, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలుగుతారని పిలుపునిచ్చారు. టీయూసీఐ రాష్ట్ర నాయకులు సి వెంకటేష్, కే రాజన్న ప్రసంగిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోటార్ కార్మికులను ఇబ్బంది గురిచేసే చట్టాలు తేవడం అన్యాయమని అన్నారు. 2019 సెంట్రల్ మోటర్ వెహికల్ (సవరణ) చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభల సందర్భంగా ఇరవై ఒక్క మందితో నూతన కమిటీ ఎన్నికయింది. తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య ,రాష్ట్ర అధ్యక్షులుగా వి ప్రవీణ్ (హైదరాబాద్), పాయం వెంకన్న ప్రధాన కార్యదర్శి (భద్రాద్రి కొత్తగూడెం), ఎస్.కె లాల్ మియా ఉపాధ్యక్షుడిగా (ఖమ్మం), జి లింగం గౌడ్ సహాయ కార్యదర్శి (రంగారెడ్డి జిల్లా), కోశాధికారి ఎ.శ్రీనివాస్ కోశాధికారి (మహబూబ్నగర్), కమిటీ సభ్యులుగా, మహమ్మద్ అఫ్జల్ (మేడ్చల్), టి నారాయణ (హైదరాబాద్), మహమ్మద్ కాజా మియా (మేడ్చల్), ఎస్ రవీందర్ (సికింద్రాబాద్), బి ప్రభాకర్ (సైబరాబాద్), దళిత్ (ఆదిలాబాద్), కే సాయన్న (నిర్మల్), వి బాలరాజ్ (మహబూబ్నగర్), అబ్దుల్లా (నారాయణపేట), వై ఉపేందర్ (ఖమ్మం), ఎండి చాంద్ పాషా (గద్వాల), కే శ్రీనివాస్ (ఖమ్మం) ఎన్నికయ్యారు.

## యువత రాజకీయాల్లో రాణించాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి



**విశ్వంభర, నర్సంపేట:** వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆదివారం బీజేపీ చేన్నరావుపేట మండల అధ్యక్షులు దుంక దువ్వ రంజిత్ ఆధ్వర్యంలో చెరువుకొమ్ము తండ, ఎల్లాయిగూడెం నుండి యువకులు పాల్తీయ శశిందర్, భూక్యా రాజు, జరుపుల రవి, బోడ శ్రీనివాస్ లు భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సమక్షంలో బీజేపీ కండువా కప్పుకొని పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ యువత కూడా రాజకీయాల్లో రాణించాలని తెలియజేశారు. రాజకీయాల్లో యువతకు భారతీయ జనతా పార్టీ పెద్దపీట వేస్తుందని తెలియజేశారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరపున యువతకే పెద్ద ప్రాధాన్యత వేసి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గుడిపూడి రాధాకృష్ణ, నర్సంపేట రూరల్ మండల అధ్యక్షులు గంగిడి మహేందర్ రెడ్డి, నెక్కొండ మండల అధ్యక్షులు నాయిని అశోక్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, యువ మోర్చా జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, యువమోర్చా నాయకులు అబ్బరబోయిన రాజు , భూక్య సుధాకర్, పడిదం హరికృష్ణ, రాజ్ గోపాల్, యువమోర్చా నాయకులు పార్టీ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## రూ. 40వేల ఎల్ఓసీ అందజేత



**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండలం నేదునూర్ గ్రామానికి చెందిన వెంకటా చారి కుమారుడు అరవింద్ చారి చేతికి సంబంధించిన శస్త్రచికిత్స నిమిత్తం ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా నేదునూర్ గ్రామ మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సంప్రదించగా సబితా ఇంద్రారెడ్డి వెంటనే స్పందించి ఎల్ ఓ సీ ద్వారా రూ 40,000/- అందజేశారు. అనంతరం శస్త్ర చికిత్స విషయమై నిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ తో మాట్లాడరు. ఎల్ ఓ సీ అందుకున్న అరవింద్ చారి సబితా ఇంద్రారెడ్డి కృతజ్ఞత పూర్వకంగా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గడ్డం వెంకట్ స్వామి ( కాకా) 10 వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద వున్న కాకా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎ మ్మె ల్యే వేవేక్, శంకర్ రావు.
– విశ్వంభర, హైదరాబాద్

## విద్యా సంస్థల్లో మెరుగైన సంరక్షణ, భద్రత

**విశ్వంభర, బషీర్ బాగ్ :** సీసీ టీవీ సిస్టమ్ లు విద్యా సంస్థల్లో మెరుగైన సంరక్షణని, భద్రతని అందించడంలో ముఖ్యపాత్రని పోషిస్తాయి. సమర్ధవంతమైన స్టోరేజ్ పరిష్కారాలు ఎలాంటి అవాంతరాలు లేని రికార్డింగ్ ని అందించడంలో సమాచారాన్ని చక్కగా నిర్వహించడంలో ఫుటేజ్ని త్వరగా వీక్షించడంలో ముఖ్యంగా ఎక్కువ కెమెరా సర్విలెన్స్ ఉండే ప్రాంగణాల్లో ముఖ్య పాత్రని పోషిస్తాయి. డబ్ల్యూడి పర్పుల్ ప్రోహెచ్ డీడీ లు 24/7 రికార్డింగ్ అవసరాలకు తగ్గట్టు తయారు చేయ బడినది. అవి అత్యధిక సామర్థ్యాన్ని, మన్నికని అందిస్తాయి. ఆల్ ఫ్రేమ్ టెక్నాలజీతో తయారు చేయబడినప్పటికీ కూడా ఈ డ్రైవ్స్ వీడియోప్లే బ్యాక్ లను మెరుగు పరచగలవు. ఈసందర్భంగా వెస్టరెన్ డిజిటల్ సేల్స్ డైరెక్టర్, ఇండియా ఏంఈఏ ఓవైస్ మొహ మ్మద్ మాట్లాడుతూ... సర్విలెన్స్ సిస్టెమ్ మీద ఎక్కువగా ఆధారపడే విద్యా సంస్థలకు నిరంతరం పనిచేసే, వాడుకలో ఉండే, నమ్మకమైన స్టోరేజ్ పరిష్కారాలను డిజైన్ చేయడం అనేది చాలా కష్టమైన పని అన్నారు. మన డబ్ల్యూ డి పర్పుల్ పోర్ట్ ఫోలియో ఈ అవసరాలను నివృత్తి చేయడానికి, ఎలాంటి ఇబ్బంది లేని రికార్డింగ్ ని మన్నికైన పరిసరాలను, సురక్షితంగా ఉంచుకోవడానికి తగ్గట్టు తయారు చేయబడిందన్నారు.

## నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



**విశ్వంభర, ఎల్బీనగర్:** రాత్రి పూట దిల్ సుఖ్ నగర్, కొత్తపేట, ఎల్బీ నగర్, మన్సూరాబాద్, నాగోల్, మలక్ పేట, కోటి, అబిడ్స్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నిద్రిస్తున్న వారికి చలిని తట్టుకోవడం కొరకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, రచయిత, సోషల్ వర్కర్ , పర్యావరణవేత్త డా. పెండెం కృష్ణ కుమార్ బ్లాంకెట్లను అందజేశారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఇవ్వడం జరిగింది. మానవ దృక్పథంతో ప్రతి ఒక్కరం సేవాతత్వం అలవర్చుకోవాలని కోరారు.

## గాయపడిన వ్యక్తిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**విశ్వాంభర, వెల్దండ:** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వెల్దండ మండల కేంద్రానికి చెందిన దశరథంను ఆదివారం మండల కాంగ్రెస్ నాయకుడు సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని అతనికి వ్యక్తిగతంగా 5000 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండ్ రషీద్, మాడుగుల శంకరయ్య, తిరుపతిరెడ్డి, పురుషోత్తం, అన్యపు రామస్వామి, పుట్ట యాదయ్య, జంగిలి కొండలు, జంగిలి ఆనంద్, రేవెల్లి రాజు, మట్ట నాగార్జున, డేవిడ్, గోరేటి భరత్, గంగపువ్వ ఆంజనేయులు, ఎండి ఖాదర్, మాడుగుల రమేష్, ఎండి సమీర్, మహేందర్, మల్లేష్, పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో మహమ్మద్ అబ్బసలి కన్నుమూత



**విశ్వంభర, నెల్లికుదురు:** పోస్టల్ శాఖలో తపాలా సంచిని మోస్తూ ఇ డిఎస్ఎంసి( బ్యాగ్ క్యారియర్) గా విధులు నిర్వర్తిస్తున్న మహమ్మద్ అబ్బసలి ఇకలేరు. విద్యుత్ ఘాతానికి గురై కన్నుమూశారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రాజుల కొత్తపల్లి గ్రామానికి చెందిన అబ్బసలి(అబ్బ సాయిలు) పోస్టల్ డిపార్ట్మెంట్లో బ్యాక్ క్యారియర్ గా మండలంలోని రాజుల కొత్తపల్లి, వెంకటాపురం, శ్రీరామగిరి, రావిరాల గ్రామాలకు విధులు నిర్వర్తించేవాడు. ఈ ప్రాంతమంతా సుపరిచితుడు. అందరితో మర్యాదగా ఉంటూ తలలో నాలికలా వ్యవహరించేవాడు. అకస్మాత్తుగా అస్తమయం చెందడంతో ఆయన పుట్టిన ఊరు రాజుల కొత్తపల్లి తో పాటు సంబంధిత గ్రామాలలో విషాదం అలముకుంది. స్థానికులు ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం. ఆదివారం ఉదయం మహమ్మద్ అబ్బాస్ అలీ (59) తన ఇంటి ముందు రేకుల పందిరి పైన కోతులు దూకడంతో రేకులు చెదిరిపోయాయి. వాటిని సరి చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కరెంటు వైరు కు రేకు తాకడంతో విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అబ్బసలి భార్య యాకూబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అబ్బసలికి భార్య తో పాటు ఒక కుమారుడు ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

# చిన్నారి గుండెకు అండగా..

**రూ.5లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత**



**విశ్వంభర, చింతపల్లి:** ఆపదలో ఉన్న వారికి ఎల్లప్పుడూ అండగా నిలిచే దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. చింతపల్లి గ్రామానికి చెందిన నిరుపేద మహమ్మద్ జావిద్ కుమారుడు జుబేర్ చిన్న వయసు నుంచే గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సీఎం రిలీఫ్ ఫండ్లో 5 లక్షల రూపాయలు ప్రభుత్వం ద్వారా ఇప్పించి నిమ్స్ ఆసుపత్రిలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న జుబేర్ కు ఆపరేషన్ చేయించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆపదలో ఉన్న ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వంగా ప్రజా పాలన సాగిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీని 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచి నిరుపేదలకు కష్ట కాలంలో అండగా ఉండే పార్టీగా చరిత్రలో నిలిచిందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకులు దోంతం సంజీవరెడ్డి, ఎండి జహంగీర్, కాసారపు శ్రీనివాస్, ఎండి రియాజ్ పాషా, ఎలిమినేటి నరసింహ, నల్లవెల్లి సదానందం, గుణమోని కొండల్, యాచారం శ్రీను తదితరులు ఉన్నారు.

# సీపీఐ(ఎం) ఆమనగల్ ఏరియా మహాసభలు



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని మాస్టర్ డిగ్రీ కళాశాల లో కార్మిక కర్షక విద్యార్థి ఉద్యమాలలో సీపీఐ(ఎం) ముందుండి సామాజిక రైతు పోరాటాలు ముందుకు నడవాలని మహాసభ నిర్వహించారు. సీపీఐ(ఎం) ఎర్రజెండాను ఆమనగల్ ఏరియా కన్వీనర్ కానుగుల వెంకటయ్య కామ్రేడ్ ఎగురవేశారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కడిగేళ్ల భాస్కర్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆమనగల్ తలకొండపల్లి, కడ్తాల్, ఏరియా మహాసభ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ దేశ రాజకీయ నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చాక ఒకే దేశం ఒకే ఎన్నిక రైతు వ్యతిరేక చట్టాలు కార్మిక వ్యతిరేక చట్టాలు ప్రజలు ఆకలితో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని దేశంలో విద్య వైద్యం ఇవ్వడం లేదని అదేవిధంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఆర్ గ్యారంటీ ల పేరుతో ప్రజలను మోసం చేసి అరా కొర హామీలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమనగల్, తలకొండపల్లి, కడ్తాల్, సీపీఐ(ఎం) ఏరియా నూతన కమిటీని ఏరియా కన్వీనర్ గా పిప్పళ్ళ శివశంకర్ కమిటీ సభ్యులుగా జిల్లెల్ల పెంటయ్య, గుమ్మడి కుర్మయ్య, కొమ్ము చెన్నయ్య, పట్నం నరసింహ, హంసమ్మ, శివగల రమేష్, పోచయ్య ఎన్నికయ్యారు.

# అమిత్ షాను వెంటనే భర్తరఫ్ చేయాలి

**దొడ్ల నర్సయ్య యాదవ్**



**విశ్వంభర, అచ్చంపేట:** అచ్చంపేట మండల కేంద్రం అచ్చంపేట మండల అధ్యక్షులు దొడ్ల నర్సయ్య యాదవ్, యూత్ కాంగ్రెస్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ పార్లమెంట్ లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్ గురించి హేళన చేస్తూ అంబేద్కర్ అంబేద్కర్ మాట్లాడడం అందరికీ ఫ్యాషన్ అయిందని దానికి బదులు బదులుగా దేవుడుని తలిస్తే స్వర్గానికి వెళ్తారని మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అదే విధంగా నేడు మధ్యాహ్నం 2 గంటలకు అచ్చంపేట ఎమ్మెల్యే క్యాప్ ఆఫీసు నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా మల్లు రవి, డీసీసీ అధ్యక్షులు అచ్చంపేట శాసనసభ్యులు డా. వంశీ కృష్ణ, ఎమ్మెల్సీ కుచకుళ్ళ దామోదర్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కస్రెడ్డి నారాయణ రెడ్డి పాల్గొంటున్నారు. కావున కాంగ్రెసు పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్,మహిళా కాంగ్రెస్,ఎన్.ఎస్.యూ.ఐ నాయకులు అందరు ర్యాలికి పాల్గొని విజయవంతం చేయాల్సింది కోరారు. ఈ కార్యక్రమంలో రేణయ వినోద్ శక్రు, శ్రీరామ్ పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు

**– ఆకట్టుకున్న విద్యార్థుల ఎగ్జిబిట్లు**



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని పెద్ద శంకరంపేటలోని సంస్కార విద్యాలయం, శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలల్లో ఆదివారం జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంస్కార్ విద్యాలయంలో విద్యార్థులు గణిత శాస్త్రం పై ఎగ్స్ బిట్ లు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు గణిత శాస్త్రంలో రాణించాలని, గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకు వెళ్లాలని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, పి ఆర్ పి యు జిల్లా పూర్వ గౌరవ అధ్యక్షులు రామచంద్ర చారి. మండల బీజేపీ అధ్యక్షులు కోణం విట్టల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయిని మధుసూదన్ , మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణ గౌడ్ మాజీ ఎంపీటీసీలు సుభాష్ గౌడ్, రాజేశ్వర్ రావు నాయకులు, దాచా సంగమేశ్వర్ రాజన్ గౌడ్, పెరుమాండ్లు గౌడ్ , రాజశేఖరరెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వీరప్ప , సీతారామారావు , విద్యార్థులు ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ మహేష్ గౌడ్‌కు పాలాభిషేకం



**విశ్వంభర, ఇనుగుర్తి:** నిజమైన ఉద్యమ కళాకారులను గుర్తించి ఉద్యోగాలు ఇచ్చే విధంగా కృషి చేస్తామని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ శనివారం శాసనమండలిలో ప్రకటించడం పట్ల ఆయనతో పాటు తెలంగాణ సాంస్కృతిక సారథి వెన్నెల కు జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనువోజు వెంకటేష్ మాట్లాడుతూ నిజమైన ఉద్యమ కళాకారుల పట్ల మహేష్ గౌడ్ మాట్లాడడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్షులు చేదాసు రమేష్, వెంకటరావు, ఇనుగుర్తి మండల నాయకులు పసునూరి జంపయ్య, చిట్టబోయిన యాకయ్య,గాదుదల వీరయ్య,ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్కేపురం డివిజన్ బి ఆర్ ఎస్ మహిళా అధ్యక్షురాలు లిక్కి ఊర్మిళ రెడ్డి నివాసంలో ఇచ్చిన అల్పాహారం విందు కార్యక్రమంనికి హాజరైన మాజీమంత్రి,ఏమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి. ఆమెతో పాటు డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వీరమళ్ళ రామ్ నర్సింహా గౌడ్, ఎండీ సాజీద్, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్,శ్రీరాములు, పాల్గొన్నారు . – విశ్వంభర, ఎల్బీనగర్

## పోలీస్‌కే టోకరా పెట్టిన సైబర్ నేరగాళ్లు



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** ఇటీవల కాలంలో నెట్టింట్లో బూచోళ్లు ఎక్కువయ్యారు. అడ్డమైన లింకులు పెట్టి, డిజిటల్ అరెస్ట్ల పేరుతో అడ్డంగా దోచుకుని సైబర్ ముఠాలు వైఫైలా మన చుట్టూరా ఉన్నాయి. అలాంటి వాళ్ల ఉచ్చులో పడుతున్న బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. విజయవాడకు చెందిన ఒక సీఐ వ్యక్తిగత పనుల మీద ముంబై వెళ్లారు.అక్కడ ఒక హోటల్లో ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ఇచ్చి గదిలోకి దిగారు. ఐదు రోజుల తర్వాత డిసెంబరు 19 గురువారం విమానంలో విజయవాడకు వచ్చేశారు. శుక్రవారం ఉదయం ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బెదిరించాడు. మీరు ముంబై వచ్చారా అని ఆరా తీశారు. అక్కడ ఒక రోడ్డు యాక్సిడెంట్ చేశారని.. మీ వల్ల ఒక వ్యక్తి చనిపోయాడని బెదిరించడం ప్రారంభించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో వచ్చే ఎన్నో కేసులను డీల్ చేసిన సీఐకే అదే తరహా ఫోన్ రావడంతో కంగుతిన్నారు. ఫోన్ చేసిన వ్యక్తికి తనదైన శైలిలో ప్రశ్నలు వేసి క్లాస్ తీసుకోవడంతో నేరగాళ్లు ఫోన్ పెట్టేశారు. మాస్క్డ ఆధార్ ఇస్తే మేలు.. హోటల్లో ఇస్తున్న ఆధార్ కార్డు ఇతర వివరాలు ఎలా దుర్వినియోగం అవుతున్నాయనటానికి ఇది ఒక ఉదాహరణ. ప్రతి ఒక్కరూ మాస్క్డ ఆధార్ కార్డు ఇస్తే బాగుంటుందని పోలీసులు సూచిస్తున్నారు. ఆధార్ కార్డులోని 12 అంకెల స్థానంలో చివరి 4 అంకెలు మాత్రమే కనిపిస్తాయి మిగిలిన వాటి స్థానంలో ఎక్స్ గుర్తు ఉంటుంది. ఇలాంటి ఆధార్ కార్డులతో చాలా వరకు మోసాలు నివారించవచ్చని పోలీసులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు అక్కడ హోటల్లో బ్యాంకింగ్, ఆధార్ నెంబర్లతో సంబంధంలేని ఫోన్ నెంబర్లు ఇస్తే మేలని చెప్తున్నారు. మరీ ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నారు.

## గాయత్రి బ్యాంకు ప్రారంభం



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 52వ బ్రాంచ్ గాయత్రి బ్యాంక్ ప్రారంభించారు. మేనేజర్ సోమేశ్వర్ మాట్లాడుతూ రైతులకు వ్యాపారవేత్తలకు రుణ సదుపాయం పొందండి బంగారం, పోస్ట్ ఆఫీస్ బాండ్లపై ప్రత్యేక రుణం మంజూరు చేస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, 36వ వార్డు కౌన్సిలర్ బి నీరజారెడ్డి, ధర్మన్న మార్కెట్ వైస్ ఛైర్మన్ మదన్ లోయ మల్లికార్జున్, మేక వెంకటేష్ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని కల్హేర్ మండలం కృష్ణపూర్ గ్రామానికి చెందిన సలిగంజి మచేందర్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార మంజూరైన 28,000 వేల రూపాయల చెక్కును లబ్దిదారునికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్టోళ్ల సంజీవరెడ్డి ఆదివారం అందించారు. కార్యక్రమం లో మండల సీనియర్ నాయకులు మల్లొడ్డి తుకారం, వీర్ శెట్టి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బర్ల మచ్చే%శీ%దర్, దాడే సాయిలు, కుసంగి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో హోమం



**విశ్వంభర, ఎల్బీ నగర్:** అంబర్ పెట్ డివిజన్ పటేల్ నగర్ చౌరస్తా సి పి ఎల్ లోని విజయ దుర్గమాత ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో హోమ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పద్మశాలి సంఘం వారి ఆధ్వర్యంలో దుర్గమాత ఆలయంలో హోమ కార్యక్రమాలు, భక్తులకి అన్న దాన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. సంఘం పెద్దలందరూ కలిసి ఇటువంటి దైవ కార్యక్రమాలు, భక్తులకి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు చేయడం చాలా అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు గట్టయ్య, ఉపాధ్యక్షులు కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, ట్రెజరర్ మల్లేష్, చీఫ్ అడ్వైజర్ విజయ్ కుమార్,ప్రభు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి



**విశ్వంభర, రామన్నపేట:** సీపీఐ పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నల్లగొండ పట్టణ కేంద్రంలోని ఎన్.జి కళాశాల మైదానంలో ఈనెల 30న నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని, యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పత్రికా ప్రకటనలో తెలుపుతూ, నాడు స్వాతంత్ర పోరాటంలో అలుపెరుగని ఉద్యమం చేసిన పార్టీ సీపీఐ అని, ఫ్యూడల్ వ్యవస్థ విముక్తి కొరకు, పీడిత వర్గాల విముక్తి కోసం, అనేకమంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారని అన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా సాయుధ పోరాటానికి పిలుపునిచ్చి, దాదాపు 4500 మంది వీరులు తెలంగాణ కొరకు అమరులైనారని అన్నారు.

# వీఆర్వో వ్యవస్థ తిరిగి ఏర్పాటు చేయాలి

- టీజీటీఏ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాధ డిమాండ్
- తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో టీజీటీఏ ఏర్పాటు



**విశ్వంభర, సంగారెడ్డి:** క్రీస్తు శకం రాజుల కాలం నుండే రెవెన్యూ వ్యవస్థ ఉన్నదని టీజీటీఏ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాధ అన్నారు. శనివారం రోజు పటన్ చెరు డివిజన్ లోని జిఎమ్ఆర్ కన్వెన్షన్ సెంటర్ లో టీజీఆర్ఎస్ఏ రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. 30 వేల మంది విఆర్వో, వీఆర్ఏ లను గత ప్రభుత్వం తొలిగించిందని కొంత మందిని ఇతర శాఖలకు బదిలీ చేసి రెవెన్యూశాఖ లో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న వారి మనుగడ లేకుండా చేసిందని దుయ్యబట్టారు. ప అన్యాయం గా వీఆర్ఏ లను గెంటి వేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇతర డిపార్ట్మెంట్లో పని చేసుకుంటూ అక్కడ అవమానాలు పడుతున్నారని అన్నారు. ఆదివారం ఈ సమావేశం చూస్తుంటే మళ్లీ మా రెవెన్యూ వ్యవస్థకు మంచి రోజులు వచ్చాయని ఆమె అన్నారు. ముఖ్యంగా 61 ఆ పైన వీఅర్ఏ లకు జరుగుతున్న అన్యాయం గురించి మాట్లాడారు. మా బాధంతా మీ కోసమే ఎన్ని జిల్లాలు తిరిగినా కూడా మేమంతా మీకోసమే పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. తాము ఎక్కడ మాట్లాడినా, ఏ స్టేజి మీద ఉన్న, ఏ వేదిక పై ఉన్న, ఎక్కడ ప్రెస్ మీట్ పెట్టిన 61 విఆర్ఏ గురించి మాత్రం గట్టిగా మాట్లాడుతున్నాం అని అన్నారు. ఇప్పటికైనా మన రెవిన్యూ వ్యవస్థ యొక్క ప్రభావాన్ని తెలుసుకోవాలని తెలిపారు. భూమిశిస్తూ ఉన్నప్పటి నుంచి మనము భూములను లెక్కేసినం, సర్వే చేసినం ఏ రైతుకు ఎంత భూమి ఉంది అని లెక్కలు రాసినం అని వీ ఆర్ ఓ, వీ ఆర్ ఎ గురించి ప్రస్తావించారు. పేద రైతు ఎవరు, పెద్ద రైతు ఎవరు ఎవరికి సంక్షేమ ఫలాలు అందాలి అని మనమే చూసినం అని అన్నారు. గత గవర్నమెంట్ వల్ల రెవెన్యూ డిపార్ట్మెంట్లో వచ్చినటువంటి అలజడి వల్ల ముఖ్యంగా నష్టపోయింది పేద ప్రజలే అని అన్నారు. ఎందుకంటే ఒక సామాన్య రైతు కావచ్చు, ఒక పేద రైతు కావచ్చు, పేద వర్గాల ప్రజలు కావచ్చు వాళ్లకి ఏదైనా అన్యాయం జరిగితే మొట్ట మొదట ఒక సహాయం కోసం ఒక రెవెన్యూ విఆర్ఏ దగ్గరికి వెళ్లేవారని గుర్తు చేశారు. ప్రజలు తాను ఎ పరిస్థితుల్లో ఉన్నాను తనకు ఎలిజిబిలిటీ ఉందా అని విఆర్వోనె అడిగే వారని చెప్పారు. గవర్నమెంట్ స్కీమ్ తమకేమైన వస్తాయా, ఇల్లు వస్తుందా, రేషన్ కార్డులు కొత్తగా వస్తున్నాయా అని మొట్ట మొదట ఒక విఆర్ఏ దగ్గరికి పోయి ప్రజలు సహాయం అడుగుతారని గుర్తు చేశారు. ఎమ్మార్వోలకు వీఆర్వోల ద్వారా చాలా వరకు సహాయం తీసుకొని నోటీసులు ఇవ్వడం జరిగేదని చెప్పారు. మొదటగా గ్రామాల్లో విఆర్వోలే ఎంక్వయిరీలు పూర్తి చేసేవారని గుర్తు చేశారు. వీఆర్వోలని మళ్ళీ బ్యాక్ తీసుకురావాలి వీఆర్ఏలు ఇతర డిపార్ట్మెంట్లో పోయినవారు వాపసు రావాలని అన్నారు. అనంతరం టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బి.రాంరెడ్డి టీజీ ఏ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ పాక లు పాల్గొని ప్రసంగించారు. ఈ సంఘము యొక్క ముఖ్య ఉద్యేశం రెవెన్యూ శాఖను కాపాడు కోవడానికే నని స్పష్టం చేశారు. డిప్యూటీ కలెక్టర్ల సంఘము రాష్ట్ర అధ్యక్షుడు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఈ సంఘము పనిచేస్తుందని వివరించారు. ఈ సమావేశం పలువురు తహసీల్దార్ లు రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతూ వారు ఎదురుకొంటున్న సమస్యలగురించి ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా కమిటీని ప్రకటించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన వారిని శాలువలతో సన్మానించారు. ఇంకా వీఆర్వోలు, తహశీల్దార్ లు వివిధ రెవెన్యూశాఖ సిబ్బంది భారీ ఎత్తున పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతో మేలు

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మీర్ పేట్:** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఎంతో మేలు అని మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మీర్పేట్ లోని క్యాంప్ కార్యాలయంలో నేదునూరు గ్రామానికి చెందిన వ్యక్తికి మంజూరైన రూ .45 వేల చెక్కును అందజేశారు. అనంతరం సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు. ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నేదునూరు గ్రామం మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మహాపడి పూజ



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలం కొంగ్రిడి గాని బోడు తాండ గ్రామపంచాయతీలో ఆదివారం అయ్యప్ప స్వామి ఇరుముడి మహా పూజను కేరళకు చెందిన చందన్ నాయర్ గురు స్వామి ఆధ్వర్యంలో వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇరుముడి మహా పూజకు ముఖ్య అతిథులుగా డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల మాజీ జడ్పీటీసీ జరుపుల దశరత్ నాయక్ హాజరై అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తాండలోని భక్తులందరూ అయ్యప్ప స్వామి ఇరుముడి పూజలో పాల్గొన్నారు. ఆ ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మారు మోగింది. అనంతరం శబరిమల బయలుదేరే అయ్యప్ప మాల ధరించిన స్వాములకు గంప వెంకటేష్ గుప్తా జరుపుల దశరథ్ నాయక్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ పూజా కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ సేవియా నాయక్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ పాండు నాయక్, బిచ్యా నాయక్, భీమ్లా యాట నరసింహ, ఎల్లమల్ల సత్యం అయ్యప్ప భక్తులు తాండ పెద్దలు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్‌లో కాలభైరవ స్వామి బ్రహ్మోత్సవాలు

పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్‌లోని శ్రీ స్వయంభు కాలభైరవ దేవాలయ బ్రహ్మోత్సవాలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. అనంతరం బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ స్వయం భు కాలభైరవ స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు అంగరంగ వైభవంగా జరుపుతున్నారన్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులను అభినందిస్తూ ఆ స్వామివారి ఆశీస్సులు ఉప్పల్ ప్రజలందరిపై ఉండాలని కొనియాడారు. కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ముగిసిన రాష్ట్రస్థాయి యోగా పోటీలు



**విశ్వంభర, నెల్లికుదురు:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రం జడ్పిహెచ్ఎస్ లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి 68వ,ఎస్జీఎఫ్ యోగ పోటీలు ముగిశాయి. రాష్ట్ర పరిశీలకులు తోట సురేష్, గేమ్స్ స్టేట్ సెక్రటరీ చెడుపల్లి ఐలయ్యల ఆధ్వర్యంలో ఉత్సాహంగా పోటీలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి 140 మంది పాల్గొని యోగాసనాలు, ప్రాణాయామం చేశారు. అనంతరం విభాగాల వారీగా విజేత లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కొప్పుల శంకర్, ప్రవీణ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి తోడ్పాటు

- సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలో పర్యటించిన ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్, తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి నిర్మాణంలో ఉన్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయాన్ని ఆదివారం సందర్శించారు. గత పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు దేవాలయనిర్మాణానికి తన వంతు సహకారంగా మొదటగా 100(వంద)బస్తాల సిమెంట్ అందించటంతో పాటు ఆదివారం రూ.1,00,000ల చెక్ ని దేవాలయ అభివృద్ధి కొరకై కమిటీ సభ్యులకు గ్రామస్తుల సమక్షంలో అందజేశారు. దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించడంతో పాటు, నియోజకవర్గంలోని పేద ప్రజల అభ్యున్నతికై ఐక్యత ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు ఇంకా పెద్ద ఎత్తున కొనసాగిస్తామని తెలియజేశారు. దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు మాకు అడిగిన వెంటనే సహాయసహకారాలు అందిస్తున్న సుంకిరెడ్డి కి ఎల్లవేళలా రుణపడి ఉంటామని,చెన్నకేశవస్వామి ఆశీస్సులు వారిపై ఎల్లపుడు ఉండాలని కోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అనిల్ గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బీస బాలరాజు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీను, శరత్, కురుమయ్య, పాల్గొన్నారు.

## ఉప్పల్ ఆర్య సమాజ్, తపస్య ఫౌండేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



విశ్వంభర, హైదరాబాద్: ఆర్యసమాజం ఉప్పల్ ద్వారా ప్రచురింపబడిన 2025 హిందూ కాలమానాన్ని ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి. ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్ర్యమంలో ఆర్య సమాజం ఉప్పల్ వ్యవస్థాపకులు ఆచార్య వేద సింధు, ప్రధాన కార్యదర్శి బోల్ల విజయ్ కుమార్, కోశాధికారి మహాజన్ గంగాధర్, పండిత్ విజయ్ కుమార్, సంపత్ , రాహుల్ బాలాజీ, రాహుల్, బాలాజీ, రమేష్, ఆర్య సమాజ సభ్యులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆర్య సమాజ్ ఉప్పల్ శాఖ ఆధ్వర్యంలో అనేక శుభ కార్యక్రమాలు చేపడుతున్నారని అభినందించారు. అలాగే సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినమందనీయమన్నారు. ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సమాజ సేవలో ఉన్న ఆచార్యవేద సింధు కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఉప్పల్ పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించండి

ఎంపీ మల్లు రవి కి విన్నవించిన చిరువ్యాపారులు

**విశ్వంభర, ఆమనగల్లు:** నాలుగు మండలాలకు ప్రధాన కూడలి అయిన ఆమనగల్లు మండల కేంద్రంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కార్యాలయ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి చిరు వ్యాపారులను ఆదుకోవాలని కోరుతూ ఆదివారం ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో చిరువ్యాపారులు నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవికి వినతి అందించారు. గతంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఉన్నతాధికారులకు చిరు వ్యాపారులకు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, ఆదుకోవాలని వినతులు అందించినట్లు ఎంపీ దృష్టికి చిరు వ్యాపారులు తీసుకువెళ్లారు. రోజు రోజుకు దినదిన అభివృద్ధి చెందుతున్న ఆమనగల్లు పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్ లేక చిరు వ్యాపారులు జాతీయ రహదారికి ఇరువైపులా వ్యాపారాలు కొనసాగిస్తున్నారని, ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉంటుందో అని, ఆందోళన చెందుతున్నామని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ మల్లు రవి ప్రిన్సిపల్ సెక్రటరీ, పంచాయతీరాజ్ కమిషనర్లతో మాట్లాడి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్రం కేశవులు, చిరు వ్యాపారులు తెలిపారు వినతి అందించిన వారిలో చిరు వ్యాపారుల అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, రూపం వెంకటరెడ్డి, ధ్యాసం నరేందర్, భీమనపల్లి సుధాకర్, ఎండి రజాక్, జానీతో పాటు పలువురు చిరు వ్యాపారులు ఉన్నారు.





కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గడ్డం వెంకట్ స్వామి ( కాకా) 10 వర్ధంతి సందర్భంగా బాగ్ లింగంపల్లి లోని అంబేద్కర్ కళాశాల లో జరిగిన కార్యక్రమం మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ని సన్మానం చేసిన ఎ మ్మె ల్యే వేవేక్ వినోద్ చిత్రం లో పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శంకర్ రావు. - విశ్వంభర, బాగ్ లింగంపల్లి

# సీనియర్ జర్నలిస్టు ప్రభాకర్ కు ఘన నివాళి



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని సీనియర్ జర్నలిస్ట్ రాచర్ల ప్రభాకర్ కు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,స్థానిక కాకతీయ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. గత ఏడాది సీనియర్ జర్నలిస్టు ప్రభాకర్ అనారోగ్యానికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా ఆయన సంవత్సరీకం కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై ప్రభాకర్ చిత్రపటానికి పూలమాల వేసి,నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుగా ప్రభాకర్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. సమాజంలో అన్ని కోణాల్లో అనేక వార్తలు రాసి కీర్తి గడించారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్పం కిషన్, బుర్ర కొమురయ్య, పిప్పాల రాజేందర్, ఓద్దుల అశోక్ రెడ్డి, కాకతీయ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు టీఎస్ జేయు జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, తడుక సుధాకర్, దొమ్మటి రవీందర్, తిక్క ప్రవీణ్, నరేందర్, దేవేందర్, కడపక రవి, మారపల్లి చంద్రమౌళి, పాలకుర్తి, మధు గౌడ్, అశోక్, మధు, బెల్లం తిరుపతి తదితరులు పాల్గొన్నారు

## ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



**విశ్వంభర, భూపాలపల్లి:** పటేల్ ఐ కేర్ మంథని వ్యవస్థాపకులు ఆప్తాల్మిక్ ఆఫీసర్ బుద్దార్థి సతీష్ కుమార్, రంజిత్ పటేల్ వారి సహకారంతో భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం లోని మద్దులపల్లి, కుంట్లం, పలుగుల గ్రామాలలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటిలో శుక్లాలు, తెరిజియం, కంటిలో రెటీనా తో బాధపడుతున్న వారికి ఉచితంగా ఆపరేషన్ చేయబడునని తెలిపారు.వారికి బీపీ మరియు రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కంటి ఆపరేషన్స్ ఉన్న పేషెంట్స్ కి ఉచిత రవాణా, భోజనం సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయా గ్రామాల యువత మరియు ఆర్ ఎం పి రాజేందర్, తిరుపతమ్మ అంగన్వాడి టీచర్, పూతల శ్యామ్, మచ్చ రాజేష్ మాజీ సర్పంచ్ బాపురెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాకేష్, గట్టయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గడ్డం వెంకటస్వామికి ఘన నివాళి




**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ గడ్డం వెంకటస్వామి (కాకా) 10వ వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద ఆయన విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ , యన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కాక వెంకటస్వామి కుమారులు, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ , చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, మనుమడు పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ తో కలిసి పూలమాల వేసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నివాళులర్పించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ లో ఏర్పాటు చేసిన 10వ వర్ధంతి సంస్మరణ సభ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సభలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ కాక వెంకటస్వామి ప్రజల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత. ఆయన చేసిన సేవలు, ప్రజల కోసం అందించిన త్యాగాలు, మరియు నాయకత్వం ఎప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయన్నారు. పేదల పాలిట పెన్నిధి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గుడిసెల వెంకటస్వామి పేరుగాంచి అట్టడుగు వర్గాల ప్రజల అభివృద్ధి సంక్షేమంగా వారి అభ్యున్నతి కోసం అనునిత్యం ప్రజాసేవలో ఉంటూ తనదైన శైలిలో పేద ప్రజలను కాపాడుకుంటూ ముందుకు వెళ్లిన గొప్ప మహనీయుడు కాక వెంకటస్వామి అన్నారు.

## చెస్ క్రీడలతో జీవితంలో ఆటుపోట్లను ఎదుర్కొనే మేధస్సు



**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్ర గూడెం ఐఎంఏ కార్యాలయం నందు డైమండ్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -19 ఉమ్మడి నల్గొండ జిల్లా చెస్ టోర్నమెంట్ మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బి ఎల్ ఆర్) ప్రారంభించడం జరిగింది. తదుపరి నిర్వాహకులతో కలసి చెస్ఆడారు.అనంతరం వారు మాట్లాడుతూ పిల్లలు చెస్ క్రీడలు ఆడటం వలన మేధస్సు మెరుగుపడటంతో పాటు మానసికంగా బలంగా తయారు అవుతారు అన్నారు. చెస్ క్రీడలు నిత్యం ఆడుతుందటం వలన చదరంగంలోని ఆటుపోట్లనే కాదు జీవితంలో వచ్చే ఆటుపోట్లను కూడా తట్టుకునేలా ప్రణాళికలు రూపొందించే మేధస్సు కూడా పెంపొందుతుంది అని తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించాలి అనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం కప్ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నారు అని అన్నారు.పిల్లలను ప్రోత్సహిస్తున్న వారి తల్లితండ్రులను అభినందించారు. అలాగే నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మరియు బి .ఎల్. ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## గొర్రెలపై వీధి కుక్కల దాడి



**విశ్వంభర డిండి:** డిండి మండల పరిధిలో ని తవక్లాపూర్ గ్రామంలో ఆదివారం గొర్ల కాపరి కుందేళ్ళ తిరుపతయ్య రెండు గోర్లను కుక్కలు వేటాడి చంపాయి. గత నెల పెద్ద గొర్రె ను కూడా చంపాయి. గ్రామంలో కుక్కల దాడికి బలి అవుతున్న మేకలు,గొర్లు మాటు వేసి మేకల మందలపై కుక్కలు దాడి చేసి చంపేస్తున్నాయి. గ్రామంలో గొర్లు మేకలు కాసుకునే ప్రతి ఒక్క వ్యక్తి కుక్కల దాడికి బలైనవారే ఏ ఆదాయం లేకుండా గొర్లను కాచుకొని జీవనం గడుపుతూ వాటి పైన వచ్చే ఆదాయంతో పిల్లలను చదివించుకొని జీవనం సాగిస్తున్న గొర్ల కాపరులు కుక్కల వేటకు బలైపోతున్నారు.ఈ సమస్యను గతంలో పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకుపోవడం జరిగింది ఎంత మంది పంచాయతీ సెక్రెటరీ లు వచ్చిన ఈ యొక్క సమస్యను పరిష్కరించలేకపోతున్నారు ఇలాగే నిర్లక్ష్యం చేస్తే చిన్నపిల్లల పైన కూడా కుక్కలు దాడి చేసే ప్రమాదం ఉన్నందున వెంటనే ఉన్నతాధికారులు స్పందించి గొర్ల కాపరులకు మరియు గ్రామ ప్రజలకు కుక్కల నుండి విముక్తి కలిగించాలని, కుక్కలను పట్టుకు వెళ్లి దూర ప్రాంతంలో నన్నా వదిలివేయాలని ఎ ఐ వై ఎఫ్ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్ తెలిపారు.

# బాధితులకు సేవలందించేందుకు భరోసా కేంద్రాలు

### డీజీపీ డాక్టర్ జితేందర్
### కొత్తపల్లిలో భరోసా కేంద్రం ప్రారంభం



**విశ్వంభర, కరీంనగర్:** కమీషనరేట్ భరోసా కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ ప్రారంభించారు. కరీంనగర్ కొత్తపల్లి నందు తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో కరీంనగర్ కమీషనరేట్ కొరకు నూతనంగా, ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించబడిన భరోసా కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ ఆదివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర డీజీపీ కి కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పూల మొక్కతో స్వాగతం పలికారు. అనంతరం భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, నూతన భరోసా కేంద్ర నూతన భవనాన్ని ప్రారంభించారు. భరోసా కేంద్రంలో బాధిత మహిళలకు సేవలందించేందుకు ఏర్పాటు చేయబడిన గదులు, వాటిలో వసతులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ 1000 గజాల స్థలంలో, 6800 చదరపు మీటర్ల విస్తీర్ణంలో చాల అద్భుతంగా నిర్మించారాన్నారు. కరీంనగర్ లోని భరోసా కేంద్రంలో సేవలు సోమవారం నుండి అందుబాటులోకి రానున్నాయన్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళలకు, అసభ్యకరమైన లైంగిక ప్రవర్తనకు లోనైన పిల్లలకు పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులకు దూరంగా సురక్షితమైన వాతావరణంలో చేయూత అందించేందుకే తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కమీషనరేట్ మరియు జిల్లాల్లో ఈ భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాధితులకు సేవలందించుటలో భరోసా కేంద్రాల ఏర్పాటు మంచి సత్ఫలితాలనిస్తుందన్నారు. లైంగిక వేధింపుల కేసుల్లో శిక్షల శాతం పెరిగిందన్నారు.హైదరాబాద్ లో మొదట ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 27 జిల్లాల్లో భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ భరోసా కేంద్రంలలో బాధిత మహిళలకు మానసిక ప్రోత్సాహంతో పాటు, పోలీస్ సేవలు, అవసరమైన వైద్య సహాయం, న్యాయ సేవ, బాధితులకు సహాయ నిధి మొదలగు ఇతర సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సిటిజెన్ ఫీడ్ బ్యాక్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం వలన ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు వీలుంటుందన్నారు. ముఖ్యంగా మహిళల భద్రతే భరోసా యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ డి ఐ జి రమా రాజేశ్వరి, ట్రైనీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి, అడిషనల్ డీసీపీ లక్ష్మి నారాయణ , ఏసీపీ మాధవి , ఇన్స్పెక్టర్ శ్రీలత , ఎస్బిఐ బ్యాంకు అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



**విశ్వంభర, వరంగల్:** భారతీయ జనతా పార్టీ ఎంపీ లు ప్రతాప్ చంద్ర సారంగి, ముఖేష్ రాజపుత్ లపై పార్లమెంటు ఆవరణలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ బీజేవైఎం వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో బీజేపీ నాయకులతో కలిసి పోచం మైదాన్ జంక్షన్లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను వరంగల్ బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ దగ్ధం చేశారు. ప్రజాస్వామ్య దేశం లో దేవాలయం లాంటి పార్లమెంటు వద్దనే ఈ దాడి జరగడం చాలా దారుణం. కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాహుల్ గాంధీ బలవంతంగా తోయటంతోనే వారు గాయపడ్డారని తెలిసింది. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు తావులేదు. కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేకనే ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ అధికారం లేక పూర్తి గా అసహనంతో ఉన్నారు. అందువల్లనే ఈ దాడులు జరుగుతున్నాయి. వెనుకబడిన వర్గాలకు చెందిన వ్యక్తులు మీద దాడి చేయడమనేది కాంగ్రెస్ పార్టీకి పరిపాటిగా మారింది. ప్రజాస్వామ్యవాదులందరూ దీన్ని ఖండించాలి. రాహుల్ గాంధీ మీద మరియు ఈ ఘటనకు పాల్పడిన వారందరి మీద కేసు నమోదు చేసి, విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు.

# ముదిరాజ్ సామాజిక వర్గం అణిచివేతకు గురైంది

ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
అల్లదుర్గం సురేష్




**విశ్వంభర, హైదరాబాద్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఒక అతిపెద్ద సామాజిక వర్గాన్ని రిజర్వేషన్ల పరంగా అణిచివేతకు కారణమైన ప్రభుత్వాల, కుల సంఘాల పాత్ర చర్చించడానికి ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అల్లదుర్గం సురేష్ ఆధ్వర్యంలో ముదిరాజుల సమావేశం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించడం జరిగినది. హైకోర్టు న్యాయవాది చిల్లా రమేష్ ముదిరాజ్,సమితి రాష్ట్రప్రధాన కార్యదర్శి బాలు గారి నర్సింలు మాట్లాడుతూ నా రాష్ట్రం నా దేశం నా హిందూ ధర్మం అని బలంగా గుర్తిస్తే ముదిరాజ్ సామాజిక వర్గం నేడు తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాలలో అణిచివేతకు గురి అయినా విషయం అందరికి తెలిసిందే. అనంతరామన్ కమిటీ తన నివేదికలో ముదిరాజ్ కులం విద్య, ఉద్యోగ, సామాజిక, వృత్తుల పరంగా నిమ్నస్థాయిలో ఉన్నదని భావించినప్పటికీ నాటి పాలకవర్గం ఆంధ్ర మరియు స్థానిక నాయకుల కుటిల బుద్ధితో బీసీలలో ఏ బి సి డి వర్గీకరణ చేసి ముదిరాజులకు రిజర్వేషన్లు దక్కకుండా చేసిన విధానాన్ని తప్పు పట్టడం జరిగింది. ముదిరాజులు అన్ని రంగాల్లో వెనుకబడడానికి రిజర్వేషన్లే కారణమని తెలిసిన మేధావులు, నాయకులు నోరు మెదపకపోవడం విస్మయానికి గురి చేస్తుంది. 2009లో మాజీ ముఖ్యమంత్రి గౌరవనీయులు వైయస్ రాజశేఖర్ రెడ్డి ముదిరాజులను జీవో. ఎంఎస్. 15 /2009 ద్వారా బీసీ ఏ లోకి మార్చినప్పటికీ దాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన రాష్ట్రంలోని అన్ని పార్టీలు, ప్రభుత్వాలు, బాధ్యత వహించవలసి ఉంటుంది. 12 సంవత్సరాలుగా సుప్రీంకోర్టులో నానుతూ వస్తున్నా సమస్యను పరిష్కరిస్తామని చెప్పి రాష్ట్ర పరిధిలోకి తీసుకువచ్చి నేటికీ రెండు సంవత్సరాలు దాటిపోయిన ఇప్పటికి బీసీ ఎ కల గానే మిగిలిపోయింది. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ముదిరాజులను బిసిడి నుండి ఏ కు మారుస్తానని చెప్పి నేటి వరకు చర్యలు తీసుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ముదిరాజుల పట్ల ఉన్న నిర్లక్ష్యం కనబడుతుంది.ప్రభుత్వం వెంటనే రిజర్వేషన్ శాతాన్ని పెంచుతూ ముదిరాజులను బీసీ ఏ లో చేర్చాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాల్లోనే కాక రాజకీయాల్లో సైతం రాజకీయ పార్టీలు ముదిరాజుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడాన్ని ఖండించారు. ముదిరాజులకు మంత్రి పదవి ఇస్తానని ఎన్నికల ప్రచారంలో గౌరవనీయులు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అలాగే ముఖ్యమంత్రి కి వీరాభిమానిగా పార్టీ కార్యక్రమాలను బలంగా ప్రజల్లోకి తీసుకు వెళు న్న మోత రోహిత్ కి, కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉన్న సంజీవ్ ముదిరాజ్ కి, మక్తల్ శ్రీహరి గారికి,నీలం మధు కి, మంత్రివర్గంలో నామినేటెడ్ పోస్టులలో నియమించాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమార్ ముదిరాజ్,ఉపాధ్యక్ష్యులు తోట సంజయ్,బి నారాయణ ముదిరాజ్, కటికల శ్రీహరి, మురళి మనోహర్, వొన్నాజిపేట రమేష్, సినేటి శ్రీనివాస్, బాబురావు,చొప్పరి రాము రాజేశ్వరి, అనసూయ, విజయలక్ష్మి , రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ముదిరాజులు పాల్గొన్నారు.

## గొప్ప రాజకీయ వేత్త.. వెంకట స్వామి



**విశ్వంభర, భూపాలపల్లి :** కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ జి. వెంకటస్వామి గొప్ప రాజకీయ వేత్త అని భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు.ఆదివారం ఐడిఓసి కార్యాలయంలో స్వర్గీయ వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటస్వామి వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం "స్టేట్ ఫంక్షన్" గా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. వెంకటస్వామి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని తెలిపారు. సామాజిక సమానత్వం కోసం సాగించిన ఉద్యమాలు, శ్రామిక వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి అభినందనీయమని అన్నారు. తాను చేపట్టిన పదవులకు వన్నె తెచ్చిన గొప్ప రాజకీయవేత్తని ఆయన సేవలను కొనియాడారు. సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని, ఆయన సేవలను గుర్తిస్తూ నిరంతరం స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తోందని అన్నారు. స్వర్గీయ వెంకటస్వామి అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శభాష్ పోలీస్



**విశ్వంభర, భూపాలపల్లి:** శభాష్ పోలీస్ అన్నలు ప్రజాసేవ చేయడంలో మీకు మీరే సాటి..మీకు రారు ఎవరు పోటీ అన్నట్లుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి పోలీసులు ప్రజాసేవలో నిమగ్నమయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు మొగుళ్ళపల్లి ఎస్ఐ బోనగాల అశోక్ ఆధ్వర్యంలో మండలంలోని ముల్కలపల్లి-పర్లపల్లి గ్రామాల మధ్యన మూల మలుపుల వద్ద ఏపుగా పెరిగిన ముళ్ళపోదలు వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుండడంతో జేసీబీ సహాయంతో అట్టి ముళ్ళ పొదలను బ్లూ కోర్ట్ సిబ్బంది దగ్గరుండి తొలగించేశారు. తప్పు చేస్తే కఠినంగా వ్యవహరించే పోలీసులు..ప్రజలకు ఏ ఇబ్బందులు కలిగిన ప్రజాసేవలో ముందుంటారని ఈ సందర్భంగా ప్రజలు, మానవతావాదులు, ఉద్యోగులు, మేధావులు, వారిని అభినందిస్తున్నారు.

# భూ భారతి భూ హారతి అయ్యేలా కనిపిస్తోంది



విశ్వంభర, భూపాలపల్లి : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టం భూ హారతి అయ్యేలా కనిపిస్తోందని భూపాలపల్లి జిల్లా మొగుళ్లపెల్లి సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు చదువు అన్నారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువస్తున్న భూమాత చట్టం, ఈ పోర్టల్ భూమేతకు దారి తీస్తుందేమోనని సందేహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అంటే భూ రక్షణ సమితి అని రైతులు, ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. భూమి కోసం ప్రాణమిచ్చేది సైనికుడు, రైతు మాత్రమేనన్నారు. ఏమైనా సమస్యలు వస్తే వాటిని పరిష్కరించుకొని ముందుకెళ్లాలే తప్పా వ్యవస్థనే రద్దు చేయడం సరికాదన్నారు. ధరణిలో కుట్ర కోణం ఉన్నదని ప్రభుత్వం చెప్పడం దారుణమన్నారు. తెలంగాణలో 2.8 కోట్ల ఎకరాల భూమి ఉంటే అందులో 1.5 కోట్ల ఎకరాలు సాగు భూమి అని..17.8 లక్షల ఎకరాలు మాత్రమే వివాదాల్లో ఉన్నాయని తెలిపారు. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత భూమోసాలు లేకుండా పోయాయన్నారు. రాష్ట్ర రైతలకు ఇది రక్షణ కవచంలా నిలిచిందన్నారు. ధరణితో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చరిత్ర క్షమించదని, ప్రజలు వెంటబడి మరీ ధరణిని తిరిగి సాధించుకుంటారని తేల్చిచెప్పారు. గతంలో కౌలుదారులు కేసులు వేస్తే 20 నుంచి 25 ఏళ్ల పాటు రైతులు కోర్టుల చుట్టు తిరిగే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. అందేకే కేసీఆర్ రైతుకు మాత్రమే భూమికి యాజమన్య హక్కు ఉండే విధంగా మార్పులు చేశారన్నారు. ధరణితో అనేక భూ సమస్యలు పరిష్కారమయ్యాయని, వంద రోజుల్లో రెవెన్యూ రికార్డులు ప్రక్షాళన చేశారన్నారు. ఆ తర్వాతే భూముల వివరాలు ధరణిలో నమోదు చేశారన్నారు. ధరణి కన్నా ముందు చార్మినార్ కూడా రిజిస్ట్రేషన్ చేసుకునే పరిస్థితి ఉండేదన్నారు. ధరణి పోర్టల్‌తో ప్రభుత్వ భూములను కాపాడారని తెలిపారు. రిజిస్ట్రేషన్ల వ్యవస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేరువ చేసిందన్నారు. రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ఒకేసారి చేయడంతో రైతులకు మేలు కలిగిందన్నారు. భూ రికార్డులు సరిగ్గా ఉండడంతోనే భూముల రేట్లు పెరిగి, రాష్ట్ర సంపద పెరిగిందన్నారు. మాన్యువల్ పహాణీలతో రాష్ట్రంలో అనేక వివాదాలు ఉండేవని వాటిని ధరణి తీర్చిందన్నారు. రాష్ట్రంలో 66 లక్షల మంది రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు ఇచ్చిందని, గతంలో పంట రుణాలు కూడా వచ్చేవి కావని, ధరణి వచ్చిన తర్వాత బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం మొదలుపెట్టాయన్నారు. తద్వారా ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి రైతులు విముక్తులయ్యారని తెలిపారు. భూదాన్, అటవీ, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు వాటిని పార్ట్ బీ లో చేర్చితే ఎంజాయ్ మెంట్ సర్వే చేయిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తోందని, దీని వల్ల గ్రామాల్లో లేని తగాదాలు మొదలవుతాయన్నారు. పల్లెలు ప్రశాంతంగా ఉండాలంటే ఎంజాయ్ మెంట్ సర్వే తేనె తుట్టెను కదపొద్దన్నారు. మళ్లీ 32 కాలమ్ లతో పహాణీలు తెస్తే మళ్లీ పాత వ్యవస్థ వస్తుందన్నారు. రైతుల మధ్య వివాదాలు తలెత్తి, కేసులు, ఆర్థిక భారం అవుతుందన్నారు. రాష్ట్రమంతా ఒకే సారి కాకుండా దశల వారీగా రీసర్వే చేయాలన్నారు. ఎవరూ ట్యాంపర్ చేయడానికి వీలు లేకుండా పాస్ బుక్ లు ఉన్నాయని అలాంటప్పుడు భూధార్ కార్డులు ఎందుకని ప్రశ్నించారు. హైదరాబాద్ చుట్టుముట్టున్న ఆబాదీ భూములపై ప్రభుత్వ పెద్దల కన్ను పడిందని ప్రచారం జరుగుతోందని, భూభారతి వల్ల తప్పు జరిగితే ప్రభుత్వ ఉద్యోగులకు శిక్ష వేస్తామని భయపెట్టడం సరికాదన్నారు. భూభారతిలో కౌలుదారులు, అనుభవదారుల కాలమ్ పెట్టే ఆలోచనను విరమించుకోవాలని, కౌలుదారులను వేరే విధంగా ఆదుకోవాలని సూచించారు.

# సీఎం రేవంత్‌కు అల్లు అర్జున్ క్షమాపణలు చెప్పాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్‌:** సినీ నటుడు అల్లు అర్జున్ మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. సీఎం రేవంత్‌కు అల్లు అర్జున్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తన ఇమేజ్ డ్యామేజ్ చేశారంటూ సీఎం వ్యాఖ్యలపై ఎదురుదాడి చేయడం సరికాదన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు లీగల్ టీమ్ ఒప్పుకోలేదనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తే ఇమేజ్ దెబ్బతిన్నదని అంటున్నారని విమర్శించారు. తెలంగాణలో ఇక సినిమాల బెనిఫిట్ షోలు ఉండవని స్పష్టం చేశారు. మహిళా కుటుంబానికి అల్లు అర్జున్ పరిహారం కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. సినిమాకు రూ.2వేలకోట్లు వసూలు చేశారని.. రూ.10కోట్లు ఇస్తే పోయేదేముందని ప్రశ్నించారు. ఐకాన్‌స్టార్‌ని అరెస్ట్ చేస్తారా? అని అంటున్నారని.. మనిషి చనిపోయాక ఐకాన్ స్టార్ అయితే ఏంటీ? సూపర్‌స్టార్ అయితే ఏంటీ? చట్టానికి ఎవరూ చుట్టాలు కాదన్నారు. హీరో అయినా.. ఎమ్మెల్యే అయినా చట్టానికి అందరూ



సమానమేనన్నారు. బాధిత కుటుంబానికి రూ.20కోట్లు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మీరు రూ.వేల కోట్లు ఖర్చు పెట్టి సినిమా తీస్తే మాకేం సంబంధం అని ప్రశ్నించారు. దేశభక్తులు, తెలంగాణపై సినిమాలు తీస్తేనే బెనిఫిట్స్ కల్పిస్తామన్నారు. సినిమాటోగ్రఫీ మంత్రిగా చెబుతున్నా.. ఎవరు చెప్పినా వినేది లేదన్నారు. అల్లు అర్జున్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా స్పందించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అల్లు అర్జున్ మీడియా సమావేశం నిర్వహించారు. తన ఇమేజ్‌ని డ్యామ్ చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఈ ఘటనలో తాను ఎవరినీ నిందించదలచుకోలేదన్నారు. అయితే ఎక్కడా సీఎం రేవంత్‌రెడ్డి పేరు ప్రస్తావించకపోయినా.. కాంగ్రెస్ నేతలు మాత్రం అల్లు అర్జున్‌పై తీవ్రస్థాయిలో ఆగ్రహం చేస్తున్నారు. థియేటర్‌లో ఓ తల్లి చనిపోయినా మానవత్వం లేకుండా రూఫ్‌టాప్ ఓపెన్ చేసి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయిన ఆ హీరో ఏం మనిషి..? ఆ వ్యక్తి హీరోనే కాదంటూ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, పోలీసుల అనుమతి లేకుండానే థియేటర్‌కు వెళ్లానని.. రోడ్‌షో చేశానంటూ చేసిన ఆరోపణలను అల్లు అర్జున్ ఖండించారు. పోలీసుల అనుమతి తీసుకున్నామని థియేటర్ యాజమాన్యం చెబితేనే అక్కడికి వెళ్లానన్నారు. తొక్కిసలాట ఘటనలో తన వ్యక్తిత్వాన్ని దుష్ప్రచారం చేస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

## ఇలాంటి ఘటనలను ఎవరూ ప్రోత్సహించకూడదు

నిర్మాత అల్లు అరవింద్



**విశ్వంభర, హైదరాబాద్‌:** సినీ నటుడు అల్లు అర్జున్ ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓయూ జేఏసీకి చెందిన పలువురు నాయకులు విధ్వంసం సృష్టించారు. ఇంటి ప్రహరీ గోడ దూకి.. ఇంటి లోపలికి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇంటి ఆవరణలో ఉన్న పూలకుండీలను ధ్వంసం చేశారు. రేవతి మృతికి కారణం అల్లు అర్జున్ అంటూ నినదించారు. ఆ తర్వాత సమాచారం అందుకున్న పోలీసులు సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని.. స్టేషన్‌కు తరలించారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిర్మాత అల్లు అరవింద్ మీడియాతో మాట్లాడారు. ఇవాళ మా ఇంటి ముందు జరిగిన ఘటన అందరూ చూశారన్నారు. తాము సంయమనం పాటించాల్సిన సమయమని.. అందుకే అదే పాటిస్తున్నామన్నారు. ఇంటికి జూబ్లీహిల్స్ పోలీసులు వచ్చారని.. దాడి ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఎవరైనా గొడవ చేయడానికి వస్తే పోలీసులు తీసుకెళ్లడానికి సిద్ధంగానే ఉన్నారని తెలిపారు. ఎవరూ ఇలాంటి దుశ్చర్యలను ప్రేరేపించకూడదని.. ఇలాంటి ఘటన ఎవరికీ జరగకూడదన్నారు. తొందరపడి ఎలాంటి చర్యలకు దిగొద్దని.. దయచేసి అర్థం చేసుకోవాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు.

## అమెరికాలో హనుమకొండ జిల్లా విద్యార్థి అనుమానాస్పద మృతి



**విశ్వంభర, హనుమకొండ:** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేట గ్రామానికి చెందిన బండి వంశీ అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఓ యూనివర్సిటీలో ఎమ్మెస్ చేయడానికి ఏడాదిన్నర క్రితం అమెరికా వెళ్లిన వంశీ అక్కడే చదువుకుంటూ పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి అతను ఉంటున్న అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో కారు సీట్లో మృతిచెంది కనిపించాడు. అక్కడే ఉన్న తోటి విద్యార్థులు ఆదివారం సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ విషయాన్ని కమలాపూర్ మండల భాజపా నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తీసుకువచ్చేలా చొరవ తీసుకోవాలని, ఘటనపై దర్యాప్తు చేయించాలని కోరారు.

## చెన్నై ఎగ్మోర్ రైలులో మంటలు

గద్వాల స్టేషన్‌లో నిలిపివేత



**విశ్వంభర, గద్వాల:** గద్వాల రైల్వేస్టేషన్‌లో చెన్నై ఎగ్మోర్ రైలును అధికారులు నిలిపివేశారు. అకస్మాత్తుగా రైలు ఎక్స్‌ప్రెస్ బోగీలో నుంచి దట్టంగా పొగలు వ్యాపించాయి. దాంతో అధికారులు వెంటనే రైలును ఆపి.. ప్రయాణికులను దింపివేశారు. కాచిగూడ నుంచి చెన్నైకి బయలుదేరిన రైలులో మంటలు చెలరేగాయి. ఎక్స్‌ప్రెస్ రైలులోని ఎనిమిదో నెంబర్ ఏసీ బోగిలో పొగలు అలుముకున్నాయి. ఈ ఘటనతో ఒక్కసారిగా ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో తెలియక కేకలు వేశారు. ఆ తర్వాత అధికారులు ప్రయాణికులను బోగీల నుంచి ప్రయాణికులను దింపారు. అసలు రైలులో పొగలు రావడానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రస్తుతం అధికారులు ఘటనపై విచారణ జరుపుతున్నారు.

## సినిమా చూశాకే వెళ్తానని అల్లు అర్జున్ అన్నారు: చిక్కడపల్లి ఏసీపీ



**విశ్వంభర, హైదరాబాద్:** సంధ్య థియేటర్ వద్ద డిసెంబరు 4న రాత్రి ఏం జరిగిందనే విషయాన్ని చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ కుమార్ మీడియాకు వివరించారు. "అల్లు అర్జున్ మేనేజర్ సంతోష్‌ని కలిసి తొక్కిసలాటలో మహిళ చనిపోయారు, బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి అదుపుతప్పింది. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించాం. అయినా.. మేనేజర్ మమ్మల్ని అల్లు అర్జున్ వద్దకు వెళ్లనీయలేదు. అతి కష్టం మీద వారిని నెట్టుకుంటూ వెళ్లి జరిగిన విషయం అల్లు అర్జున్‌కు చెప్పా. మీకు అధికారులంతా సహకరించి రూట్ క్లియర్ చేశారు. దయ చేసి ఇక్కడి నుంచి ఖాళీ చేయండి అని చెప్పా. సినిమా చూసిన తర్వాతే వెళ్తానని చెప్పారు. వెంటనే డీసీపీకి చెప్పాం. ఆయన.. మేము లోపలికి వచ్చి 10 నిమిషాలు సమయం ఇచ్చాం. ఆ తర్వాత అల్లు అర్జున్‌ను బయటకు తీసుకొచ్చాం. మేం లోపలికి వెళ్లే వీడియోలు ఉన్నాయి. అల్లు అర్జున్‌తో మాట్లాడే ఫుటేజ్ కోసం ట్రై చేశాం దొరకలేదు" అని చిక్కడపల్లి ఏసీపీ మీడియాకు వివరించారు."అల్లు అర్జున్ వద్దకు మేము వెళ్లేందుకు మేనేజర్ ఒప్పుకోలేదు. అక్కడి నుంచి అల్లు అర్జున్ వెళ్లకపోతే పరిస్థితి చేయి దాటిపోతుందని చెప్పాం" అని చిక్కడపల్లి ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

# ఖమ్మం నగరాభివృద్ధికి కృషి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**విశ్వంభర, ఖమ్మం:** దినదినాభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరాభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తూ.. అందుకు అవసరమైన నిధులను ప్రభుత్వ పరంగా మంజూరు చేయిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని 57వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీసీకి రూ.100 కోట్ల నిధులతో ఖమ్మం నగరంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. దీనిలో భాగంగా చారిత్రక ఖిల్లా అభివృద్ధికి రూ.15 కోట్లతో రోప్ వే నిర్మాణం చేపడతామన్నారు. వీటికి అదనంగా మరో రూ. 15 కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రిని అడిగామన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరాభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తూ.. అందుకు అవసరమైన నిధులను ప్రభుత్వ పరంగా మంజూరు చేయిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని



57వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీసీకి రూ.100 కోట్ల నిధులతో ఖమ్మం నగరంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. దీనిలో భాగంగా చారిత్రక ఖిల్లా అభివృద్ధికి రూ.15 కోట్లతో రోప్ వే నిర్మాణం చేపడతామన్నారు. వీటికి అదనంగా మరో రూ. 15 కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రిని అడిగామన్నారు.

# నిర్వాసిత గ్రామంలో పూర్తిస్థాయి సౌకర్యాలు

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి


**విశ్వంభర, భువనగిరి :** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బస్వాపూర్‌లో నిర్మితమవుతున్న నరసింహసాగర్ జలాశయంలో ముంపునకు గురవుతున్న బి.యన్. తిమ్మాపూర్ పునరావాస గ్రామంలో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్రాజెక్టులో భాగంగా భువనగిరి పట్టణ శివారులోని 107 సర్వే నెంబర్‌లో నిర్మితమవుతున్న పునరావాస కాలనీలో పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. వసతి కల్పనలో భాగంగా రూ.32 లక్షల అంచనా వ్యయంతో పనిని ప్రారంభించారు. ఈ పనిని త్వరగతిన పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని గుత్తేదారు, సంబంధించిన శాఖ అధికారులను శాసన సభ్యులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ ఎండీ అవెజ్ చిస్తీ, హుస్నాబాద్ పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ ఎడ్ల సత్య



రెడ్డి, నాయకులు రాజు, ఎల్లయ్య, ఉడుత అంజనేయులు, మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. కరుణాకర్, ఉపకార్య నిర్వాహక ఇంజినీర్ పి.ప్రశాంత్ కుమార్, భువనగిరి మండల మిషన్ భగీరథ సహాయక ఇంజినీర్ గుండురావు తదితరులు పాల్గొన్నారు.

## సినిమాలోనే కాదు.. నిజ జీవితంలోనూ బాధ్యతగా ఉండు

అల్లు అర్జున్‌కు భువనగిరి ఎంపీ చురకలు



**విశ్వంభర, హైదరాబాద్:** సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనలో తన వ్యక్తిత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ హీరో అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలపై భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. అల్లు అర్జున్ మానవత్వం మరిచినట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరో రాసిన నోట్‌ను ప్రెస్‌మీట్‌లో చదివారని విమర్శించారు. అందులో ఉన్నది చదవడం విడ్డూరంగా ఉందన్నారు. అల్లు అర్జున్ నిజ జీవితంలోనూ నటిస్తున్నట్లే ఉందని మండిపడ్డారు. ఆయన నటించిన సినిమాకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి అండగా ఉండి రేట్లు పెంచారని చెప్పారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి వాస్తవాలు చెప్పారని తెలిపారు. సినిమాలోనే కాదు.. నిజ జీవితంలోనూ బాధ్యతగా ఉండాలంటూ బన్నీకి చురకలంటించారు. థియేటర్‌లో ఒక తల్లి చనిపోయినా కూడా మానవత్వం లేకుండా రూఫ్‌టాప్ ఓపెన్ చేసి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయిన ఆ హీరో ఏం మనిషి..? మృత్యువుతో పోరాడుతున్న బాలుడిని ఆ హీరోనే కాదంటూ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయితే పోలీసుల అనుమతి లేకుండానే థియేటర్‌కు వెళ్లి, రోడ్‌షో, ర్యాలీ నిర్వహించినట్టు వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని అల్లు అర్జున్ శనివారం స్పష్టంచేశారు. పోలీసుల అనుమతి తీసుకున్నామని థియేటర్ యాజమాన్యం చెబితేనే అక్కడికి వెళ్లానని తెలిపారు. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల తర్వాత రాత్రి 8గంటల సమయంలో హైదరాబాద్‌లోని తన నివాసంలో అల్లు అర్జున్ మీడియా సమావేశం నిర్వహించారు. ఎక్కడా ముఖ్యమంత్రి పేరు ప్రస్తావించకుండానే ఆయన చేసిన ఆరోపణలకు సమాధానం ఇచ్చారు. తొక్కిసలాట ఘటనలో తన వ్యక్తిత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. థియేటర్ వద్ద జరిగిన ఘటన చాలా దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నానని, చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. థియేటర్ పరిసరాల్లో ఎలాంటి రోడ్‌షో నిర్వహించలేదని అల్లు అర్జున్ తెలిపారు. తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన విషయం తనకు మరుసటి రోజు వరకు తెలియదని చెప్పారు. తనపై కేసు నమోదు కావడం వల్ల నేరుగా వెళ్లి బాధిత కుటుంబాన్ని కలవలేకపోయానని తెలిపారు. 'థియేటర్ వాళ్లు పర్మిషన్ తీసుకున్నామని చెబితేనే నేను అక్కడకు వెళ్లాను. పోలీసులే అక్కడకు వచ్చిన జనాల్ని నియంత్రిస్తూ నా కారు లోపలికి వెళ్లేలా చూశారు. పోలీసులు అక్కడకు వచ్చారంటే పర్మిషన్ ఇచ్చినట్లే కదా! అభిమానులు చుట్టుముట్టడంతో నా కారు ముందుకు కదల్లేదు. నేను అభివాదం చేస్తే రద్దీ క్లియర్ అవుతుందని పోలీసులు చెప్పడంతోనే చేయి ఊపుతూ ముందుకెళ్లాను' అని అల్లు అర్జున్ చెప్పారు. సినిమా చూస్తున్నప్పుడు పోలీసు అధికారులెవ్వరూ తనను కలవలేదని, థియేటర్ యాజమాన్యం వచ్చి బయట రద్దీ పెరుగుతున్నదని చెబితే తాను బయటకు వచ్చానని తెలిపారు.

## దేశ ఇంధన వనరులను తీర్చడంలో సింగరేణి కీలక పాత్ర

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**విశ్వంభర, పెద్దపల్లి :** దేశంలో ఇంధన వనరులను తీర్చడంలో సింగరేణి సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మికులకు,సిబ్బంది, అధికారులకు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సింగరేణి వెన్నెముకగా నిలుస్తుందని పేర్కొన్నారు.తెలంగాణలోని ఆరు జిల్లాల్లో లక్షల మంది ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారంగా ఉన్న సింగరేణిని కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం చేయకుండా ఇతర రంగాలలోకి కూడా ప్రవేశించి, మరింత విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు.సింగరేణి సంస్థ సుస్థిర భవిష్యత్ కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. కార్మికులు శ్రమశక్తిని చాటుతూ సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితమవాలని కోరారు.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది

సీపీ సీవీ ఆనంద్



**విశ్వంభర, హైదరాబాద్‌:** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ వార్షిక మీడియా సమావేశంలో సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఘటన సమయంలో అల్లు అర్జున్ వద్దకు వెళ్లేందుకు ఎస్‌హెచ్‌వో కూడా తీవ్రంగా కష్టపడాల్సి వచ్చిందని తెలిపారు.అల్లు అర్జున్ వచ్చేందుకు థియేటర్ వాళ్లు దరఖాస్తు చేస్తే తిరస్కరించామని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. థియేటర్ వాళ్లు అల్లు అర్జున్‌కు విషయం చెప్పారో.. లేదో తమకు తెలియదని అన్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై మాట్లాడిన అనంతరం బౌన్సర్ల సప్లై ఏజెన్సీలకు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బౌన్సర్లు ఇకపై పోలీసులను ముట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే.. ఊరుకునేది లేదని అన్నారు. బౌన్సర్ల ప్రవర్తనకు సప్లై ఏజెన్సీలదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజల ఇబ్బంది గురించి ఆలోచించే బాధ్యత వీఐపీలదే అని పేర్కొన్నారు.అల్లు అర్జున్ మేనేజర్ సంతోష్ వద్దకు వెళ్లి తొక్కిసలాట విషయం చెప్పామని ఏసీపీ రమేశ్ కుమార్ తెలిపారు. ఒక బాలుడు పరిస్థితి విషమంగా ఉందని.. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించామని పేర్కొన్నారు. మేనేజర్ మమ్మల్ని అల్లు అర్జున్ వద్దకు వెళ్లనీయలేదని చెప్పారు. అతి కష్టం మీద వారిని నెట్టుకుంటూ వెళ్లి అల్లు అర్జున్‌కు విషయం చెప్పామని అన్నారు. కానీ సినిమా చూసిన తర్వాతే అక్కడి నుంచి వెళ్తామని చెప్పారని అన్నారు. 10 నిమిషాలు చూసిన తర్వాత డీసీపీ ఆదేశాల మేరకు అల్లు అర్జున్‌ను బయటకు తీసుకొచ్చామని వివరించారు.

## సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ కవిత



**విశ్వంభర, సికింద్రాబాద్‌:** బీఆర్ఎస్ పార్టీ కీలక నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత ఆదివారం ఉదయం సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారుల వేదమంత్రాల ద్వారా అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో ఇటీవలే అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన జరిగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ కవిత తన పరివారంతో కలిసి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో తొట్టెల ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ ఊరేగింపులో పోతరాజులు భక్తులను అలరించారు. కవిత అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు.

# సర్వ మతాలకు సమ ప్రాధాన్యత కేసీఆర్ ఘనతే

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

**విశ్వంభర, సూర్యాపేట:** సర్వమతాలకు సమప్రాధాన్యత కేసీఆర్ ఘనతే అని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జీ జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. అన్ని మతాల ప్రధాన పండుగలు అధికారికంగా నిర్వహించుకుంటున్నాం అని తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా ఆదివారం సూర్యాపేటలో క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ ..'గతఏడాది వరకు బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ దుస్తులు పంచుకున్నాం.. ఇఫ్తార్, ప్రేమ విందులతో ఐక్యతను పెంచుకున్నాం' అని చెప్పారు.కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదికే పండుగలకు దుస్తులు మాయమైనయ్. వచ్చే ఏడాది వరకు ఇంకేం వుంటాయో, పోతాయో చెప్పలేం. పండుగ వేడుకల్లో రాజకీయాలు మాట్లాడటం మాకు అలవాటు లేదు. కానీ రోజురోజుకూ ఈ ప్రభుత్వ పరిస్థితి చూస్తుంటే తప్పడంలేదు. హామీలు, అభివృద్ధి మాట దేవుడెరుగు. పండుగలను కూడా పట్టించుకోకపోతే ఎట్లా. క్రైస్తవ సోదరులందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు. ప్రశాంత వాతావరణంలో పండుగ వేడుకలు జరుపుకోవాలి. ప్రజలందరిపై




యేసుప్రభు ఆశీస్సులు ఉండాలి' అని పేర్కొన్నారు.

### పూరీ జగన్నాథ ఆలయంలో

# దర్శనాలకు సరికొత్త విధానం..!

**○ జనవరి ఒకటి నుంచి అమలులోకి..!**



**పూరి:** ప్రముఖ క్షేత్రమైన పూరీ జగన్నాథ ఆలయంలో భక్తులకు దర్శనం కోసం మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఒడిశా ప్రభుత్వం సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టబోతున్నది. ఈ కొత్త విధానాన్ని జనవరి ఒకటి నుంచి ప్రారంభించనున్నట్లు న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఆదివారం తెలిపారు.

ఆలయ నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కొత్త విధానానికి సంబంధించిన ఏర్పాటు ఈ నెల 27, 28 తేదీల్లోగా పూర్తవుతాయన్నారు. డిసెంబర్ 30, 31 తేదీల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నామన్నారు. జనవరి ఒకటి నుంచి కొత్త దర్శన విధానం పూర్తిస్థాయిలో అమలులోకి తీసుకువస్తామన్నారు. ఈ కొత్త విధానంలో ఆలయానికి వచ్చే మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కొత్త విధానంలో భక్తులు ప్రస్తుతం ఉన్న ద్వారం (సత్పహచ) నుంచి జగన్నాథ ఆలయంలోకి ప్రవేశిస్తారు.అయితే, బయటకు వెళ్లేందుకు రెండు వేర్వేరు దారులుంటాయి. జగన్నాథ ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారి అరబింద పాడి ఆలయాన్ని సందర్శించి ఆలయంలో కొత్త విధానం అమలుకు సంబంధించిన పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల రద్దీ కారణంగా గర్భగుడిలో కొలువైన దేవతామూర్తులను దర్శించుకోవడానికి తరచుగా ఇబ్బందులు ఎదురవుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కొత్త విధానంలో నాట్య మండపంలో ఆరు వరుసల్లో ప్రత్యేకంగా బారికేడట్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ పనుల కోసం ఒడిశా బ్రిడ్జి అండ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్‌ని నియమించి.. ఏడాది చివరికల్లా పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రత్న భండార్ మరమ్మతు పనులపై ఎలాంటి ప్రభావం ఉండదని ఆయన చెప్పారు. రత్నా భండార్ పునరుద్ధరణ పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ASI) లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.



## బాల్య వివాహాలపై కేసులు.. 400 మందికిపైగా అరెస్ట్

**గౌహతి:** బాల్య వివాహాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. రాత్రి వేళ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. 400 మందికిపైగా అరెస్ట్ చేశారు. బీజేపీ పాలిత అస్సాంలో ఈ సంఘటన జరిగింది. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఆ రాష్ట్రంలో కేసులు నమోదు చేస్తున్నారు. మూడో విడతలో భాగంగా 335 కేసులు నమోదు చేశారు. శనివారం అర్ధరాత్రి వేళ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ కేసులకు సంబంధించి 416 మందిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిని ఆదివారం కోర్టులో ప్రవేశపెడతామని సీఎం హిమంత బిస్వా శర్మ తెలిపారు. ఈ సాంఘిక దురాచారాన్ని అంతం చేసేందుకు సాహసోపేతమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.కాగా, అస్సాం రాష్ట్ర ప్రభుత్వం 2023లో రెండు దశల్లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. గత ఏడాది ఫిబ్రవరిలో చేపట్టిన తొలి దశ డ్రైవ్‌లో 4,515 కేసులు నమోదు చేసిన పోలీసులు 3,483 మందిని అరెస్టు చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో నిర్వహించిన రెండో దశ డ్రైవ్‌లో 710 కేసులు నమోదు చేసి 915 మందిని అరెస్టు చేశారు. తాజాగా మూడో దశ డ్రైవ్‌లో 335 కేసులు నమోదు చేసిన పోలీసులు 416 మందిని అరెస్ట్ చేశారు.

## రూ.20 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

**గువాహటి:** అస్సాంలో పోలీసులు భారీ మొత్తంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన పక్కా సమాచారంతో దాదాపు 125 గ్రాముల హెరాయిన్ , 60,000 యాబా టాబ్లెట్లను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఐజీ పార్థసారథి మహంత పేర్కొన్నారు. దీని విలువ రూ.20 కోట్లకు పైగా ఉంటుందని తెలిపారు.కాచర్ జిల్లాలోని సిల్కూరి రోడ్డు వద్ద ఓ వ్యక్తి మాదకద్రవ్యాలను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) సంయుక్తంగా సోదాలు చేపట్టాయని పేర్కొన్నారు. సాహిల్ అహ్మద్ లస్కర్ అనే వ్యక్తి డ్రగ్స్‌ను తరలిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. దీని వెనుక అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. వీటిని ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## పరీక్షల వాయిదా కోసం స్కూళ్లకు విద్యార్థుల బాంబు బెదిరింపులు



**దిల్లీ:** దేశ రాజధాని దిల్లీలో వరుస బాంబు బెదిరింపులు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. ఈ బెదిరింపులకు సంబంధించి పోలీసులు విస్తృత దర్యాప్తు చేపట్టారు. ఇటీవల వచ్చిన రెండు బాంబు బెదిరింపులు విద్యార్థులు చేసినట్లుగా గుర్తించారు. పరీక్షల వాయిదా కోసమే తాము ఈ పని చేసినట్లు విద్యార్థులు విచారణలో తెలపడం గమనార్హం.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల రోహిణిలోని రెండు పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అదే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు వేర్వేరుగా బెదిరింపు ఈమెయిల్‌లు పంపించారు. విద్యార్థులిద్దరూ పరీక్షకు సిద్ధం కానందున దాన్ని వాయిదా వేయించేందుకే ఈ పని చేశామని విచారణలో తెలిపారు. మరో పాఠశాలకు వచ్చిన బెదిరింపు సైతం ఇలాంటిదే. స్కూల్‌కు వెళ్లడం ఇష్టం లేక ఓ విద్యార్థి ఇలా చేసినట్లు తెలుస్తోంది. అధికారులు విద్యార్థులతో సహా వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. కాగా.. ఈ ఏడాది ఆరంభం నుంచి దిల్లీ, ఇతర ప్రాంతాల్లోని పాఠశాలలకు పలుమార్లు బాంబు బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే. డిసెంబరు 9న 40కి పైగా స్కూళ్లకు ఈ తరహా బెదిరింపులు వచ్చాయి. పాఠశాల ఆవరణల్లో పేలుడు పదార్థాలను అమర్చామని, వాటిని పేల్చకుండా ఉండాలంటే 30వేల డాలర్లు ఇవ్వాలని ఆగంతకులు బెదిరించారు. అయితే, అది నకిలీదని ఆ తర్వాత ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

## ఎన్డీయేలో చేరే ప్రసక్తే లేదు..

**శ్రీనగర్:** ఇటీవలి జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన నేషనల్ కాన్ఫరెన్స్ .. 'ఇండియా' కూటమిలోని మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఎన్‌సీ పార్టీ భాజపా నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో చేరనుందని ఓ మీడియాలో కథనం వెలువడింది. దీన్ని నిరాధారమైనదిగా పార్టీ కొట్టిపారేసింది. ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో చేసిన ఈ వాదనలు పచ్చి అబద్ధమని స్పష్టం చేసింది.జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణకు ప్రతిగా ఎన్డీయేలోకి నేషనల్ కాన్ఫరెన్స్ వెళ్లేందుకు సన్నద్ధమవుతోందని వచ్చిన కథనంపై పార్టీ ప్రధాన ప్రతినిధి తన్వీర్ సాదిక్ స్పందించారు. ''ఇటువంటి నిరాధార వదంతులను వ్యాప్తి చేయడం బాధ్యతారాహిత్యం. సీఎం ఒమర్ అబ్దుల్లా కలిసినట్లు చెబుతున్న భాజపా అగ్రనాయకత్వం పేర్లను బహిర్గతం చేయాలి. లేకపోతే.. బహిరంగ క్షమాపణ చెప్పి, ఆ కల్పిత కథనాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవు'' అని 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు.ఇటీవల దిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా భేటీ అయ్యారు. జమ్మూకశ్మీర్‌కు వీలైనంత త్వరగా రాష్ట్రహోదా పునరుద్ధరణతోపాటు స్థానికంగా ఉగ్రవాదం కట్టడిలో రాష్ట్ర ప్రభుత్వాన్ని భాగస్వామ్యం చేయడం వంటి అంశాలపై చర్చించారు. అయితే, ఈ సమావేశం గురించి మీడియా సహా అందరికీ తెలిసిందేనని సాదిక్ అన్నారు. ఈ భేటీపై ఇతరత్రా వాదనలు చేస్తే మాత్రం.. వాటిని రుజువు చేయాల్సి ఉంటుందని సవాల్ విసిరారు.



## కుటుంబంతో కలిసి సజీవ దహనానికి రైతు యత్నం..

### రూ.9.91 లక్షల జరిమానా విధించిన పోలీసులు




**జైపూర్:** భూమికి పరిహారం కోసం కుటుంబంతో కలిసి సజీవ దహనానికి ఒక రైతు ప్రయత్నించాడు. రోడ్డుపై చితి పేర్చి నిరసన తెలిపాడు. దీంతో పోలీసులు భారీగా తరలివచ్చి అడ్డుకున్నారు. అయితే తాజాగా ఆ రైతుకు పోలీసులు షాక్ ఇచ్చారు. రూ.9.91 లక్షల జరిమానా విధించారు. రైతు కుటుంబం సజీవ దహనాన్ని అడ్డుకునేందుకు అయిన ఖర్చుల మొత్తాన్ని వారంలో చెల్లించాలంటూ నోటీస్ పంపారు. రాజస్థాన్‌లోని ఝుంఝును జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

డిసెంబర్ 10న రైతు విద్యాధర్ యాదవ్ తన కుటుంబంతో కలిసి నిరసన తెలిపాడు. సిమెంట్ కంపెనీకి ఇచ్చిన భూమికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాడు. పరిహారం అందని పక్షంలో తన కుటుంబంతో కలిసి సజీవ దహనానికి అనుమతించాలని కోరాడు. రోడ్డుపై కట్టెలతో చితిని ఏర్పాటు చేసి నిరసన తెలిపాడు. దీంతో దిగి వచ్చిన ఆ సిమెంట్ కంపెనీ ఆ రైతుకు రూ.3 కోట్లు నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించింది.

కాగా, పోలీసులు తాజాగా రైతు విద్యాధర్ యాదవ్‌కు షాక్ ఇచ్చారు. కుటుంబంతో కలిసి సజీవ దహనానికి పాల్పడతానని బెదిరించినందుకు రూ.9.91 లక్షల జరిమానా విధించారు. ఎస్పీ శరద్ చౌదరి ఆ రైతుకు ఈ మేరకు నోటీసు జారీ చేశారు. రైతు కుటుంబం స్వీయ దహనానికి పాల్పడకుండా నిరోధించడానికి పోలీస్ శాఖకు భారీగా ఖర్చు అయ్యిందని అందులో పేర్కొన్నారు.మరోవైపు అధికార వాహనాల వినియోగంతో పాటు ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలతోపాటు 99 మంది పోలీసు సిబ్బందిని మోహరించినట్లు ఆ నోట్‌లో పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర ఖజానాపై అదనపు ఆర్థిక భారం పడిందని వివరించారు. డిసెంబర్ 24లోగా ఎస్పీ కార్యాలయంలోని ఖాతాల శాఖలో రూ.9,91,577 జమ చేయాలని ఆ రైతుకు పంపిన నోటీస్‌లో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అందులో హెచ్చరించారు.

## రాష్ట్రపతి, సీజేఐలుగా ఆ ఇద్దరు లాయర్లు..

### ఆసక్తికర విషయం చెప్పిన జస్టిస్ నాగరత్న



**దిల్లీ:** సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న తన కుటుంబం గురించి ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. ఆమె తండ్రి, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈఎస్ వెంకటరామయ్య జయంతి శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బెంగుళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్శిటీ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె అక్కడి విద్యార్థులకు ఓ ఆసక్తికరమైన విషయం చెప్పారు.

1946 డిసెంబర్‌లో నాగ్‌పూర్‌లో అఖిల భారత న్యాయవాదుల సమావేశం జరిగిందని..అక్కడకు వెళ్లడానికి బెంగుళూరు, నాగ్‌పూర్ మధ్య నేరుగా రైలు లేకపోవడంతో చెన్నైకి వెళ్ళి అక్కడ నుంచి గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లాల్సి ఉండేదన్నారు. ఆ రైలు కంపార్ట్‌మెంట్‌లో కొందరు న్యాయవాదులు కలిసి సరదాగా గడుపుతూ, మంచి స్నేహితులుగా మారారని అన్నారు. అయితే ఈ రైల్లో మిత్రులుగా మారిన ఇద్దరు వ్యక్తులు దాదాపు నలభై మూడు ఏళ్ల తర్వాత, 1989లో కలుసుకున్నారని పేర్కొన్నారు. వారిలో ఒకరు దేశంలోనే అత్యున్నత పదవిని అధిరోహించిన రాష్ట్రపతి ఆర్ వెంకటరామన్ అయితే మరొకరు దేశ అత్యున్నత న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయబోయే తన తండ్రి జస్టిస్ ఈఎస్ వెంకటరామయ్య అని ఆమె తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం వారిరువురు నలభై మూడేళ్ల క్రితం తాము రైల్లో కలుసుకున్న విషయాన్ని గుర్తు చేసుకొని ఎంతో ఆనందపడ్డారని ఆమె తెలియజేశారు. తాను ఈ స్థాయికి రావడానికి తన తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహం, మద్దతే కారణమన్నారు. జస్టిస్ ఈఎస్ వెంకటరామయ్య తనకు తండ్రి మాత్రమే కాదని.. గురుతుల్యులని అన్నారు. ఆయనకు ఒక మంచి విద్యార్థిగా ఉండడానికే తాను ప్రయత్నించానని..ఎప్పటికీ ఆయనకు విద్యార్థిగా మిగిలిపోతానని తెలిపారు. ''న్యాయమూర్తిగా పదవి చేపట్టినప్పటి నుంచి మనం విచారణలో ఉంటాము. పదవీకాలం ముగిసిన తర్వాత గౌరవప్రదంగా ఉండటం ముఖ్యం'' అని తన తండ్రి ఎప్పుడూ చెబుతుండేవారని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సాహిత్యంపై ఆయన ఎంతో మక్కువ చూపేవారని అన్నారు. తన తండ్రి పని ఒత్తిడిని దృష్టిలో పెట్టుకొని తల్లి పద్మ ఇంటి బాధ్యతలను ఒంటి చేత్తో నడిపేవారని గుర్తుచేసుకున్నారు.

## వసుంధర రాజే కాన్వాయ్‌లో వాహనం బోల్తా



**జైపూర్:** బీజేపీ నాయకురాలు, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే కాన్వాయ్‌లోని పోలీస్ వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు గాయాలయ్యాయి. పాలి జిల్లాలోని రోహత్ పానిహరి క్రాస్‌రోడ్స్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనదారుడిని తప్పించే క్రమంలో పోలీస్ వాహనం డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు బోల్తా పడింది. క్యాబినెట్ మంత్రి ఓటారాం దేవసి తల్లి మృతికి నివాళులర్పించేందుకు వసుంధర రాజే వెళ్తున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. కారులో ఏడుగురు పోలీస్ సిబ్బంది ఉండగా.. వారిలో కొందరికి గాయాలైనట్లు పాలి ఎస్పీ వెల్లడించారు. వాహనం బోల్తా పడడంతో రాజే వెంటనే తన వాహనాన్ని ఆపి.. క్షతగాత్రులైన పోలీసు సిబ్బందిని ఆస్పత్రికి తరలించారు.

### సీటీ రవి వ్యాఖ్యలపై

## ఆడియో, వీడియో ఆధారాలున్నాయ్: సీఎం సిద్ధరామయ్య



**కలబుర్గి:** కర్ణాటక మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్‌పై బీజేపీ ఎమ్మెల్సీ సి.టి.రవి అభ్యంతరకర వ్యాఖ్యలు, అరెస్టు వ్యవహారం అక్కడి రాజకీయాల్లో దుమారం రేపాయి. ఈ అంశంపై తాజాగా సీఎం సిద్ధరామయ్య స్పందించారు. సి.టి.రవి మహిళా మంత్రిపై వాడిన అభ్యంతరకర భాషకు సంబంధించి ఆడియో, వీడియో ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. ఆయన అలా మాట్లాడటం కొందరు ఎమ్మెల్సీలూ విన్నారని తెలిపారు. ఇది క్రిమినల్ నేరం అయినందున పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సీఎం చెప్పారు. మరి దీనిపై ఎమ్మెల్సీ రవి జ్యుడీషియల్ విచారణ ఎందుకు అడుగుతున్నారో ఆశ్చర్యంగా ఉందన్నారు. భాజపా సీనియర్ నేతగా ఉన్న రవి చర్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

బెళగావిలో జరిగిన కర్ణాటక అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో భాగంగా డిసెంబర్ 19న అధికార, విపక్ష సభ్యుల మధ్య నెలకొన్న వాగ్వాదం వ్యక్తిగత దూషణలకు దారితీసింది. ఈ క్రమంలో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌సీటీ రవి మధ్య మొదలైన మాటల యుద్ధం చివరకు పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాల వరకు వెళ్లింది. తనపట్ల భాజపా ఎమ్మెల్సీ వ్యక్తిగత దూషణలు చేశారంటూ మంత్రి ఫిర్యాదు చేయడంతో ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు. తొలుత ఖానాపుర్ పోలీస్‌స్టేషన్‌కు, ఆ తర్వాత రామ్‌దుర్గా స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో తన తలకు గాయమైందని ఆయన ఎక్స్‌లో తెలిపారు. తనకు ఏదైనా జరిగితే పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. పోలీసులు తనపై ఏదో కుట్ర పన్నారని, గాయమైన వ్యక్తికి ప్రథమచికిత్స అందించేందుకు కర్ణాటక పోలీసులు మూడు గంటల సమయం తీసుకున్నారని ఆయన పేర్కొన్న విషయ తెలిసిందే. ఈ క్రమంలో ఆయనకు బెయిల్ రావడంతో విడుదలయ్యారు.



### సనాతన ఎంట్రప్రెన్యూర్స్ అసోసియేషన్

## 2025 డైరీ ఆవిష్కరణ

**విశ్వంభర, హైదరాబాద్ :** సనాతన ఎంట్రప్రెన్యూర్స్ అసోసియేషన్ (ఎస్‌ఈఏ) యొక్క 7వ వార్షిక వ్యవస్థాపకత, యువజన సదస్సుకు ముఖ్య అతిథులుగా తెలంగాణ గవర్నమెంట్ సలహా దారులు హర్కర వేణు గోపాల్ రావు, మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచంద్ర రావు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి హాజరై 2025 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈఏ చైర్మన్ నరేంద్ర కుమార్ కామరాజు మాట్లాడుతూ.. 2018లో స్థాపించబడిన బ్రాహ్మణ అసోసియేషన్ వ్యాపార నిపుణులు, వ్యాపారవేత్తలను ఒకచోట చేర్చేందుకు ఏకీకృత వేదికను రూపొందించే దృక్పథంతో పుట్టిందన్నారు. తమ ప్రాథమిక లక్ష్యం సహకారాన్ని ప్రోత్సహించడానికి, వృద్ధికి అవకాశాలను అందించడానికి, తమలోని బంధాలను బలోపేతం చేయడానికి అని తెలిపారు. అనంతరం ఎస్‌ఈఏ వ్యవస్థాపకుడు అమృత ముళ్ళపూడి మాట్లాడారు. సనాతన వ్యవస్థాపకుల బ్రాహ్మణ సంఘం కేవలం ఒక సంస్థ కాదు ఇది వ్యాపారవేత్తలు, నిపుణులను వారి అత్యున్నత సామర్థ్యాన్ని సాధించడానికి శక్తివంతం చేయడానికి ఉద్దేశించిన ఉద్యమం అన్నారు. ఈ సంవత్సరం కన్వెన్షన్ థీమ్, "365 రోజుల కాబోయే వ్యాపార ప్రయాణం", సంప్రదాయ జ్ఞానాన్ని ఉపయోగించడం పై దృష్టి పెడుతుందన్నారు. వ్యాపారంలో ఆధునిక సవాళ్లను నావిగేట్ చేయండి, మా వారసత్వం పారిశ్రామికవేత్తలు, నిపుణులకు స్ఫూర్తినిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌ఈఏ జాతీయ అధ్యక్షుడు నరేంద్ర కుమార్ కామరాజ్, బోర్డ్ ఆఫ్ ట్రస్టీ ఎస్‌ఈఏ దంటు అనంతరాయ శర్మ, ప్రదీప్ కుమార్, ఎస్‌ఈఏ జాతీయ అధ్యక్షుడు సత్యం శ్రీరంగం, ఎస్‌ఈఏ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్‌సీ మూర్తి, ఉపాధ్యక్షులు జీ రవి కుమార్, కోశాధికారి ఆదిరాజు మురళీధర్, వీ రామసుబ్రహ్మణ్యం, వెల్లాల అనురాధ, జాతీయ ప్రధాన కార్యదర్శి మహిళా విభాగం ఉమా పెరి, మహిళా విభాగం ఉపాధ్యక్షులు శిరీషా పుల్లె, ప్రధాన కార్యదర్శి టీఎస్ మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల సంఘం సమగ్రతను నాశనం చేసేందుకు కుట్ర: ఖర్గే



**దిల్లీ:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం మార్పులు చేయడాన్ని తప్పుబట్టారు. ఈసీ సమగ్రతను నాశనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పన్నిన కుట్రలో ఇదొక భాగమని ఆరోపించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై మోదీ ప్రభుత్వం చేస్తున్న దాడికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

''ఎన్నికల కమిషన్‌ను నిర్వీర్యం చేయడానికి మోదీ ఇంతకు ముందు ఎన్నికల కమిషనర్లను నియమించే సెలక్షన్ ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించారు. ఇప్పుడు వారు చేసే కుట్రలు బయటకు రాకుండా ఉండేందుకు మార్పులు చేస్తున్నారు. ఓటర్ల పేర్లు తొలగింపు, ఈవీఎంలలో పారదర్శకత లేకపోవడం వంటి అక్రమాల గురించి మేము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఈసీ స్పందించలేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలు బయటకు రాకుండా చేసేందుకు పోలింగ్‌కు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్‌ను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. ఇవన్నీ చూస్తుంటే ఈసీ తన స్వతంత్రతను కోల్పోతోందని స్పష్టమవుతోంది'' అని ఖర్గే పేర్కొన్నారు. లోక్‌సభ ఎంపీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ప్రభుత్వానికి అనుకూలంగా చర్యలు చేపడుతోందని ఆరోపించారు. ఈ సవరణను న్యాయపరంగా సవాలు చేస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఇప్పటికే స్పష్టం చేశారు. కోర్టు తీర్పును పాటించాల్సిన ఈసీ.. అందుకు విరుద్ధంగా నిబంధనలకు సవరణ చేయడం విడ్డూరమని అన్నారు.

కాగా ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు.. ఎన్నికల నిర్వహణ నిబంధనలు 1961లోని రూల్ 93(2)(ఏ)ను శుక్రవారం కేంద్ర న్యాయశాఖ సవరించింది. పోలింగ్ బూత్‌లలోని సీసీ టీవీ కెమెరాల తనిఖీ వల్ల ఓటర్ల గోప్యతకు భంగం కలుగుతోందని, అందుకే నిషేధం విధించామని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ ఫుటేజ్‌ను వినియోగించుకుని కృత్రిమ మేధ ద్వారా నకిలీ వీడియోలను తయారు చేస్తున్నారని తెలిపాయి. రూల్ 93కి సవరణ తర్వాతా అభ్యర్థులకు ఎలక్ట్రానిక్ రికార్డులు అందుబాటులో ఉంటాయని, కానీ ఇతరులు తనిఖీ చేయడానికి అనుమతి ఉండదని వివరించాయి.



## టీమ్ఇండియాకు షాక్.. రోహిత్ శర్మ మోకాలికి గాయం

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియాతో బాక్సింగ్ డే టెస్టుకు ముందు భారత్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ) సిరీస్‌లో సూపర్‌ఫామ్‌మీదున్న ఓపెనర్ కేఎల్ రాహుల్ ఇంజ్యూరీ అవగా.. తాజాగా కెప్టెన్ రోహిత్ శర్మ కూడా గాయపడ్డాడు. మెల్‌మోర్న్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా హిట్‌మ్యాన్‌కి గాయమైంది. త్రోడౌన్ స్పెషలిస్ట్ దయాను ఎదుర్కొనే క్రమంలో రోహిత్ ఎడమ మోకాలికి బాల్ బలంగా తగిలింది. దీంతో అతడు నొప్పితో విలవిలలాడినట్లు పలు రిపోర్టులు పేర్కొన్నాయి. వెంటనే అతనికి ఫిజియో ఐస్ ప్యాక్‌ను తెచ్చి మోకాలి మర్దన చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. అయితే రోహిత్ గాయంపై బీసీసీఐ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు.కాగా, శనివారం నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో కేఎల్ రాహుల్ కుడిచేతికి బంతి బలంగా తాకిన విషయం తెలిసిందే. దీంతో వెంటనే ఫిజియో ప్రాథమిక చికిత్స అధించాడు. అయితే రాహుల్ గాయం అంత తీవ్రమైనది కానట్లు తెలుస్తున్నది. ఇక రోహిత్ బాక్సింగ్ డే టెస్ట్‌కు దూరమైతే సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్‌లో ఎవరినో ఒకరిని తుది జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. ఈ నెల 26 నుంచి బాక్సింగ్ డే టెస్టు ప్రారంభం కానుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరుజట్లు 11తో సమానంగా ఉన్నాయి. మూడో టెస్టు డ్రాగా ముగిసింది.

### 'ఫాలో ఆన్' ఆలోచనే లేదు..

### నాటౌట్‌గా ఉండాలనే ఆడా: ఆకాశ్ దీప్



**ముంబయి:** 'పోరాడితే ఆ దేవుడు కూడా సాయపడతాడు' ఇది నిజమని ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత జట్టు విషయంలో తేలింది. 'ఫాలో ఆన్' గండం నుంచి కష్టపడి బయటపడిన టీమ్ఇండియాకు వరుణుడు అండగా నిలిచాడు. గబ్బా టెస్టులో చివరి రోజు వేగంగా ఆడి భారత్‌ను ఇరుకున పెడదామని భావించిన ఆసీస్‌కు నిరాశే మిగిలింది. వర్షం రాకతో మ్యాచ్ చివరి రోజు రెండు సెషన్ల ఆటసాగలేదు. అయితే, అంతకుముందు భారత్‌ను ఫాలో ఆన్ నుంచి టెయిలెండర్లు ఆకాశ్ దీప్, బుమ్రా గట్టెక్కించారు. మరీ ముఖ్యంగా ఆకాశ్ దీప్ సిక్స్, ఫోర్లతో దూకుడుగా ఆడాడు. బుమ్రాతో కలిసి చివరి వికెట్‌కు 47 పరుగులు జోడించాడు. ఇందులో 31 పరుగులు ఆకాశ్ దీప్‌వే. మెల్‌బోర్న్ వేదికగా గురువారం నుంచి నాలుగో టెస్టు ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఆకాశ్ దీప్ గబ్బా పోరాటం గురించి ఆసక్తికర విశేషాలను వెల్లడించాడు.

''మేం లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగాం. కనీసం 30 పరుగుల భాగస్వామ్యం అందించాలని భావించాం. నా మైండ్‌సెట్ కూడా అలానే ఉంది. అప్పుడు ఫాలో ఆన్ గురించి ఆలోచించలేదు. నాటౌట్‌గా మాత్రమే ఉండాలని అనుకున్నా. దేవుడి దయతో ఫాలో ఆన్ గండం నుంచి బయటపడ్డాం. ఆ పరిస్థితుల నుంచి మ్యాచ్‌ను కాపాడుకోవడంతో జట్టులో జోష్ వచ్చింది. మా డ్రెస్సింగ్ రూమ్ కూడా సంతోషపడింది. ప్రతి ఒక్కరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆస్ట్రేలియాలో ఆడటం నాకు ఇదే మొదటిసారి. బుమ్రా భాయ్ ధైర్యం నింపాడు. 'మరీ ఎక్కువగా ఆలోచించొద్దు. ఆటపైనే దృష్టిపెట్టు. భారత్‌లో ఎలా ఆడతావో.. అలానే ఇక్కడా నీ కర్తవ్యం నిర్వర్తించు' అని బుమ్రా చెప్పాడు'' అని ఆకాశ్ వ్యాఖ్యానించాడు.

రోహిత్ బాగున్నాడు..

మెల్‌బోర్న్ టెస్టు కోసం భారత జట్టు తీవ్రంగా సాధన చేస్తోంది. ఈ క్రమంలో కెప్టెన్ రోహిత్ శర్మ గాయపడినట్లు వార్తలు వచ్చాయి. వాటిపై ఆకాశ్ దీప్ స్పందించాడు. ''క్రికెట్‌లో గాయాలు సాధారణమే. కానీ, రోహిత్ విషయంలో ఇదేమీ సమస్య కాదు. అంతా బాగుంది. తప్పకుండా అతడి ఆటను మెల్‌బోర్న్ టెస్టులో చూస్తాం. ఇందులో అభిమానులు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదు''అని వెల్లడించాడు.

# భారత్ విజయభేరి.. విండీస్ చిత్తు చిత్తు

## అండర్ 19 ఆసియా మహిళల టీ20 చాంపియన్‌గా భారత్

**వడోదర:** వెస్టిండీస్ తో మూడు టీ20ల సిరీస్‌ను 21 తేడాతో కైవసం చేసుకొని జోరుమీదున్న భారత్ మహిళల జట్టు దూసుకుపోతోంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా వడోదరలో జరిగిన తొలి మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. 211 పరుగుల తేడాతో విండీస్ జట్టును చిత్తు చిత్తుగా ఓడించింది. 315 పరుగుల లక్ష్యంతో బ్యాంటింగ్‌కు దిగిన ప్రత్యర్థి జట్టు కేవలం 26.2 ఓవర్లలో 103 పరుగులకే ఆలౌటైంది. ఫ్లెచర్ (24*) టాప్ స్కోరర్. ఓపెనర్లు మాథ్యూస్ (0), జోసెఫ్ (0) డకౌట్‌గా వెనుదిరిగారు. భారత్ బౌలర్లలో రేణుక ఠాకూర్ సింగ్ 5 వికెట్లు పడగొట్టి విండీస్ జట్టును దెబ్బతీసింది. ప్రియా మిశ్రా 2, సాధు ఒక వికెట్ తీశారు.

**విజృంభించిన స్మృతి మంధాన..**

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన టీమ్ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 314 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు స్మృతి మంధాన (90; 102 బంతుల్లో 13×4), ప్రతీకా రావెల్ (40; 69 బంతుల్లో 4×4) తొలి వికెట్‌కు 110 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. వరుస బౌండరీలతో విండీస్ జట్టును బెంబేలెత్తించారు. భీకరంగా మారిన ఈ జోడీని మాథ్యూస్ విడగొట్టింది. ఆమె బౌలింగ్‌లో ప్రతీకా కాట్ అండ్ బౌల్డ్‌గా వెనుదిరిగింది.

తొలి డౌన్‌లో వచ్చిన హర్లీన్ డియోల్ (44)తో కలిసి స్మృతి ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. అయితే, జట్టు స్కోరు 160 పరుగుల వద్ద జేమ్స్ బౌలింగ్ స్మృతి ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్‌కు చేరింది. అనంతరం హర్మన్ ప్రీత్ కౌర్ (34), రిచా ఘోష్ (26), రోడ్రిగ్స్ (31), దీప్తి శర్మ (14*) దూకుడుగా ఆడటంతో భారత్ భారీ స్కోరు చేసింది. విండీస్ బౌలర్లలో జేమ్స్ 5 వికెట్లు పడగొట్టగా కెప్టెన్ మాథ్యూస్ 2, డాటిన్ ఒక వికెట్ తీశారు.








### ఇప్పటికీ ఆ స్థానంలో

## రోహిత్ అత్యంత ప్రమాదకారి: రవిశాస్త్రి



**ముంబయి:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ దారుణ ప్రదర్శన చేస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో తొలి టెస్టుకు దూరమైన అతడు.. గత రెండు టెస్టుల్లో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఓపెనర్‌గా కేఎల్ రాహుల్ సక్సెస్ కావడంతో రోహిత్ మిడిలార్డర్‌కు పరిమితమయ్యాడు. కానీ, పరుగులు పెద్దగా చేయలేకపోతున్నాడు. దీంతో అతడు మళ్లీ ఓపెనర్‌గా రావాలని పలువురు మాజీలు సూచించారు. కానీ, భారత మాజీ క్రికెటర్ రవిశాస్త్రి మాత్రం ఆరో స్థానంలో రోహిత్ ఆడాలంటున్నాడు. ఐసీసీ రివ్యూస్‌లో భాగంగా రవిశాస్త్రి పలు విషయాలపై విశ్లేషించాడు. గబ్బా టెస్టులో ఫాలో ఆన్ గండం నుంచి గట్టెక్కిన తర్వాత భారత ఆటగాళ్లు సంబరాలు చేసుకోవడంపై రవిశాస్త్రి మద్దతుగా నిలిచాడు.

''రోహిత్ ఓపెనర్‌గా రావాలని అనుకుంటే దానికేం ఇబ్బంది లేదు. గత మ్యాచ్‌లోనే ఇన్నింగ్స్‌ను ప్రారంభించాలని నేను అడిగా. అయితే, రాహుల్ ఆడిన తీరుతో నా అభిప్రాయం కాస్త మారింది. ఆ ప్లేస్‌లో కేఎల్ ఆటను ఆస్వాదిస్తున్నాడు. అతడి టెక్నిక్ కూడా ఎలాంటి తప్పిదం లేకుండా ఉంది. ఎలాంటి బంతిని వదిలేయాలి. ఏ బంతిని ఆడాలనే విషయంపై పూర్తి అవగాహనతో ఉన్నాడు. ప్రస్తుత క్రికెట్ ప్రపంచంలో కవర్‌డ్రైవ్స్‌ను ఆత్మవిశ్వాసంతో బాదేస్తున్నాడు. కాన్ఫిడెన్స్ స్థాయి అమోఘం. ఇక రోహిత్ శర్మ ఓపెనర్‌గా రావాలని అనుకోవడంలో తప్పేంలేదు. కానీ, హిట్‌మ్యాన్ వ్యూహాలను కాస్త మార్చుకుంటే మాత్రం ఆరో స్థానంలో అత్యంత డేంజరస్ బ్యాటర్ అవుతాడు. గతంలోనూ రోహిత్‌కు అక్కడి ఆడిన అనుభవం ఉంది.

మిడిలార్డర్‌లో రోహిత్ బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు మైండ్‌సెట్ కూడా మారాలి. అప్పుడు రెడ్‌బాల్ క్రికెట్ ఆడటం లేదని భావించాలి. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మాదిరిగా ఎటాకింగ్ చేయాలి. ఏం జరిగినా ఆందోళన పడనక్కర్లేదు. నా దృష్టిలో అదే సరైన ప్రణాళిక. ఫామ్‌ను అందిపుచ్చుకోవడానికి మార్గమిదే. తొలి 15 నిమిషాలు క్రీజ్‌లో కుదురుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. కానీ, రోహిత్ మాత్రం తొలి బంతి నుంచే దూకుడు ప్రదర్శించాలి. ప్రపంచంలోనే ఆరో స్థానంలో వచ్చే అత్యుత్తమ బ్యాటర్లు ఎక్కువగా ఎటాకింగ్ గేమ్ ఆడతారు. అప్పటికే ఐదారు వికెట్లు పడినప్పుడు పరిస్థితులకు తగ్గట్టుగా నెమ్మదించాలని అనుకుంటారు. రోహిత్ మాత్రం దూకుడుగా ఆడితే పరిస్థితి మారే అవకాశం ఉంటుంది'' అని రవిశాస్త్రి వెల్లడించాడు.



## రెజ్లింగ్ లెజెండ్ రే మిస్టీరియో సీనియర్ కన్నుమూత

**ముంబయి:** ప్రపంచ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లర్ అయిన రే మిస్టీరియో సీనియర్ మరణించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న 66 ఏళ్ల రే మిస్టీరియో పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. దాంతో ఆయన అభిమానుల్లో తీవ్ర విషాదం నెలకొంది.రే మిస్టీరియో దాదాపు 30 ఏళ్లపాటు రెజ్లింగ్‌లో రాణించారు. 1976లో వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో అడుగు పెట్టిన రే మిస్టీరియో.. 2009లో రెజ్లింగ్‌కు అధికారికంగా రిటైర్‌మెంట్ ప్రకటించాడు. సుదీర్ఘకాలం తన ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించాడు. ఆయన మరణంపట్ల చాలామంది సంతాపం తెలుపుతున్నారు. కాగా రే మిస్టీరియో ఐడబ్ల్యూసీ వరల్డ్ మిడ్ వెయిట్ ఛాంపియన్షిప్‌ను రెండుసార్లు గెలిచాడు.ఇటీవల ఈ స్టార్ రెజ్లర్ రే మిస్టీరియో తండ్రి రాబర్ట్ కూడా మరణించాడు. ఆయన మరణం నుంచి ఆ కుటుంబం ఇంకా తేరుకోకముందే ఆ ఇంట్లో మరో విషాదం చోటుచేసుకుంది. రే మిస్టీరియో బాగా బరువు తగ్గడంతో ఆస్పత్రి పాలయ్యారట. ఈ తరుణంలోనే ఆయన చికిత్స పొందుతూ మరణించారు. రే మిస్టీరియో అసలు పేరు మిగ్యూల్ ఏంజెల్ లోపేజ్ డియాస్. రే మిస్టీరియో కొడుకు ప్రస్తుతం రెజ్లింగ్‌లోనే ఉన్నాడు.తండ్రి వారసత్వంలో జూనియర్ రే మిస్టీరియో కూడా రెజ్లింగ్‌లో దుమ్ము లేపుతున్నాడు. సీనియర్ రే మిస్టీరియో సోమవారం జరగనున్నట్లు సమాచారం.

# యూఎస్ ఫెడ్ రిజర్వ్.. టాప్-10 సంస్థల ఎం-క్యాప్ రూ.4.95 లక్షల కోట్లు ఆవిరి..

### టీసీఎస్.. రిలయన్స్‌లకు భారీ లాస్..!




**ముంబయి:** గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ టాప్10 సంస్థలు తమ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4,95,061 కోట్లు కోల్పోయాయి. ఈక్విటీ మార్కెట్లలో బేరిష్ ట్రెండ్ దీనికి కారణం. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, రిలయన్స్ భారీగా నష్టపోయాయి. గతవారం బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 4,091.53 పాయింట్లు (4.98 శాతం) పతనమైంది. 2022 జూన్ తర్వాత ఎన్ఎస్ఈ నిఫ్టీ 4.77 వాతం నష్టంతోపాటు భారత్ ఈక్విటీ మార్కెట్ భారీగా పతనం కావడం ఇదే ప్రథమం. వడ్డీరేట్ల తగ్గింపుపై యూఎస్ ఫెడ్ రిజర్వ్ ప్రకటన వల్ల ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీన పడింది. నాలుగు సార్లు వడ్డీరేట్లు తగ్గిస్తారన్న అంచనాలకు బదులు 2025లో రెండు సార్లు మాత్రమే వడ్డీరేట్లు తగ్గిస్తాం అని యూఎస్ ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ తెలిపారు.టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,10,550.66 కోట్లు నష్టపోయి రూ.15,08,036.97 కోట్లకు చేరుకున్నది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎంక్యాప్ రూ.91,140.53 కోట్ల పతనంతో రూ.16,32,004.17 కోట్ల వద్ద స్థిర పడింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఎంక్యాప్ రూ.76,448.71 కోట్లు కోల్పోయి రూ.13,54,709.35 కోట్ల వద్ద నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్ ఎంక్యాప్ రూ.59,055.42 కోట్లు నష్టంతో రూ.8,98,786.98 కోట్ల వద్ద ముగిసింది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) ఎంక్యాప్ రూ.43,909.13 కోట్లు నష్టంతో రూ.7,25,125.38 కోట్లకు చేరుకున్నది.ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.41,857.33 కోట్ల పతనంతో రూ.9,07,449.04 కోట్ల వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్ ఎంక్యాప్ రూ.32,300.2 కోట్ల పతనంతో రూ.7,98,086.90 కోట్ల వద్ద నిలిచింది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఎంక్యాప్ రూ.20,050.25 కోట్ల నష్టంతో రూ.5,69,819.04 కోట్ల వద్ద స్థిర పడింది. హిందూస్థాన్ యూనీ లివర్ ఎంక్యాప్ రూ.12,805.27 కోట్లు పతనమై రూ.5,48,617.81 కోట్లకు చేరుకుంది. ఐటీసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,943.5 కోట్లు పతనమై రూ.5,81,252.32 కోట్ల వద్ద ముగిసింది.గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ10 సంస్థల్లో టాప్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ కొనసాగుతున్నది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకు, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, భారతీయ స్టేట్ బ్యాంక్, ఐటీసీ, ఎల్ఐసీ, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) నిలిచాయి.

## అందులో నాకెలాంటి ఎగ్జిక్యూటివ్ పాత్ర లేదు

### -పీఎఫ్ ఫ్రాడ్ కేసుపై రాబిన్ ఉతప్ప



**ముంబయి:** ఉద్యోగుల పీఎఫ్ చెల్లింపుల కేసులో భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్పపై అరెస్ట్ వారెంట్ జారీ అయిన సంగతి తెలిసిందే. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తనపై వస్తున్న ఆరోపణలకు వివరణ ఇస్తూ ఉతప్ప ఓ ప్రకటన విడుదల చేశాడు. ఈ కంపెనీలో తానెలాంటి ఎగ్జిక్యూటివ్ రోల్ పోషించడంలేదని.. తనకు రావాల్సిన వాటిని చెల్లించడంలోనూ సంస్థ విఫలమైందని ఉతప్ప వెల్లడించాడు.

''నాపై పీఎఫ్ మోసం కేసు నమోదు కావడంపై వార్తలు వచ్చాయి. వాటికి వివరణ ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ ప్రకటన చేస్తున్నా. సెంటారస్ లైఫ్‌స్టైల్ బ్రాండ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో నేను 2018 19లో డైరక్టర్‌గా నియమితుడినయ్యా. నేను కూడా పెట్టుబడి పెట్టడంతో నాకా పదవి ఇచ్చారు. లోన్ల రూపంలో ఫండ్స్ ఇచ్చాను. నేనెప్పుడూ యాక్టివ్ ఎగ్జిక్యూటివ్ రోల్‌ను పోషించలేదు. రోజువారీ కార్యక్రమాల్లోనూ పాల్గొనలేదు. ప్రొఫెషనల్ క్రికెటర్‌గా, టీవీ ప్రెజెంటర్‌గా, కామెంటేటర్‌గా బిజీగా ఉంటా. కాబట్టి కంపెనీ కార్యక్రమాల్లో ఎప్పుడూ పాల్గొనలేదు. నేను కొన్ని ఇతర సంస్థల్లో పెట్టుబడులు పెట్టా. అక్కడా ఎప్పుడూ ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వర్తించలేదు. నేను ఇచ్చిన ఫండ్స్‌ను కూడా తిరిగి చెల్లించడంలో ఈ సంస్థ విఫలమైంది. న్యాయపరమైన చర్యలు తీసుకొనేందుకు సిద్ధమయ్యా. కొన్నేళ్ల కిందటే నేను డైరక్టర్ పదవికి రాజీనామా కూడా చేశా. ఇప్పుడు పీఎఫ్ అధికారులు పేమెంట్ చేయాలని నాకు నోటీసులు జారీ చేశారు. నా లీగల్ టీమ్ స్పందించింది. పీఎఫ్ నిధుల దుర్వినియోగంలో నా ఇన్‌వాల్వ్‌మెంట్ లేదు. త్వరలో ఈ సమస్యను అధిగమిస్తా. ఆలోగా నిజాలను తెలుసుకొని మాత్రమే సమాచారం ఇవ్వాలని మీడియాకు విజ్ఞప్తి చేస్తున్నా'' అని ఉతప్ప తెలిపాడు.

ఇదీ జరిగింది..

బెంగళూరుకు చెందిన సెంటారస్ లైఫ్‌స్టైల్ బ్రాండ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీకి రాబిన్ ఉతప్ప డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ కంపెనీలో పనిచేసే ఉద్యోగుల నుంచి పీఎఫ్‌ను కట్ చేసినప్పటికీ వాటిని ఉద్యోగుల పీఎఫ్ ఖాతాల్లో జమ చేయలేదు. మొత్తంగా దాదాపు రూ.23 లక్షలను ఉతప్ప తన ఉద్యోగుల ఖాతాలో జమ చేయకుండా మోసం చేశారని తేలడంతో పీఎఫ్ రీజనల్ కమిషనర్ అతడికి నోటీసులు జారీ చేశారు.

## రూ.5వేల కోట్ల ఖర్చుతో.. జెఫ్‌బెజోస్ వివాహం!



**లండన్:** ప్రపంచ కుబేరుల్లో ఒకరు, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ప్రియురాలు లారెన్ శాంచెజ్ తో పెళ్లికి సిద్ధమయ్యారు. గతేడాది నిశ్చితార్థం చేసుకోగా.. వచ్చే వారం వివాహం చేసుకోనున్నారు. కొలరాడోలోని ఆస్పెన్‌లో సన్నిహితులు, కుటుంబసభ్యుల సమక్షంలో ఈ నెల 28న వీరి వివాహం జరగనున్నట్లు తెలుస్తోంది.బిల్‌గేట్స్, లియోనార్డో డికాప్రియో , జోర్డాన్ రాణి రానియా వంటి ప్రముఖులు హాజరుకానున్నట్లు సమాచారం. దాదాపు 180 మంది పాల్గొనే ఈ వేడుక కోసం ఓ విలాసవంతమైన రెస్టరంట్‌ను అద్దెకు తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అతిథుల వసతి కోసం లగ్జరీ హోటల్స్, ప్రైవేటు సౌధాలు ముందస్తు బుకింగ్ చేసినట్లు తెలుస్తోంది. మొత్తంగా వివాహ వేడుక కోసం దాదాపు 600 మిలియన్ డాలర్లు ఖర్చు చేయనున్నట్లు అంచనా.

జెఫ్ బెజోస్ , లారెన్‌లు 2018 నుంచే డేటింగ్‌లో ఉన్నారు. 2019 వరకు ఆ విషయం బయటకు రాలేదు. అదే ఏడాది బెజోస్ తన భార్య మెకంజీ స్కాట్‌తో ఉన్న 25 ఏళ్ల బంధానికి స్వస్తి పలుకుతూ విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. మెకంజీతో ఆయనకు నలుగురు సంతానం ఉన్నారు.గతేడాది మే నెలలో బెజోస్, లారెన్ నిశ్చితార్థం చేసుకున్నట్లు వార్తలొచ్చాయి. ఈ సందర్భంగా 2.5 మిలియన్ డాలర్ల వజ్రాల ఉంగరాన్ని శాంచెజ్‌కు బెజోస్ ఇచ్చినట్లు కథనాలు వెలువడ్డాయి. 54 ఏళ్ల లారెన్ గతంలో జర్నలిస్టుగా పని చేశారు. ప్రస్తుతం ఆమె దాతృత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

## అస్థిరంగా విదేశీ పెట్టుబడులు..

### ఆయిల్ అండ్ గ్యాస్‌లో అత్యధిక వాటాల విక్రయం..!

**ముంబయి:** వివిధ రంగాల్లో విదేశీ పెట్టుబడులకు కేంద్రం ద్వారాలు తెరుస్తోంది. దేశీయ స్టాక్ మార్కెట్లు మొదలు వివిధ సంస్థల్లో విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెడుతుంటారు. అయితే, 2024లో విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడులు మాత్రం అస్థిరంగా ఉన్నాయి. ప్రతి నెలా వివిధ సెక్టార్లలో వాటాలు కొనుగోలు చేస్తున్న విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ).. ఈ ఏడాది కాలంలో ఫైనాన్సియల్, ఆయిల్ అండ్ గ్యాస్ సంస్థల్లోనే రూ.లక్ష కోట్లకు పైగా వాటాలు విక్రయించారు. ప్రతి నెలా ఐదు సెషన్లలో వాటాలు విక్రయిస్తుంటే, ఏడు రెట్లు కొనుగోలు చేస్తున్నారు. ఈక్విటీ మార్కెట్లలో ఎఫ్ పీఐల పెట్టుబడులు ఈ నెలలో ఇప్పటి వరకూ రూ.6,770 కోట్లు మాత్రమే ఉన్నాయి. జనవరి, ఏప్రిల్, మే, అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎఫ్‌పీఐ పెట్టుబడులు భారీగా ఉపసంహరించారు. అక్టోబర్ నెలలో గరిష్టంగా రూ.94,017 కోట్లు, జనవరిమే మధ్య రూ.25 వేల కోట్లకు పైగా వాటాల్లో ఎఫ్‌పీఐ నిధులు ఉపసంహరించారు. మరోవైపు, సెప్టెంబర్‌లో అత్యధికంగా రూ.57,724 కోట్లు, మార్చిలో రూ.35,098 కోట్లు, జూలైలో రూ.32,365 కోట్ల విలువైన వాటాలు కొనుగోలు చేశారు.

ఫైనాన్సియల్ రంగంలో అత్యధికంగా రూ.53,942 కోట్ల విలువైన వాటాలు విక్రయించారు. జనవరిలో రూ.30,013 కోట్లు, అక్టోబర్ నెలలో రూ.26,139 కోట్ల వాటాలను విక్రయించారు. నాలుగు నెలల్లో ఫైనాన్సియల్ రంగంలో పెట్టుబడులు ఉపసంహరించారు. సెప్టెంబర్ నెలలో రూ.50,851 కోట్ల విలువైన వాటాలను ఎఫ్ఐఐలు విక్రయించారు. ఈ నెల 15 నాటికి ఎఫ్ఐఐలు రూ.50,851 కోట్ల విలువైన వాటాలు ఉపసంహరిస్తే, వాటిల్లో అక్టోబర్, నవంబర్ నెలల్లోనే అత్యధిక వాటాల విక్రయం ఉంటుంది. ఎఫ్ఎంసీజీలో రూ.19,057 కోట్లు, ఆటోమొబైల్ అండ్ ఆటో కంపోనెంట్స్ 14,148 కోట్లు, భవన నిర్మాణ రంగంలో రూ.20,163 కోట్లు, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో రూ.2,244 కోట్లు, మెటల్స్ అండ్ మైనింగ్, విద్యుత్ రంగాల నుంచి ఇన్వెస్టర్లు రూ.799 కోట్ల వాటాలు ఉపసంహరించారు. మరోవైపు, క్యాపిటల్ గూడ్స్‌లో రూ.29,011 కోట్లు, కన్జూమర్ సర్వీసెస్ లో రూ.20,228 కోట్లు, హెల్త్ కేర్ లో రూ.26,506 కోట్లు, ఐటీలో రూ.12,618 కోట్లు, రియాల్టీలో రూ.20,181 కోట్లు, టెలీ కమ్యూనికేషన్స్ లో రూ.23,992 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశారు.

# అమ్మ వద్దన్నా.. దేవుడే అడ్డొచ్చినా వెనకడుగు వేయొద్దు: పూరి జగన్నాథ్

అమ్మ వద్దన్నా, దేవుడే అడ్డొచ్చినా వెనకడుగు వేయొద్దంటూ స్ఫూర్తినింపేలా మాట్లాడారు దర్శకుడు పూరి జగన్నాథ్. 'పూరి మ్యూజింగ్స్' పేరిట ఆయన పాడ్‌కాస్ట్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 'ఎండ్‌లెస్ బ్యాటిల్' పేరిట తాజాగా వీడియో విడుదల చేశారు. అందులో ఆయన చెప్పిన పవర్‌ఫుల్ మాటలివీ..

''అనంత మహాసంద్రం.. అరుస్తున్న కెరటాలు.. అదుపుతప్పిన గాలులు.. అలలపై కలల మధ్య గుంపులుగా జనం. ఎలాగూ పోతాం.. తప్పించుకునే దారేలేదు. అందుకే పోయే ముందు బతుకుదాం. అనుభవిద్దాం, ఆస్వాదిద్దాం, అర్థం పరమార్థం తేల్చేద్దాం. ఇంకా నడి మధ్యనే ఉన్నాం. ఇంకెంత దూరమో ఈ ప్రయాణం. గత ప్రయాణం అదొక కథ. రేపటి ప్రయాణం మరొక కథ. పిట్ట కథలు మనకెందుకు? ఇప్పుడే ఇక్కడే బతికేద్దాం. మళ్లీ మబ్బులు.. చంపుకొని తినే చినుకులు. ఇది వానో పెను తుపానో! పడవలోకి నీరొస్తే.. పరదా చిరిగిపోతే.. జడిసేదే లే. వలలో ఒక్క చేపా చిక్కలే.. అయితేనేం? పస్తులుందాం.. ఫర్వాలేదు. ఇవాళ ఆకలితో కడుపు మాడితే.. రేపటి వేట తీరు వేరేలా ఉంటుంది. సొర చేపలు చిక్కకపోతాయా? ఏదీ నేర్వకుండా ఏ రోజూ ఉండకు. ఎండకుండా.. వేటాడకుండా నిద్రలోకి జారుకోకు. ఏంటో ఎగిరెగిరి పడుతోంది పడవ. చలిగాలి ఒక పక్క.. చల్లటి జల్లు మరో పక్క. తడిసిన ఒళ్లు.. పెదాలపై ఉప్పు నీళ్లు. ఒళ్లంతా వణుకు.. కళ్లల్లో బెణుకు. ఎముకల్లో నిస్సత్తువ. అయినా నా అన్న వారిని వదులుకోకు. సాయం చేసిన చేతిని మరవకు. పిడుగొచ్చి మీద పడినా కెరటం ఢీ కొట్టినా ఆ చేయిని వదలకు. పడినా విడవకు. తమ్ముడా.. ఇక్కడ అందరిది ఒకే పడవలో ప్రయాణం. అదిగో పొగరెక్కిన తరంగం. ఉప్పొంగిన హిమాలయం. ప్రతి కెరటం.. ముంచాలనే, ఆదమరిస్తే చంపాలనే. ఆపకు తమ్ముడూ తెడ్డు వేయడం మానకు. ఎదురెళ్లి ఎక్కేసి దూకేయ్. ఈ అనంత కడలిలో మనమెంత? పడవెంత? ఇసుకెంత? అయినా.. సంద్రాన్ని చీల్చుకుంటూ పోదాం. కొడవళ్లై కోసుకుంటూ పోదాం. సంద్రం లోతెంతో ఎవరికి కావాలి?ఆ నింగీ నేల కలిసేది ఎక్కడో చూడు. తీరం కానరావట్లేదని కలవర పడకు. ప్రతి సంద్రం ఏదో ఒక తీరాన్ని ఆనుకునే ఉంటుంది. తీరం రావాల్సిందే, భారం తీరాల్సిందే. వెర్రెక్కిన కెరటాలు సముద్రపు దొంగలు, పిశాచాలు. రా.. ఎదురెళదాం, కలపడదాం. అడ్డొస్తే తోసేద్దాం, ఆపితే వేసేద్దాం. తోసుకుంటూ తొక్కుకుంటూ పోదాం. ఇది కరుణలేని సాగరం. కారుణ్య రహిత రణరంగం. అమ్మ వద్దన్నా, దేవుడే అడ్డొచ్చినా పులులై దూకేద్దాం, సింహాలై గర్జిద్దాం. ఇది అనంత యుద్ధ సంగ్రామం. అందరితో యుద్ధం చేస్తే అలెగ్జాండర్. తనతో తానే తలపడితే గౌతమ బుద్ధ సిద్ధార్థ. తలలు నరుకుతావో తలే నరుక్కుంటావో! తమ్ముడా.. ఇక్కడ యుద్ధం అనివార్యం'' అంటూ ముగించారు.





## అయిష్టంగానే.. అబ్బాయిగా నటించా

ఎంతోమంది ఆర్టిస్టులు బాలనటులుగా బాలీవుడ్‌లో అడుగుపెట్టారు. సహజమైన నటనతో మెప్పించి.. సక్సెస్ కొట్టారు. అలా.. బాలనటుడిగా ఒక తరానికి గుర్తుండిపోయిన నటి.. అహ్సాస్ చన్నా! పరిశ్రమలోకి అబ్బాయిగా అడుగుపెట్టి.. ఇప్పుడు హీరోయిన్‌గా రాణిస్తున్నది. అయితే, బాల్యంలో తాను బలవంతంగానే బాలుడి పాత్రలు వేసినట్లు తాజాగా చెప్పకొచ్చింది.

ముంబయిలోని పంజాబీ సిక్కు కుటుంబంలో జన్మించిన అహ్సాస్ చన్నా.. ఐదేళ్ల వయసులోనే బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. 'వాస్తు శాస్త్రం' చిత్రంలో సుస్మితాసేన్ కొడుకు 'రోహన్'గా వెండితెరకు పరిచయమైంది. 2004లో విడుదలైన ఈ చిత్రానికి సెన్సేషనల్ డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించారు. 2006లో కరణ్ జోహార్ దర్శకత్వం వహించిన హిట్ చిత్రం.. 'కభీ అల్విదా నా కెహనా'లోనూ షారుఖ్ ఖాన్ – ప్రీతి జింటా కొడుకు 'అర్జున్' పాత్రలో ఒదిగిపోయింది.ఈ సినిమా అహ్సాస్‌కు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఆ తర్వాత 'మై ఫ్రెండ్ గణేశ్' చిత్రంలో వినాయకుడి స్నేహితుడు 'ఆశు'గా అలరించింది. ఇలా.. బాలనటిగా కంటే, బాల నటుడిగానే ప్రేక్షకులకు దగ్గరైంది అహ్సాస్ చన్నా. అయితే, తనకు ఏమాత్రం ఇష్టం లేకుండానే సినిమాల్లో అబ్బాయి పాత్రలు చేయాల్సి వచ్చిందని చెప్పకొచ్చింది చన్నా! తాజాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ విషయాలను వెల్లడించింది.తమ కుటుంబ సంప్రదాయంలో భాగంగా.. చిన్నతనంలో ఆమెకు గుండు చేయించారట. అప్పడే 'వాస్తుశాస్త్రం' ఆడిషన్స్ పాల్గొన్నది చన్నా. ఆమె నటనకు ఫిదా అయిన సినిమా బృందం.. బాలనటుడి పాత్రకు ఎంపిక చేసింది. ఆ సినిమా హిట్ అవ్వడంతో.. చన్నాకు వరుస అవకాశాలు దక్కాయి. అయితే.. అవన్నీ అబ్బాయి పాత్రలే! దాంతో బాలీవుడ్ డిమాండ్ మేరకు.. తాను ఎప్పడూ జుట్టు కత్తిరించుకొనే ఉండేదాన్ననీ, అబ్బాయిల్లానే డ్రెస్సింగ్ చేసుకునేదాన్ననీ వెల్లడించింది.

ఈ విధానం తనను మానసికంగా చాలా ప్రభావితం చేసిందనీ చెప్పకొచ్చింది. "కభీ అల్విదా..' తర్వాత అబ్బాయి పాత్రలు మానేద్దామని అనుకున్నా.. మంచి అవకాశాలు రావడంతో కొనసాగించక తప్పలేద'ని ఆమె వాపోయింది. ప్రస్తుతం హీరోయిన్‌గా సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేస్తూ బిజీగా మారిపోయింది భామ. ఇన్‌స్టాలోనూ అనేక బ్రాండ్లకు అంబాసిడర్‌గా పనిచేస్తున్నది.

## నా సినిమాలకు విభిన్నంగా టైటిల్స్ పెట్టడానికి కారణం అదే! : ఉపేంద్ర

కన్నడ విలక్షణ కథానాయకుడు ఉపేంద్ర విజయవాడలో సందడి చేశారు. ఉపేంద్ర తాజా సినిమా 'యూ ఐ' విజయోత్సవ యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉపేంద్ర మాట్లాడారు. చిత్రం మంచి ఆదరణ పొందిందని, మంచి కలెక్షన్లు వస్తున్నాయని ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పారు. ప్రేక్షకుల అభిరుచి మేరకు సినిమా తీశామన్నారు. థియేటర్లకు వెళ్లి సినిమా చూడాలని విజ్ఞప్తి చేశారు. 'యూ ఐ' సినిమాకు ఆడియన్సే స్టార్స్ అని ఉపేంద్ర చెప్పారు.



## గేమ్ చేంజర్‌కు జాతీయ అవార్డు వస్తుంది

### -ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో డైరెక్టర్ సుకుమార్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఎస్. శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'గేమ్ చేంజర్' జనవరి 10న విడుదల కాబోతోంది. సంక్రాంతికి రాబోతోన్న ఈ సినిమాను అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ అన్‌కాంప్రమైజ్డ్‌గా నిర్మించారు. ఈ మూవీలో రామ్ చరణ్ సరసన కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటించారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఛరిష్మా డ్రీమ్స్ రాజేష్ కల్లెపల్లి ఆధ్వర్యంలో డల్లాస్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ మాట్లాడుతూ.. 'శంకర్ చేసిన స్నేహితుడు సినిమాకు గెస్టుగా వెళ్లాను. ఆ టైంలో ఆయనతో మాట్లాడేందుకు కూడా చాలా టెన్షన్ పడ్డాను. నాతో కాకపోయినా ఎవరితో అయినా సరే ఓ తెలుగు సినిమా చేయండని అడుగుదామని కూడా అడగలేకపోయాను. కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా.. క్రికెట్‌కు సచిన్ ఎలాగో.. ఇండియన్ సినిమాకు శంకర్ అలా.. డైరెక్టర్లకే డైరెక్టర్ ఆయన. అలాంటి శంకర్ తో పని చేయడం నా అదృష్టం. నా నుంచి సోలో ఫిల్మ్ వచ్చి ఐదేళ్లు అవుతోంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఈ మూవీ ఏ ఒక్కర్నీ నిరాశపర్చదు. ఏం సాధించాలన్నా సహనం ఉండాలి. పుష్ప 2తో సుకుమార్ అద్భుతమైన విజయాన్ని అందుకున్నారు. అలాంటి సుకుమార్ మా ఈవెంట్‌కు వచ్చి మాట్లాడటం ఆనందంగా ఉంది. దిల్ రాజుతో పని చేయడం ఆనందంగా ఉంది' అని అన్నారు.

సెన్సేషనల్ డైరెక్టర్ సుకుమార్ మాట్లాడుతూ.. 'ఓవర్సీస్ ఆడియెన్స్ తెలుగు సినిమాల్ని ఎక్కువగా ఆదరిస్తుంటారు. వన్ నేనొక్కడినే మూవీని ఇక్కడి ఆడియెన్స్ ఆదరించి ఉండకపోతే నాకు నెక్ట్స్ సినిమాలు వచ్చేవి కావు. దిల్ రాజు నాకు ఫస్ట్ ఛాన్స్ ఇచ్చాడు. నన్ను నిలబెట్టినందుకు దిల్ రాజు రుణం ఎప్పటికీ తీర్చుకోలేను. శంకర్ చేతుల మీదుగా ఫిల్మ్ ఫేర్ అవార్డు తీసుకున్నాను. చిరంజీవి ఎందుకు శంకర్ తో సినిమా చేయలేదు.. శంకర్ ఎందుకు తెలుగు సినిమా చేయడం లేదు? అని అనుకునేవాళ్లం. కానీ శంకర్ తో రామ్ చరణ్ సినిమా అని తెలియడం తెగ ఆనంద పడ్డాను. ఈ విషయాన్ని రామ్ చరణ్ మొదటగా నాకే చెప్పినట్టున్నాడు. సూర్య తీసిన ఖుషి నాకు చాలా ఇష్టం. రైటర్‌గా వచ్చి డైరెక్టర్‌గా చేశా. ఖుషి సినిమాను రిఫరెన్సుగా పెట్టుకున్నాను. అంజలి మా ఊరు అమ్మాయి. చాలా బాగా నటించారు. నేను క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు తమన్ సాయం చేశాడు. కానీ అది నేను వాడుకోలేకపోయాను. రంగస్థలం అయిపోయాక కూడా ఆ అనుబంధం రామ్ చరణ్‌తో మాత్రమే కొనసాగింది. ఫస్ట్ హాఫ్ అద్భుతం.. ఇంటర్వెల్ బ్లాక్ బస్టర్.. సెకండాఫ్‌లో ఫ్లాష్ బ్యాక్ గూస్ బంప్స్, ఫినామినల్.. జెంటిల్మెన్, భారతీయుడు చిత్రాలను ఎంతగా ఎంజాయ్ చేశానో మళ్లీ అంతే ఎంజాయ్ చేశాను. రంగస్థలం తరువాత రామ్ చరణ్‌కు జాతీయ అవార్డు వస్తుందని అనుకున్నాను. కానీ రాలేదు. ఇక గేమ్ చేంజర్ క్లైమాక్స్‌లో రామ్ చరణ్ నటనకు జాతీయ అవార్డు పక్కాగా వస్తుంది' అని అన్నారు.

రామ్ చరణ్.. గేమ్ చేంజర్ చిత్రంలో రెండు పవర్‌ఫుల్ పాత్రల్లో మెప్పించనున్నారు. కార్తీక్ సుబ్బరాజ్ కథను అందించారు. ఎస్.యు.వెంకటేశన్, వివేక్ రైటర్స్‌గా వర్క్ చేశారు. హర్షిత్ సహ నిర్మాత. ఎస్.తిరుణ్ణావుక్కరసు సినిమాటోగ్రఫీ, ఎస్.ఎస్.తమన్ సంగీతం అందిస్తుండగా సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. నరసింహా రావు.ఎన్, ఎస్.కె.జబీర్ లైన్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆర్ట్ డైరెక్టర్‌గా అవినాష్ కొల్ల, యాక్షన్ కొరియోగ్రాఫర్స్‌గా అన్బరివు, డాన్స్ డైరెక్టర్‌గా ప్రభుదేవా, గణేష్ ఆచార్య, ప్రేమ్ రక్షిత్, బాస్కో మార్టిస్, జానీ, శాండీ వర్క్ చేస్తున్నారు. రామ్ జోగయ్య శాస్త్రి, అనంత్ శ్రీరామ్, కాసర్ల శ్యామ్ పాటలను రాశారు.

## దుబాయ్‌లో వేడుకగా ఎన్టీఆర్ సినీవజ్రోత్సవం

యుఏఇ ఎన్.ఆర్.ఐ. టీడీపీ ఆధ్వర్యంలో దుబాయ్ వేదికగా డిసెంబర్ 20 నుంచి 22 వరకు 3 రోజుల పాటు క్రిస్మస్ వేడుకలు, ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టి.డి. జనార్ధన్, తణుకు నియోజక వర్గ శాసన సభ్యుడు అరుమిల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు.

దుబాయ్ లోని బిర్యానీమోర్ వేదికగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఇందులో ఎన్టీఆర్ టీడీపీ సభ్యులు, ఐక్య శెట్టి బలిజ సంఘం సభ్యులు, ఐక్య క్రిస్మస్ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ టి.డి. జనార్ధన్ మాట్లాడుతూ.. విదేశాలలో ఉంటూ కూడా స్వదేశం పట్ల అభిమానం చూపిస్తున్న ఎన్నారైల మాతృభూమి భక్తి గొప్పదన్నారు. క్రిందటేడాది జరిగిన ఎన్నికలలో నారాచంద్రబాబు నాయుడి విజయం కోసం యుఏఈ నుంచి ఎందరో ఎన్నారైలు ఆంధ్రప్రదేశ్ కొచ్చి నెల రోజులకు పైగా పని చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అందరి సమష్టి కృషితోనే ఆంధ్రప్రదేశ్ లోమళ్లీ ప్రజాప్రభుత్వం ఏర్పాటయిందని, ప్రజల ఆకాంక్షల మేరకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఎన్డీఏ భాగస్వామి పార్టీల అధినేతలు పవన్ కళ్యాణ్, పురందేశ్వరిలు పని చేస్తున్నారన్నారు. శాసన సభ్యులు శ్రీ అరుమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. ఇక ఎన్నారై టీడీపీనేతలు నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్' వేడుకల్లో భాగంగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ కార్యక్రమాన్ని జరిపారు. ఆ సందర్భంగా ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ వెలువరించిన 'తారకరామం' పుస్తకాన్ని టి.డి. జనార్ధన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆరాధ్య నటుడు, రాజకీయ నాయకుడైన నందమూరి తారకరామారావు శతజయంతి సంవత్సరాన్ని క్రిందటేడాది ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఘనంగా జరుపుకున్నారని, ఎన్టీఆర్ సినీ ప్రస్థానం మొదలై 75 సంవత్సరాలైన సందర్భంగా ఇప్పుడు ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్ని అన్ని చోట్ల జరుపుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్ లో 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఇవ్వడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించిన విషయాన్ని టి.డి. జనార్ధన్ తెలియజేశారు. ఈ వేడుకల్లో పశ్చిమగోదావరి జిల్లా చాగల్లుకు చెందిన టీడీపీ యుఎన్ఐ అధ్యక్షుడు మోత్కురు విశ్వేశ్వరరావు, డాక్టర్ రవి, కోడి రాజాకిరణ్, పాడిపిరెడ్డి దాసు, డాక్టర్ ముక్క తులసి కుమార్, ఖాదర్ బాషా, సామ్యూల్ రత్నం, కుడుపూడి సత్య, కేత శెట్టి, జుత్తుగ శ్రీను, కోడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## సలార్ 2 మీ ఊహలకు అందదు: ప్రశాంత్ నీల్

ప్రభాస్ , పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటించిన 'సలార్: పార్ట్ 1 సీజ్ ఫైర్' ఫలితం విషయంలో అంత సంతోషంగా లేనని దర్శకుడు ప్రశాంత్ నీల్ అన్నారు. ఆయన రూపొందించిన ఈ మూవీ విడుదలై ఏడాది పూర్తయింది. బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోవడమే కాదు, రూ.700 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రశాంత్ నీల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

''ఉగ్రం'ను సరిగ్గా చెప్పలేకపోయాననే ఉద్దేశంతోనే మళ్లీ దాన్ని చెప్పాలనుకున్నట్లు గతంలో చెప్పారు. మరి 'సలార్ 1' ఫలితం మీకు థియేటర్‌లో ఆ స్థాయి సంతోషాన్ని ఇచ్చిందా?' అని ప్రశ్నించగా.. ''సలార్ 1' ఫలితంతో నేను సంతోషంగా లేను. ఫస్ట్ పార్ట్ కోసం నేను పడిన కష్టంతో పోలిస్తే, కాస్త నిరాశగానే అనిపించింది. ఎక్కడో 'కేజీయఫ్ 2' ఛాయలు కనిపించాయి. ఇక ఎప్పుడూ అలా జరగదు. 'సలార్ 2' మాత్రం నా కెరీర్‌లో బెస్ట్ మూవీగా తీస్తా. ప్రేక్షకుల అంచనాలను మించేలా తీర్చిదిద్దుతా.

జీవితంలో కొన్ని విషయాలపై చాలా స్పష్టతతో ఉన్నా. మరోసారి చెబుతున్నా, ఎవరూ ప్రశ్నించే వీలు లేకుండా 'సలార్ 2' నా బెస్ట్ మూవీల్లో ఒకటిగా ఉంటుంది'' అని ప్రశాంత్ నీల్ చెప్పాడు.'సలార్ పార్ట్ 2: శౌర్యంగ పర్వం' కోసం ప్రభాస్ అభిమానులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే, ఇది రావడానికి చాలా సమయమే పట్టే అవకాశం ఉంది. ఎందుకంటే ప్రశాంత్ నీల్ ప్రస్తుతం ఎన్టీఆర్‌తో మూవీ చేస్తున్నారు. 2025 ఫిబ్రవరి నుంచి షూటింగ్ మొదలయ్యే అవకాశం ఉంది.

## సంధ్య థియేటర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించా: జగపతి బాబు



సంధ్య థియేటర్ వద్ద చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి.. బాధిత కుటుంబాన్ని సినిమా వాళ్లు పరామర్శించట్లేదంటూ విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. దానిపై జగపతి బాబు తాజాగా స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. ''సినిమా షూటింగ్ ముగించుకుని నేను ఊరి నుంచి రాగానే.. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు హాస్పిటల్‌కు వెళ్లా. చికిత్స పొందుతున్న బాలుడి తండ్రిని, సోదరిని పలకరించాలని అనిపించి అక్కడకు వెళ్లా. అందరి ఆశీస్సులతో త్వరగానే కోలుకుంటాడని వారికి భరోసా ఇచ్చా. అందరి కంటే ఎక్కువ ఎఫెక్ట్ అయింది ఆ కుటుంబం కాబట్టి నా వంతు సపోర్టు ఇవ్వాలనుకున్నా. దానికి పబ్లిసిటీ చేయలేదు. అందుకే ఎవరికీ ఆ విషయం తెలియలేదు. దానిపై క్లారిటీ ఇవ్వడానికే ఈ పోస్టు'' అని తెలిపారు. తాను హీరోగా నటించిన 'పుష్ప 2' ప్రీమియర్ షో చూసేందుకు హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌కు అల్లు అర్జున్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన్ను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. రేవతి అనే మహిళ మృతి చెందారు. ఆమె కుమారుడు శ్రీతేజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంబంధిత కేసులో అల్లు అర్జున్ ఇటీవల అరెస్టు అయి బెయిల్‌పై విడుదలయ్యారు. పలువురు సినీ ప్రముఖులు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అయితే, బాధిత కుటుంబాన్ని సినిమా వారు కలవలేదంటూ విమర్శలు వస్తున్నాయి. మరోవైపు, ''తల్లి చనిపోయి, 20 రోజులుగా తొమ్మిదేళ్ల పిల్లాడు చావుబతుకుల మధ్య ఉంటే ఈ సినీ ప్రముఖులు ఒక్కరైనా ఆసుపత్రికి వెళ్లారా...? అంటే వారేం ఆలోచిస్తున్నారో నాకైతే తెలియదు. ఇది సిగ్గుపడాల్సిన విషయం'' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనడం గమనార్హం.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com